

పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,పక్షవాతములతోపాటు అన్ని రకాల రోగాలకు వనమూలికలతో వైద్యంచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరాలయము
నారాయణపేట రోడ్డు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar సంపుటి :26 సంచిక :93 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు గురువారం 13 ఆగస్టు 2026 పేజీలు :12 వేల రూ5 /-


## ఆర్మీ నియామకాల్లో తెలంగాణ
# యువతను ప్రోత్సహించాలి

### సైనిక ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ భేటీ

**హైదరాబాద్:**భారత ఆర్మీ చేపట్టే వివిధ నియామకాల్లో తెలంగాణ యువతను ప్రోత్సహించే విధంగా కలిసి పనిచేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారు భారత ఆర్మీ సదరన్ కమాండ్ అధికారులకు తెలిపారు. ఆర్మీ సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్–ఇన్–చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ పలువురు ఆర్మీ ప్రతినిధులతో ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్లో ముఖ్యమంత్రి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ఉన్నారు. ఆర్మీ నియామకాల్లో స్థానిక యువతకు భారీ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆసక్తి ఉన్న అనువైన జిల్లా కేంద్రాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కోరగా లెఫ్టినెంట్ జనరల్ సుముఖత వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా నిర్వహించే వివిధ ఆర్మీ రిక్రూట్మెంట్లకు ముందస్తుగా తెలంగాణలోని ఆయా జిల్లా కేంద్రాల్లో యువతకు శిక్షణ కేంద్రాల ఏర్పాటు చేస్తామని తెలిపారు. దేశంలో విపత్తుల సమయంలో ఆర్మీ పోషిస్తున్న పాత్రను ముఖ్యమంత్రి అభినందించారు. రాష్ట్రంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ ఆపరేషన్లు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస చర్యల్లో ఆర్మీ యంత్రాంగం మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి కోరారు. తెలంగాణలో విపత్తు




పరిస్థితుల్లో ప్రత్యేకంగా చొరవ - మిగతా3లో

## తెలంగాణలో ఓటర్ల
# జాబితా సవరణ

- ఫ్యామిలీ సర్టిఫికెట్‌పై ఈసీ స్పష్టత
- తెలంగాణ ఓటర్ల జాబితా సవరణలో కీలక పరిణామం
- ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ చెల్లదన్న ఎన్నికల సంఘం
- ఇది రేషన్ కార్డుతో సమానమని, రుజువుగా అంగీకరించలేమని స్పష్టత
- నోటీసులు అందుకున్న ఓటర్లు ఇతర పత్రాలు సమర్పించాలని సూచన

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా, 'ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్'ను గుర్తింపు పత్రంగా అంగీకరించబోమని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) స్పష్టం చేసింది. ఈ సర్టిఫికెట్ల జారీపై గత కొంతకాలంగా నెలకొన్న గందరగోళానికి ఈసీఐ తాజా ప్రకటనతో తెరపడింది. రేషన్ కార్డు (ఆహార భద్రత కార్డు) డేటా ఆధారంగా తెలంగాణ ప్రభుత్వం జారీ చేస్తున్న ఈ సర్టిఫికెట్, రేషన్ కార్డుతో సమానమని ఎన్నికల సంఘం తన వివరణలో - మిగతా3లో






## 10 శాతం
# కమీషన్ వివాదం!

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భార్య నందిని భట్టిపై గవర్నర్‌కు ఫిర్యాదు

**హైదరాబాద్, ఆగస్టు 12:**తెలంగాణ డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని భట్టిపై ఇటీవల ఆరోపణలు వచ్చాయి. రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ బకాయిల విడుదలకు ఆమె కమీషన్ డిమాండ్ చేశారంటూ తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి. దీనిపై అంబర్‌పేటకు చెందిన న్యాయవాది, సామాజిక కార్యకర్త కరుపోతుల రేవంత్, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాకు ఫిర్యాదు చేశారు. నిష్పక్షపాతంగా, ఈ ఆరోపణలపై విచారణ జరిపించాలని కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేయాలని ఆయన గవర్నర్‌ను విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు లేఖ రాశారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఆగస్టు 9, 2026న రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు చేపట్టిన - మిగతా3లో

## జీవితంలో అడ్డదారుల
# వెంట పడొద్దు


### యువతకు ప్రధాని సూచన

**న్యూఢిల్లీ ఆగస్టు 12:**నరేంద్ర మోదీ నేటి తరం యువతకు (జెన్–జీ) పలు కీలక సూచనలు చేశారు. జీవితంలో అడ్డదారుల వెంట పడొద్దని, అవి అంతిమంగా తీవ్ర నష్టాలకే దారితీస్తాయని ఆయన హెచ్చరించారు. అదే సమయంలో, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బుధవారం నాడు ఢిల్లీలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.రైల్వే స్టేషన్లలో తరచూ కనిపించే ఒక హెచ్చరికను ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేశారు. "షార్ట్‌కట్ విల్ కట్ యు షార్ట్" (అడ్డదారి మీ జీవితాన్ని కుదిస్తుంది) అనే బోర్డు కేవలం రైల్వే ట్రాక్‌లకే కాకుండా, నిజ జీవితానికి కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు అందుబాటులో ఉన్నప్పటికీ, త్వరగా వెళ్లాలనే తొందరలో కొందరు ప్రమాదకరంగా పట్టాలు దాటుతుంటారని, అటువంటి



అనాలోచిత నిర్ణయాలు ప్రాణాంతకమని ఆయన హెచ్చరించారు.యువత తప్పుడు మార్గాలను వీడి, అర్థవంతమైన జీవన గమనాన్ని ఎంచుకోవాలని ప్రధాని మోదీ సూచించారు. "మీరు ఆరాధించే మహనీయుల జీవిత చరిత్రలను తప్పనిసరిగా చదవండి. వాటి ద్వారా - మిగతా3లో

## జీఆర్ఎంబీ అజెండాపై
## తెలంగాణ సర్కార్
# అభ్యంతరాలు




**హైదరాబాద్, ఆగస్టు 12 :** జీఆర్ఎంబీ అజెండాపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ నెల 18వ తేదీన జీఆర్ఎంబీ 18వ సమావేశం జరగనుంది. తెలంగాణ ప్రాజెక్టులపై మూడు అంశాలు అజెండాలో పెట్టడంపై అభ్యంతరం తెలిపింది. సమ్మక్క బ్యారేజీకి అనుమతులు నిలిపివేయాలనే అంశాన్ని తొలగించాలని కోరింది. తెలంగాణ ప్రాజెక్టుల TAC అనుమతుల వివరాల అంశం కూడా వద్దని తెలిపింది. CWC-TAC, MoJS ఇచ్చిన అనుమతుల సమీక్ష అంశంపైనా ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది.ఈ అంశాలపై ఇప్పటికే జీఆర్ఎంబీలో విస్తృతంగా చర్చించామని వెల్లడించింది. గతంలో ఏపీ అభ్యంతరాలను CWC పరిశీలించి తిరస్కరించిందని తెలంగాణ సర్కార్ వాదించింది. GWDT అవార్డు, జఔజ మార్గదర్శకాల ప్రకారమే ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చినట్లు స్పష్టం చేసింది. మూడు అంశాలను అజెండా నుంచి డ్రాప్ చేయాలని జీఆర్ఎంబీకి తెలంగాణ సర్కార్ లేఖ రాసింది. సవరించిన అజెండా విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

## నియోపోలీస్ లో ఎకరా
# 120 కోట్లు...




**హైదరాబాద్, ఆగస్టు 12:**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధుల సమీకరణే లక్ష్యంగా కోకాపేట్‌లోని నియోపోలిస్, గోల్డెన్ మైల్ లేఅవుట్లతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న విలువైన భూములను వేలం వేయడానికి సిద్ధమైంది. నియోపోలిస్‌లో ఎకరానికి కనీస ధర రూ. 120 కోట్లుగా, గోల్డెన్ మైల్‌లో రూ. 70 కోట్లుగా ఖరారు చేశారు. ఈ వేలం ప్రక్రియ ఆగస్టు 24 నుంచి సెప్టెంబర్ 9 వరకు సాగనుంది. మోకిలా, బాచుపల్లి, సూరారం వంటి నివాస ప్రాంతాల్లోని ఖాళీ ప్లాట్లను కూడా ఈ–వేలంలో ఉంచారు.హైదరాబాద్ నగర పరిధిలో భూముల విక్రయాల ద్వారా భారీగా ఆదాయం సమీకరించడమే ధ్యేయంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ మరొక భారీ ఈ–వేలానికి శ్రీకారం చుట్టింది. అత్యంత ఖరీదైన - మిగతా3లో



## లోక్‌సభ స్పీకర్‌కు కేంద్ర హోం మంత్రి
# అమిత్ షా లేఖ

**ఢిల్లీ, ఆగస్టు 12:** దేశవ్యాప్తంగా కలకలం రేపిన నీట్ పరీక్ష వివాదం, అనంతర విద్యార్థుల ఆందోళనలపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఆయన ఒక అధికారిక లేఖ రాశారు.బిజినెస్ అడ్వైజరీ కమిటీ (దీూజ) సమావేశంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఇప్పటికే ప్రభుత్వం తరఫున నీట్ అంశంపై చర్చకు అంగీకారం తెలిపారని అమిత్ షా తన లేఖలో గుర్తుచేశారు. ప్రతిపక్షాలు ఈ అంశాన్ని తీవ్రంగా ఎత్తిచూపడానికి ముందే, ప్రస్తుత సమావేశాల్లోనే 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు, 2026' పై సుదీర్ఘ చర్చ జరిగిందని లేఖలో హోం మంత్రి ప్రస్తావించారు. అయితే ఆ సమయంలో - మిగతా3లో

## మిల్లర్లనుంచి బకాయిలు
# వసూలు చేయాల్సిందే

**హైదరాబాద్:**మిల్లర్లు బకాయిపడిన ధాన్యం విలువకు సంబంధించిన మొత్తాన్ని వసూలు చేయాల్సిందేనని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యాపార దృక్పథంతో మిల్లులు నడిపే వారితో సానుకూలంగా ఉంటామని, ఉద్దేశపూర్వకంగా ఎగవేతలకు ప్రయత్నించే వారితో కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి పౌరసరఫరాల శాఖపై ఆ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్రెడ్డి తో కలిసి ఎంసీఆర్హెచ్ఆర్డీలో సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం వేల కోట్ల రూపాయల బకాయిలకు అవకాశం ఇచ్చి, తిరిగి ఆ తప్పిదాన్ని ప్రస్తుత ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు.ఇప్పటికే బకాయిల వసూలులో కొంత పురోగతి ఉందని, అయితే ప్రతి ధాన్యం గింజకు సంబంధించి బకాయిని వసూలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. బకాయిల వసూలుకు సంబంధించి విధివిధానాలను రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. విధివిధానాల రూపకల్పన పూర్తయిన తర్వాత ఆ నివేదికను మంత్రివర్గ ఉప సంఘానికి సమర్పించాలని సూచించారు. మంత్రివర్గ ఉప సంఘం పరిశీలన అనంతరం ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. మొండి బకాయిదారులుగా మారిన మిల్లర్లకు కేటాయించే ధాన్యాన్ని మహిళా సంఘాలకు కేటాయించి మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తామని చెప్పారు. ప్రతి సీజన్లో ధాన్యం నిల్వకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే తగు కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ధాన్యం భారీగా వచ్చే నల్గొండ, సూర్యాపేట, నిజామాబాద్, పెద్దపల్లి,



కామారెడ్డి జిల్లాల్లో సైలో బ్యాగ్ ల ఏర్పాటుకు పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టాలని ఆదేశించారు.స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో సైలో బ్యాగ్ నిర్మాణాలకు నియోజకవర్గానికి 50 నుంచి 100 ఎకరాల భూమిని కేటాయిస్తామని ముఖ్యమంత్రి తెలియజేశారు. వీటి నిర్మాణానికి సంబంధించి రెవెన్యూ, పౌరసరఫరాలు, మహిళా సంక్షేమ శాఖల మంత్రులతో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. వీబీ జీ రామ్ జీ లో ప్లాట్ఫాంల నిర్మాణానికి అవకాశం ఉన్నందున, విశాలమైన ప్లాట్ఫాంలు నిర్మించి జర్మన్ టెంట్లతో ధాన్యం నిల్వకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. మండల, గ్రామ స్థాయిలో ఉన్న ప్రైవేటు గోదాములు, ధాన్యం నిల్వకు ఉపయోగపడే కల్యాణ మండపాలు, పాత థియేటర్లు, ఇతర షెడ్లను ముందుగానే గుర్తించి ధాన్యం నిల్వకు లీజుకు తీసుకోవాలని సూచించారు.

# సంపాదకీయం

## వాయిదాల లోక్‌సభ ఎవరికి ఉపయోగం?

ప్రజా సమస్యలపై చర్చలు జరపాల్సిన లోక్‌సభ డెడ్‌లాక్ నిరంతరం కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వ విధానాలు లేదా ఏవైనా వివాదాస్పద అంశాలపై చర్చ జరగాలని విపక్షాలు పట్టుబట్టడం సహజమే అయినప్పటికీ, ప్రభుత్వం ఒక నిర్దిష్ట అంశంపై చర్చకు సిద్ధమని ప్రకటించినా , స్పీకర్ సమయం కేటాయించినా.. మరో అంశాన్ని ముందుకు తెస్తూ సభను స్తంభింపజేయడం ప్రజాస్వామ్య వ్యవస్థలకే సవాలుగా మారుతోంది.పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో ప్రతిపక్షాలు వివిధ అంశాలపై చర్చలతో పాటు మంత్రుల ప్రకటనలు, రాజీనామాలను డిమాండ్ చేస్తూ నిరసనలకు దిగడం వల్ల ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్ దాదాపుగా కొట్టుకుపోయాయి. ప్రభుత్వం కొన్ని కీలక బిల్లులపై చర్చకు సిద్ధపడినా, ఇతర ప్రాధాన్యతలపై విపక్షాల సభా దిగ్బంధం వల్ల అనేక బిల్లులు చర్చలు లేకుండానే ఆమోదం పొందాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పార్లమెంట్ కార్యకలాపాలు సాఫీగా సాగడానికి ప్రజల సొమ్ము కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంటే, రోజూ సభ వాయిదాలు పడటంతో ప్రజ సమస్యలు పక్కనపడిపోతున్నాయనే విమర్శలు జాతీయ మీడియాలో ప్రధానంగా వస్తున్నాయి.ఈ తరహా సభా దిగ్బంధం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నప్పటికీ, అసలేమీ చర్చ జరగకుండా సభ వాయిదా పడటం కంటే.. ఏ ఒక్క అంశం పైనైనా సభలో ఫలవంతమైన చర్చ జరగడం ప్రజాస్వామ్యానికి ఎంతో శ్రేయస్కరం. నీట్ అక్రమాలపై ఢిల్లీలో నిరసనలకు దిగిన విద్యార్థులపై పోలీసుల దాడులపై ఇప్పటివరకూ పార్లమెంట్ కు వచ్చి సమాధానం చెప్పకుండా తప్పించుకుంటున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముప్పేట దాడి నేపథ్యంలో వెనక్కి తగ్గారు. అమిత్ షాను ఎలాగైనా పార్లమెంట్ కు రప్పించాలని విపక్షాలు పార్లమెంట్ ఉభయసభల్ని స్తంభింపచేస్తున్న వేళ.. ఎట్టకేలకు అమిత్ షా తన నిర్ణయం మార్చుకున్నారు. పార్లమెంట్ కు హాజరై ఢిల్లీ పోలీసుల దాడులపై సమాధానం ఇవ్వాలని నిర్ణయించారు. నీట్ అక్రమాల నేపథ్యంలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ గత నెలలో విద్యార్థులు కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో పార్లమెంట్ మార్చ్ కు బయలుదేరారు. వీరిని అడ్డుకునేందుకు ఢిల్లీ పోలీసులు లాఠీఛార్జ్, బాష్పవాయువు ప్రయోగాలతో పాటు పెల్లెట్ గన్ లను కూడా ప్రయోగించారు. అలాగే మేకులు కొట్టిన లాఠీలతో బాదడం, ఎలక్ట్రిక్ బేటన్లతో కొట్టడం చేశారు. దీంతో భారీ సంఖ్యలో విద్యార్థులు గాయాలపాలయ్యారు. వీరిని వివిధ ఆస్పత్రుల్లో కేంద్రమంత్రులు పరామర్శించారు. అప్పటి నుంచీ ఈ దారుణాలపై హోంమంత్రి అమిత్ షా సమాధానం కోసం విపక్షాలు పట్టుబడుతున్నా కేంద్రం ఒప్పుకోవడం లేదు ఈ నేపథ్యంలో విపక్షాలు నిత్యం ఉభయసభల్ని స్తంభింపచేస్తున్నా అమిత్ షా మాత్రం సభకు రావడం లేదు. దీంతో ఓ దశలో రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ కూడా విపక్షాల డిమాండ్ ప్రకారం అమిత్ షాను సభకు రప్పించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజుకు సూచించారు. దీంతో పరీక్షల అవకతవకలకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల సందర్భంగా ఢిల్లీలో పెల్లెట్ గన్‌లు, బీహార్‌లో ఏకే-47లను ఉపయోగించడంపై హోం మంత్రి అమిత్ షా పార్లమెంటులో హాజరై వివరణ ఇవ్వాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌కు అంగీకరిస్తున్నట్లు, పోలీసుల చర్యతో సహా విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ప్రతి అంశంపై పార్లమెంటులో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. అయితే సభా కార్యకలాపాల సమయంలో ప్రతిపక్షాలు హంగామా సృష్టించకూడదని మంత్రి షరతు పెట్టారు.పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం ప్రతిపక్షాల హక్కు అయినప్పటికీ, అది ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలగకుండా సభ సజావుగా సాగేందుకు తోడ్పడేలా ఉండాలన్నది రాజ్యాంగ నిపుణుల భావన. చర్చల ద్వారా మాత్రమే విధాన నిర్ణయాల్లో లోపాలను సరిదిద్దడం, ప్రభుత్వ జవాబుదారీతనాన్ని నిర్ధారించడం సాధ్యమవుతుంది. రామమందిర విరాళాలపై అమిత్ షా చేసిన ప్రకటనపై ప్రతిపక్ష కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్‌లో మంగళవారం కూడా నిరసన చేపట్టారు. మాకు అడ్డంకులు సృష్టిస్తారా అంటూ పాలక పక్ష ఎన్‌డీఏ ఎంపీలు పోటీగా నిరసన చేపట్టారు. పార్లమెంట్ ప్రధాన ద్వారాల్లోని ఒకటైన మకర ద్వారం వద్ద ప్రతిపక్ష, పాలక పక్ష ఎంపీలు పోటాపోటీగా నినాదాలు చేశారు.ఢిల్లీలో విద్యార్థి నిరసనకారులపై పోలీసుల అణచివేత, రామ మందిరం విరాళాల దుర్వినియోగంపై హోం మంత్రి అమిత్ షా పార్లమెంటుకు వచ్చి చర్చించాలని ప్రతిపక్ష ఎంపీలు పట్టుబట్టారు. కాంగ్రెస్ నేతృత్వంలోని జార్ఖండ్‌లో నిరసనలు చేపట్టిన విద్యార్థులపై హేమంత్ సొరేన్ ప్రభుత్వం లాఠీచార్జీ జరిపించిందని, దీనిపై చర్చించడానికి రాహుల్‌గాంధీ పారిపోతున్నారని, డబుల్ గేమ్ ఆడుతున్నారని ఆరోపిస్తూ పాలక పక్ష ఎంపీలు ఎదురు నిరసనలు చేపట్టారు.పార్లమెంటు ను ఉద్దేశించి ప్రసంగించడానికి, ప్రతిపక్షాల ప్రశ్నలకు బదులివ్వడానికి అమిత్ షా సిద్ధంగా ఉన్నారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు చెప్పారు. అయినా ప్రతిపక్ష ఎంపీలు తమ నిరసన కొసాగించారు. రామ మందింలో విరాళాల దుర్వినియోగంపై ప్రతిపక్ష ఎంపీలు ఒక స్కిట్ ఈ నిరసనలో ప్రదర్శించారు.పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి , స్పీకర్ నేతృత్వంలో విపక్ష నేతలతో చర్చలు జరిపి సభా స్థంభనను తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ.. ఉభయ పక్షాల మధ్య సమ్మతి కొరవడటంతో గందరగోళం కొనసాగుతోంది. ఏదేమైనా, విపక్షాలు వాకౌట్‌లు లేదా ఆందోళనలతో సమయాన్ని వృథా చేయకుండా, దొరికిన అవకాశాన్ని ఉపయోగించుకుని ప్రభుత్వం ఇచ్చే చర్చల్లో పాల్గొనడమే ప్రజాస్వామ్య బలాన్ని పెంచుతుంది.ఢిల్లీ ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సమాధానం చెప్పి తీరాల్సిందేనని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. విద్యార్థులపై దాడి ఘటనపై ప్రకటన ఇవ్వడానికి ఆయన పార్లమెంట్‌కు రావాల్సిందేనని పట్టుబట్టారు. పోలీసుల దాడిలో యువతులు, మైనర్లు గాయపడ్డారని అన్నారు. కాల్పులపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరగాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

# స్వాతంత్ర్య దినోత్సవానికి రెడ్ ఫోర్ట్ సిద్ధం

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:**17వ శతాబ్దంలో వర్తకం కోసం ఇండియాకు వచ్చిన ఆంగ్లేయులు.. తర్వాత నాటి దేశంలోని అనైక్యతను ఆసరాగా తీసుకుని చివరకు అధికారం చేజిక్కించుకుని పెత్తనం చెలాయించారు. దాదాపు 200 సంవత్సరాల పాటు సాగిన బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు జరిగాయి. చివరకు 1947లో భరతమాతకు విదేశీ పాలన నుంచి విముక్తి లభించింది. ఆ ఏడాది 15న స్వాతంత్ర్యం లభించింది. అప్పటి నుంచి ఏటా ఆగస్టు 15న భారతావని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జరుపుకుంటోంది. భారతదేశం మరో నాలుగు రోజుల్లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోనుంది. అయితే ఈ వేడుక సమీపిస్తున్న తరుణంలో ఒక ప్రశ్న తరచుగా వేధిస్తుంది. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం 79వదా లేక 80వదా?. భారతదేశం స్వాతంత్ర్య పొంది ఎన్ని సంవత్సరాలు గడిచాయి? లేదా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సంఖ్య ఎంత? అనే దానిపై ఈ సమాధానం ఆధారపడి ఉంటుంది. బ్రిటిష్ పాలన నుంచి భారతదేశం 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం పొందింది. అందువల్ల 2026 ఆగస్టు 15 నాటికి దేశం 79 ఏళ్ల స్వాతంత్ర్యాన్ని పూర్తి చేసుకుంటుంది. కానీ, 2026 ఆగస్టు 15 భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను సూచిస్తుంది.

**79 లేదా 80వ వేడుకనా?**

భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం సిద్ధించింది. కాబట్టి 2026 ఆగస్టు 15 నాటికి 79 ఏళ్లు పూర్తవుతాయి. అంటే, 2026 - 1947 = 79 సంవత్సరాలు. అదే



సమయంలో మొదటి స్వాతంత్ర్య దినోత్సవాన్ని 1947లోనే జరుపుకున్నాం. ఆ వేడుకను మొదటి స్వాతంత్ర్య దినోత్సవం అనుకుంటే 2026 నాటికి ఇది 80వ వేడుక అవుతుంది. కాబట్టి, వేటిని పరిగణనలోకి తీసుకుంటున్నారనే దానిబట్టి ఈ రెండు పదాలు సరైనవే కావచ్చు. ఎందుకంటే 2026 నాటికి 79 వ స్వాతంత్ర్యం పూర్తవుతుంది. 2026 ఆగస్టు 15న 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఆగస్టు 15, 1947 భారత మొదటి స్వాతంత్ర్య దినోత్సవం.

**ఈ ఏడాది 80వ స్వాతంత్ర్య దినోత్సవమా?**

వార్షికోత్సవానికి, సంఖ్యతో కూడిన వేడుకకు మధ్య ఉండే వ్యత్యాసమే ఈ గందరగోళానికి ప్రధాన కారణం. 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు, దేశం తన తొలి స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంది. ఆ తర్వాత సంవత్సరం రెండోది. ప్రతి ఆగస్టు 15న ఈ లెక్కింపు కొనసాగింది.

1947 - మొదటి స్వాతంత్ర్య దినోత్సవం
1948 - రెండో స్వాతంత్ర్య దినోత్సవం
1949 - మూడో స్వాతంత్ర్య దినోత్సవం
2025 - 79వ స్వాతంత్ర్య దినోత్సవం
2026 - 80వ స్వాతంత్ర్య దినోత్సవం

కాబట్టి దేశానికి స్వాతంత్ర్య వచ్చి 79 ఏళ్లు పూర్తయినప్పటికీ, 2026 ఆగస్టు 15 భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం కావడానికి ఇదే కారణం.భారత్ 2026లోనే తన 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటుంది. 79 వసంతాలు పూర్తి చేసుకుంటుంది. భారతదేశానికి స్వాతంత్ర్య వచ్చి ఎన్ని సంవత్సరాలైంది అని అడిగితే సమాధానం 79 ఏళ్లు. భారతదేశం ఎన్నో స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటుంది అని అడిగితే, సమాధానం 80వ స్వాతంత్ర్య దినోత్సవం.

**స్వాతంత్ర్య దినోత్సవం 2026 వేడుకలు**

దాదాపు రెండు శతాబ్దాల బ్రిటిష్ పాలన నుంచి దేశానికి 1947 ఆగస్టు 15న విముక్తి లభించడంతో ఏటా స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటారు. దేశవ్యాప్తంగా జెండా వందన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర వేడుకలతో దీనిని నిర్వహిస్తారు. ప్రధాన జాతీయ వేడుక న్యూఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరుగుతుంది. అక్కడ ప్రధాన మంత్రి జాతీయ జెండాను ఆవిష్కరించి దేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారు

# బలవంతపు నిరసనలతో బలం పెరిగేనా

**నెల్లూరు, ఆగస్టు 12:**వైఎస్ జగన్ వ్యూహం తప్పుతున్నట్లు కనిపిస్తుంది. ఆయన మెగా డీఎస్సీలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు చేయడమే కాకుండా దీనికి ఎండ్ కార్డు మాత్రం పడే అవకాశం లేదు. టీడీపీ ప్రస్తుతం కూటమిలో ఉంది. కేంద్ర ప్రభుత్వానికి చంద్రబాబు అవసరం ఎంతో ఉంది. కేంద్రం నుంచి కూడా స్పందన వచ్చే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో ఈ పోరు కు అంతం లేదు. కాకుంటే ఆంధ్రప్రదేశ్ లో నిరుద్యోగ యువత నుంచి కొంత మద్దతు దొరుకుతుందేమోనని వైసీపీ భావించి మెగా డీఎస్సీలో అవకతవకలంటూ ఆందోళనలు, నిరసనలు కంటిన్యూ చేస్తుంది. ఈ ఆందోళనల్లో పాల్గొంటున్న వైసీపీ నేతలకే దీని వల్ల రాజకీయ ప్రయోజనం ఎంత వరకూ వస్తుందన్నది కూడా అంతు చిక్కకుండా ఉంది. కానీ పార్టీ అధినాయకత్వం ఆదేశాల మేరకు ఆందోళనలు చేయాల్సి వస్తుందని అంటున్నారు. వైసీపీ చేపట్టిన ఆందోళనల వల్ల ప్రయోజనం ఎంత మేరకు ఉంది? బలవంతపు నిరసనలుగానే కనిపిస్తుంది. ఈ ఆందోళనల్లో యువత పెద్దగా పాల్గొనకపోవడం కూడా చర్చనీయాంశమైంది. టీడీపీ దీనిని హైలెట్ చేస్తుంది. మెగా డీఎస్సీ రాసిన వారు ఎవరూ ఈ ఆందోళనల్లో పాల్గొనకపోవడంతోనే వైసీపీ ఆందోళనలు, నిరసనలు వృథా ప్రయాస అని అంటున్నారు. కానీ ఒకసారి బరిలోకి దిగి వెనక్కు తగ్గకూడదన్న ఏకైక కారణంతోనే వైసీపీ నేతలు ఆందోళనలు కొనసాగిస్తున్నారన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. వైసీపీ ఏ అంశంలోనైనా దానిని తుది వరకూ తీసుకెళ్లగలమన్న నమ్మకం ఉంటేనే కొనసాగించాలని, లేకుంటే కొన్ని రోజులు ఆందోళనలు చేసి వదిలేస్తే మంచిదన్న సూచనలు కూడా వెలువడుతున్నాయి. కానీ జగన్ మాత్రం మెగా డీఎస్సీపై ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేయాల్సిందేనన్న ఆదేశాలు ఇవ్వడంతో నేతలు విధిలేని పరిస్థితుల్లో చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మెగా డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేపట్టిన పోరాటం వల్ల రాజకీయంగా ఆ పార్టీకి పెద్దగా లాభం చేకూరకపోగా, న్యాయస్థానంలో ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఎంపికైన అభ్యర్థులు, ప్రభుత్వం నుంచి వ్యతిరేకత ఎదురవుతోంది.న్యాయస్థానంలో ఎదురుదెబ్బలుమెగా డీఎస్సీ అక్రమాలపై వైసీపీ దాఖలు చేసిన పిల్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది.రాజకీయ ప్రయోజనాల కోసం పిల్స్‌ను వాడరాదని కోర్టు స్పష్టం చేసింది. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు వైసీపీ తీరుపై రోడ్లపైకి వచ్చి నిరసనలు



తెలుపుతున్నారు.ఇది కేవలం డైవర్షన్ రాజకీయాలంటూ అధికార కూటమి పార్టీ నేతలు ఎదురుదాడి చేస్తున్నారు.మెగా డీఎస్సీ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని ప్రభుత్వం, అభ్యర్థులు చెబుతుండటంతో, ఈ అంశంపై వైసీపీ పోరు జనంలోకి బలంగా వెళ్లడం లేదనే విశ్లేషణలు వస్తున్నాయి. మొత్తం మీద ఈ పోరాటం నిష్ప్రయోజనమేనని అంటున్నారు.

# జనసేనకు మరో మంత్రి పదవి..?

**విశాఖపట్టణం, ఆగస్టు 12:**ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో త్వరలోనే ఒకేసారి కీలక పరిణామాలు చోటుచేసుకోబోతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం త్వరలోనే ఏపీ క్యాబినెట్ ప్రక్షాళనకు సిద్ధమవుతున్నట్లు అమరావతి వర్గాల్లో గట్టి ప్రచారం సాగుతోంది. ఈ ప్రక్షాళనలో భాగంగా భాగస్వామ్య పక్షమైన జనసేన పార్టీకి మరో అదనపు మంత్రి పదవి దక్కే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం జనసేన నుంచి క్యాబినెట్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తోపాటు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ మంత్రులుగా కొనసాగుతుండగా.. ఇప్పుడు నాలుగో బెర్త్ ఎవరికి దక్కుతుందనే అంశంపై కూటమి రాజకీయాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది.ఈసారి దక్కబోయే అదనపు మంత్రి పదవిని ఉత్తరాంధ్ర రీజియన్‌కు కేటాయించాలని కూటమి పెద్దలు భావిస్తున్నట్లు సమాచారం. ఉత్తరాంధ్ర ప్రాంతంలో జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ వ్యూహాన్ని రచిస్తున్నారు. ఇప్పటికే



ఉత్తరాంధ్ర నుంచి ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తుండగా.. జనసేన కోటాలో రాబోయే ఈ కొత్త పదవితో ఉత్తరాంధ్రకు లభించనున్న నాలుగో మంత్రి పదవిగా ఇది నిలవనుంది. ముఖ్యంగా ఈ మంత్రి పదవి రేసులో బీసీ వర్గాలకు పెద్దపీట వేయాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం మంత్రి పదవి రేసులో ఇద్దరు కీలక నేతల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అందులో ఒకరు అనకాపల్లి నుంచి గెలిచిన సీనియర్ నేత కొణతాల రామకృష్ణ కాగా.. మరొకరు విశాఖపట్నం సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్. అయితే, ఉత్తరాంధ్రలో అత్యంత బలమైన సామాజికవర్గంగా ఉన్న గవర వర్గాన్ని ప్రసన్నం చేసుకునేందుకు ఆ వర్గానికి చెందిన సీనియర్ లీడర్ కొణతాల రామకృష్ణకే మంత్రి పదవి దక్కే అవకాశాలు అత్యధికంగా ఉన్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది.ఆయనకున్న రాజకీయ అనుభవం, సీనియారిటీ కూడా దీనికి ప్లస్ పాయింట్‌గా మారే అవకాశం ఉంది. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ పేరు కూడా గట్టిగా పరిశీలనలో ఉన్నప్పటికీ, సామాజిక సమీకరణాలు మరియు ప్రాంతీయ బలోపేత వ్యూహాల ప్రకారం కొణతాల రామకృష్ణ వైపే అధిష్ఠానం మొగ్గు చూపవచ్చని అంటున్నారు. ఈ నెలాఖరు లేదా వచ్చే నెల ప్రారంభంలో జరగబోయే క్యాబినెట్ విస్తరణపై త్వరలోనే అధికారికంగా పూర్తి స్పష్టత రానుంది.

# 172 దేశాలకు ఈ-వీసా వ్యవస్థ!

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:**భారత్‌ను సందర్శించే అంతర్జాతీయ ప్రయాణికులకు ప్రయాణ సౌలభ్యాన్ని మరింత పెంపొందించే దిశగా కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. పంజాబ్‌లోని భారత్-పాకిస్థాన్ సరిహద్దులో ఉన్న ప్రముఖ అట్టారీ ల్యాండ్ పోర్టుతో పాటు మరో 10 అంతర్జాతీయ కేంద్రాలోకి ఈ-వీసా హోల్డర్లకు ప్రవేశాన్ని కల్పిస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నూతన నోటిఫికేషన్ విడుదల చేసింది. తొమ్మిది ల్యాండ్ పోర్టులు, రెండు విమానాశ్రయాలను ఈ జాబితాలో చేర్చడంతో.. దేశవ్యాప్తంగా ఈ-వీసా ద్వారా భారత్‌లోకి ప్రవేశించడానికి అనుమతి ఉన్న అంతర్జాతీయ కేంద్రాల సంఖ్య ఏకంగా 88కి చేరింది.కేంద్రం తాజాగా విడుదల చేసిన సవరించిన నిబంధనల ప్రకారం.. విదేశీ ప్రయాణికులకు ప్రవేశం కల్పించే మొత్తం 88 కేంద్రాలలో 37 విమానాశ్రయాలు, 38 ఓడరేవులు, 13 ల్యాండ్ పోర్టులు ఉన్నాయి. అయితే కొత్తగా మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్, ఆంధ్రప్రదేశ్‌లోని ఆధ్యాత్మిక నగరం తిరుపతి విమానాశ్రయాలను కొత్తగా ఈ-వీసా జాబితాలో చేర్చారు. అలాగే కొత్తగా పంజాబ్‌లోని అట్టారీతో పాటు రక్సాల్, రూపైడిహా, జోగ్బానీలతో పాటు దర్రంగా, గెడే, ఘోజాదంగా, హరిదాస్‌పూర్, జైగావ్, డావ్కీ, మోరే సరిహద్దు ప్రాంతాలను ఈ-వీసా చెక్‌పోస్టులుగా గుర్తించారు.విదేశీయులకు ఈ-వీసా నిబంధనలను ఎంతగా సడలించినప్పటికీ.. పాకిస్థాన్ పౌరులకు మాత్రం ఈ సదుపాయాన్ని దూరంగా ఉంచారు. పాకిస్థానీ పాస్‌పోర్టు




కలిగిన వ్యక్తులకు లేదా పాకిస్థానీ మూలాలు ఉన్న ప్రయాణికులకు భారత్ ఎలాంటి ఈ-వీసాలను మంజూరు చేయడం లేదు. అలాంటివారు సాధారణ పద్ధతిలోనే విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు లేదా కాన్సులేట్ ద్వారా నేరుగా రెగ్యులర్ వీసాకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఈ-పోర్టల్ స్పష్టం చేసింది.భారత వీసా నిబంధనలను సులభతరం చేస్తూ 2014లో కేవలం 43 దేశాల పౌరుల కోసం ప్రారంభించిన ఈ-వీసా సేవలు.. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 172 దేశాల పౌరులకు అందుబాటులోకి వచ్చాయి. టూరిస్ట్, బిజినెస్, మెడికల్, స్టూడెంట్, గ్రూప్ ట్రావెల్, క్రూయిజ్, ట్రాన్సిట్, పర్వతారోహణతో సహా మొత్తం 17 వేర్వేరు సబ్-కేటగిరీలకు ఈ-వీసా సౌకర్యాన్ని వర్తింపజేస్తున్నారు. ఈ-వీసాల కోసం దాఖలయ్యే దరఖాస్తుల్లో దాదాపు 95 శాతానికి పైగా అప్లికేషన్లను కేవలం 72 గంటల వ్యవధిలోనే ప్రాసెస్ చేసి అధికారులు క్లియరెన్స్ ఇస్తున్నారు. ప్రస్తుతం అట్టారీ వంటి కీలక ల్యాండ్ పోర్టులతో పాటు భోపాల్, తిరుపతి విమానాశ్రయాలకు ఈ-వీసా ఎంట్రీ హోదా దక్కడంతో విదేశీ పర్యాటకులు, వ్యాపారవేత్తలకు రవాణా మరింత సులభతరం కానుంది.

# మెయినాబాద్ లో 200 కోట్లతో పూలు, కూరగాయలు మార్కెట్

**హైదరాబాద్, ఆగస్టు 12:** హైదరాబాద్ శివారులో రూ.200 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో భారీ పూలు, కూరగాయల మార్కెట్‌ను నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్‌లో మొత్తం 39.07 ఎకరాలను మార్కెటింగ్ శాఖకు కేటాయించింది. మార్కెట్‌లో శీతల గిడ్డంగులు, ప్లాట్‌ఫారాలు, పార్కింగ్, భారీ భవనాలు, ఇతర మౌలిక వసతులు కల్పించనున్నారు. ఓఆర్ఆర్, శంషాబాద్ విమానాశ్రయానికి సమీపంగా ఉండటం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉత్పత్తుల రవాణా, దేశీయ, విదేశీ ఎగుమతులకు అనుకూలంగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. హైదరాబాద్ శివారులో అంతర్జాతీయ ప్రమాణాలతో భారీ పూలు, కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రత్యామ్నాయ పంటల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడంతోపాటు, పూలు కూరగాయల సాగును ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ మార్కెట్‌ను నిర్మించనున్నారు. ఇందుకోసం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలో 39.07 ఎకరాల భూమిని కేటాయించారు. మార్కెట్ నిర్మాణానికి సుమారు రూ.200 కోట్లు ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అజీజ్‌నగర్‌లోని సర్వే నంబర్ 176/పీలో 23.22 ఎకరాలు, హిమాయత్‌నగర్ గ్రామంలోని సర్వే నంబర్ 151/పీలో 15.25 ఎకరాలు కలిపి మొత్తం 39.07 ఎకరాలను రెవెన్యూ శాఖ మార్కెటింగ్ శాఖకు బదలాయించింది. భూమి బదలాయింపు పూర్తవడంతో మార్కెటింగ్ శాఖ అధికారులు సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపకల్పనపై కసరత్తు ప్రారంభించారు. మార్కెట్ నిర్మాణం, విస్తీర్ణం, మౌలిక వసతులు, రవాణా వ్యవస్థ, నిల్వ సదుపాయాలు తదితర అంశాలను డీపీఆర్‌లో



పొందుపరచనున్నారు. దేశంలో పూల వ్యాపారానికి ప్రసిద్ధి చెందిన బెంగళూరులోని కృష్ణరాజేంద్ర మార్కెట్‌ను అధికారులు ఇప్పటికే అధ్యయనం చేసినట్లు సమాచారం. అక్కడి మార్కెట్ పనితీరును పరిశీలించిన అధికారులు.. దానికంటే పెద్దదిగా, ఆధునిక సదుపాయాలతో హైదరాబాద్ మార్కెట్‌ను తీర్చిదిద్దే అవకాశాలను పరిశీలించారు. ప్రతిపాదిత మార్కెట్‌లో భారీ మార్కెట్ భవనాలు, ప్రత్యేక విక్రయ వేదికలు, లోడింగ్–– అన్‌లోడింగ్ ప్లాట్‌ఫారాలు, శీతల గిడ్డంగులు, పార్కింగ్, అంతర్గత రహదారులు, వ్యర్థాల నిర్వహణ వ్యవస్థ వంటి సదుపాయాలను ఏర్పాటు చేయనున్నారు. అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ ప్రాంతాలకు మరో ప్రత్యేకత ఉంది. ఇవి హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో ఉండటంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వ్యవసాయ ఉత్పత్తులను వేగంగా తరలించేందుకు అనుకూలంగా ఉంటాయి. ఉమ్మడి రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నల్గొండ, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి పూలు, కూరగాయలను మార్కెట్‌కు తీసుకురావచ్చు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో ఉండటం వల్ల నాణ్యమైన పూలు, త్వరగా పాడయ్యే కూరగాయలను దేశంలోని ఇతర ప్రాంతాలతోపాటు విదేశీ మార్కెట్లకు కూడా తరలించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం తెలంగాణలో పూలకు ప్రత్యేకంగా పెద్ద మార్కెట్ లేకపోవడంతో రైతులు మధ్యవర్తులపై ఆధారపడాల్సి వస్తోంది. హైదరాబాద్‌లోని గుడిమల్కాపూర్ మార్కెట్‌లో కూరగాయలతోపాటు పూల విక్రయాలు జరుగుతున్నాయి. ప్రత్యేక మార్కెట్ ఏర్పాటైతే వేలం, ధర నిర్ణయం, నిల్వ, రవాణా వంటి వ్యవస్థలు ఒకే చోట అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల రైతులకు మార్కెట్ సమాచారం, మెరుగైన ధరలు లభించడంతోపాటు పంట నష్టాలు తగ్గే అవకాశం ఉంది. తెలంగాణలో ప్రస్తుతం సుమారు 4,402 ఎకరాల్లో వివిధ రకాల పూలు, 1.03 లక్షల ఎకరాల్లో కూరగాయలను సాగు చేస్తున్నారు. వీటిలో దాదాపు 60 శాతం సాగు హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల్లోనే జరుగుతున్నట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు సూచిస్తున్నాయి. నగరానికి సమీపంలోనే భారీ వినియోగ మార్కెట్ ఉండటం రైతులకు అనుకూలంగా ఉన్నప్పటికీ, తగిన మార్కెటింగ్, నిల్వ సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో మొయినాబాద్ మండలంలో ప్రతిపాదిత మార్కెట్ పూర్తయితే పూలు, కూరగాయల రైతులకు కొత్త మార్కెట్ వేదికగా మారనుంది. ఉత్పత్తిదారులు, వ్యాపారులు, హోల్‌సేల్ కొనుగోలుదారులు, ఎగుమతిదారులను ఒకే వేదికపైకి తీసుకురావడంతో మార్కెటింగ్ వ్యవస్థ మరింత వ్యవస్థీకృతమయ్యే అవకాశం ఉంది. ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడం, రైతుల ఆదాయాన్ని పెంచడం, హైదరాబాద్ నగరానికి నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తుల సరఫరాను బలోపేతం చేయడం వంటి లక్ష్యాలకు ఈ మార్కెట్ కీలకంగా మారనుంది.

# పీఎం ఏక్తా (యూనిటీ) మాల్ వద్ద బీఆర్ఎస్ ఆందోళన

హైదరాబాద్ రాయదుర్గంలో ప్రతిపాదించిన పీఎం ఏక్తా (యూనిటీ) మాల్ ప్రాజెక్టు టెండర్లలో భారీ కుంభకోణం మరియు ఆర్థిక అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, ఆ టెండర్లను రద్దు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు.... ఈ రోజు రాయదుర్గం భూముల వద్ద ఆందోళన చేపట్టిన దాసోజు శ్రవణ్, శంబీపూర్ రాజు.. బీఆర్ఎస్ శ్రేణులు..రాయదుర్గంలోని అత్యంత విలువైన 6.30 ఎకరాల ప్రభుత్వ భూమి లో మొత్తం సుమారు 27 లక్షల చదరపు అడుగుల నిర్మాణం జరుపుటకు నిర్ణయం.. అంచనా వ్యయం: భూమి విలువ కాకుండా దాదాపు రూ. 2,059.81 కోట్లు.కేంద్ర సహాయం: కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం రూ. 202 కోట్ల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది...

**బీఆర్ఎస్ ప్రధాన అభ్యంతరాలు ఆరోపణలు**

ఈ ప్రాజెక్టులో ప్రభుత్వానికి దక్కే బిల్ట్-అప్ ఏరియా కేవలం 9 లక్షల చదరపు అడుగులు కాగా, ప్రైవేట్ డెవలపర్‌కు ఏకంగా 18 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని (ప్రభుత్వ వాటా కంటే రెట్టింపు) కేటాయించడంపై బీఆర్ ఎస్



నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు...పీపీపీ మోడల్‌లో టెండర్ నిబంధనలను ప్రైవేట్ సంస్థలకు లాభం చేకూర్చేలా రేవంత్ రెడ్డి ప్రభుత్వం మార్చేసిందని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల్లో టీజు ప్రాతిపదికన ఇస్తుంటే, ఇక్కడ ఏకంగా అమ్మకానికి వెసులుబాటు ఇచ్చారని విమర్శించారు...కేంద్ర నిధుల దారి మళ్లింపు: కేంద్రం ఇచ్చే రూ. 200 కోట్ల వడ్డీ లేని రుణాన్ని తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ద్వారా నేరుగా ప్రైవేట్ డెవలపర్‌కు బదిలీ చేసేందుకు నిబంధనలు రూపొందించారని, ఇది కేంద్ర పథక నియమాలకు విరుద్ధమని పేర్కొన్నారు. నిధుల దుర్వినియోగం: ప్రాజెక్ట్ కన్సల్టెన్సీ, సర్వేలు, మరియు అనుమతుల పేరుతో ఇప్పటికే చేసిన ఖర్చులను కేంద్ర నిధుల నుండి సర్దుబాటు చేసుకునే వెసులుబాటు కల్పించడాన్ని తప్పుబట్టారు..

**ల్యాండ్ ఇష్యూ (భూ వివాదం & కుట్రలు)**

ఈ యూనిటీ మాల్ నిర్మాణ స్థలానికి సంబంధించి గతంలో (2024 ఆగస్టులో) పెద్ద వివాదం నడిచింది. మాల్ నిర్మాణానికి కేటాయించిన స్థలంలో ఉన్న కొన్ని నిర్మాణాలను అక్రమ కట్టడాలంటూ అధికారులు జీహెచ్ఎంసీ (+హైడ్రా) సాయంతో కూల్చివేశారు. అయితే, ఈ భూమి తమ సొంత పట్టా భూమి అని, ఇన్నామ్ రద్దు చట్టం కింద దీనిపై స్పష్టత లేదని 'హైదరాబాద్ టవరీస్' అనే సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే ఇళ్లను కూల్చివేశారని బాధితులు ఆందోళన చేశారు...

**బీఆర్ఎస్ డిమాండ్లు:**

కేటీఆర్ కేంద్ర ప్రభుత్వానికి రాసిన లేఖలో, ఈ టెండర్ ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని, కాగ్ (కాగ్+) లేదా ఇతర స్వతంత్ర సంస్థలతో విచారణ జరిపించే వరకు కేంద్ర నిధుల విడుదలను నిలిపివేయాలని కోరారు

# రసవత్తరంగా ప్రకాష్ గౌడ్ ఫ్యామిలీ డ్రామా..

**హైదరాబాద్, ఆగస్టు 12:** రాజేంద్రనగర్ రాజకీయం వేడెక్కింది. అధికారం, కుటుంబ బంధాలు, వ్యక్తిగత వివాహ నిర్ణయాలు కలగలిసి ఒక సంచలనాత్మక పొలిటికల్ డ్రామాకు తెరలేపాయి. నియోజకవర్గంలో తిరుగులేని నాయకుడిగా గుర్తింపు పొందిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు సొంత ఇంట్లోనే ఊహించని సవాలు ఎదురైంది. ఆయన కుమారుడు సంతోష్ గౌడ్ నేరుగా తండ్రిపైనే తీవ్రస్థాయిలో తిరుగుబాటు బావుటా ఎగరవేసి, మీడియా ముందుకు రావడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ప్రజాప్రతినిధిగా అధికార పీఠంపై ఉన్న తండ్రికి, తన ప్రేమ వివాహానికి రక్షణ కోరుతున్న కుమారుడికి నడుమ సాగుతున్న ఈ పోరు ఇప్పుడు తెలంగాణలో హాట్ టాపిక్‌గా మారింది.ఈ వివాదానికి మూలం సంతోష్ గౌడ్ ప్రేమ వివాహ నిర్ణయమే. రూపా రెడ్డి కుమార్తెను వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నప్పటి నుంచి కుటుంబంలో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. కేవలం వివాహాన్ని అడ్డుకోవడమే కాకుండా, తమకు మద్దతుగా నిలిచిన వారిపై భౌతిక దాడులు చేయిస్తున్నారని సంతోష్ నేరుగా ఎమ్మెల్యేపైనే సంచలన ఆరోపణలు చేశారు. ఇటీవల మణికొండలోని రూపా రెడ్డి నివాసంలో అపరిచిత వ్యక్తులు ప్రవేశించి సృష్టించిన అలజడి వెనుక ఎమ్మెల్యే



ప్రకాష్ గౌడ్ హస్తం ఉందని, అంతర్గత ఆస్తి తగాదాలు, మనస్పర్థలే ఈ దాడులకు కారణమని ఆయన స్పష్టం చేశారు.అధికార వర్గాల ఒత్తిడి, పోలీసుల వైఖరిపై కూడా సంతోష్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రాణభయంతో అత్యవసరంగా డయల్-100 ద్వారా రక్షణ కోరినప్పటికీ, నార్సింగ్ పోలీసులు స్పందించిన తీరు అనుమానాస్పదంగా ఉందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధి రాజకీయాధికారానికి పోలీసులు తలొగ్గారని, బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి, రివర్స్‌లో తమపైనే అక్రమ కేసులు బనాయించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. నిజాలు బయటపెట్టినందుకు తమ ప్రాణాలకు మరింత ముప్పు పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు.అటు బాధితురాలు రూపా రెడ్డి సైతం ఇది ఒక ముందస్తు ప్రణాళిక ప్రకారం జరుగుతున్న రాజకీయ కుట్ర అని పేర్కొన్నారు. తమను జైలుకు పంపించేందుకు ఎమ్మెల్యే వర్గం తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని, ప్రశాంతంగా జీవించే తమ కుటుంబానికి పోలీసు ఉన్నతాధికారులు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అయితే, ఈ డ్రామాలో ఊహించని మలుపుగా రూపారెడ్డిని పోలీసులు చిట్టీల పేరుతో మోసాలకు పాల్పడ్డారనే కేసులో అరెస్ట్ చేయడం స్థానికంగా మరింత ఉత్కంఠను పెంచింది. ఇది పోలీసులపై వచ్చిన ఆరోపణల కవర్-అప్ చర్యగా లేక పాత కేసుల అమలులో భాగమా అనే చర్చ మొదలైంది.మరోవైపు ఈ సంచలన ఆరోపణలపై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శైలి వ్యూహాత్మకంగా ఉంది. వాడివేడిగా తనకు తెలియదని, ఈ వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన సింపుల్ గా కొట్టి పారేశారు. సొంత కుమారుడి గుర్తింపునే ప్రశ్నించేలా వ్యాఖ్యానించడం ద్వారా ఈ వివాదం తీవ్రతను తగ్గించేందుకు ప్రయత్నించారా లేక సరైన సమయంలో పూర్తిస్థాయి సమాధానం చెప్పేందుకు సమయం తీసుకుంటున్నారా అనే కోణంలో విశ్లేషకులు భావిస్తున్నారు.

# లోక్‌సభ స్పీకర్‌కు కేంద్ర హోం మంత్రి అమిత్ షా లేఖ

- మొదటి పేజీ తరువాయి

ప్రతిపక్షానికి చెందిన ఏ ఎంపీ కూడా నీట్ పరీక్షల గురించి మాట్లాడలేదని, అయినప్పటికీ ప్రజా ప్రయోజనాల దృష్ట్యా మరొకసారి ఈ అంశంపై చర్చించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన వివరించారు.'నా విజ్ఞప్తి ఏమిటంటే... మీరు విపక్షాలతో చర్చించి, పరస్పర అంగీకారంతో నేటి నుంచి ఎంత సమయం, ఎన్ని గంటలు సరిపోతాయని భావిస్తే అంత సమయం కేటాయించాల్సిందిగా కోరుతున్నాను. కేటాయించిన ఆ సమయంలో నేను సభలో స్వయంగా ఉండి, ఈ అంశంపై చర్చలో పాల్గొనడానికి, విపక్షాల ప్రశ్నలన్నింటికీ సమాధానమివ్వడానికి సిద్ధంగా ఉన్నాను.' అని అమిత్ షా తన లేఖలో పేర్కొన్నారు.ప్రజాస్వామ్యంలో చర్చలు, సంభాషణల ద్వారానే పరిష్కారాలు లభిస్తాయి.. ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్య వ్యవస్థలపై తనకు అపారమైన విశ్వాసం ఉంది.. అలాగే ఈ సభ చర్చలు, సంభాషణల కోసమే ఉందనేదే నా నమ్మకమని అమిత్ షా తన లేఖలో రాశారు. కాబట్టి, విపక్ష నాయకులతో చర్చించి, ఈ ముఖ్యమైన విషయంపై మంచి వాతావరణంలో చర్చ జరిగేలా చూడాలని కోరుతున్నానని అమిత్ షా పేర్కొన్నారు. తద్వారా ఈ అంశంపై అధికార, ప్రతిపక్షాలకు చెందిన గౌరవనీయ సభ్యులందరూ తమ అమూల్యమైన అభిప్రాయాలను, ఆలోచనలను సభకు సమర్పించే అవకాశం కలుగుతుందని అమిత్ షా చెప్పారు.

# ఆర్మీ నియామకాల్లో తెలంగాణ యువతను ప్రోత్సహించాలి

- మొదటి పేజీ తరువాయి

తీసుకునేలా స్థానిక ఆర్మీ అధికారులను ఆదేశిస్తానని రాజేష్ పుష్కర్ చెప్పారు. కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా చారిత్రక హైదరాబాద్ నగరానికి పూర్వవైభవాన్ని తేవాలన్న పట్టుదలతో మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు చేపట్టడంపై లెఫ్టినెంట్ జనరల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించారు. హైదరాబాద్ నగరాన్ని రక్షించడానికి మూసీ నది ప్రక్షాళన అవసరమని అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ ఎన్. శ్రీనివాస్ రావు , ఇతర ఆర్మీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ

- మొదటి పేజీ తరువాయి

పేర్కొంది. ఓటర్ల పరిశీలన ప్రక్రియలో రేషన్ కార్డును ధ్రువీకరణ పత్రంగా పరిగణించనందున, ఈ సర్టిఫికెట్‌ను కూడా అంగీకరించలేమని తెల్చిచెప్పింది. మీసేవ కేంద్రాల ద్వారా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్లను జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జూలై 25న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. కుటుంబ యజమాని, సభ్యుల పేర్లు, వయసు, చిరునామా, ఆధార్ వివరాలతో కూడిన ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్లను ఓటర్ల జాబితా సవరణలో ఉపయోగించుకోవచ్చని తొలుత ప్రచారం జరిగింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6 లక్షల మంది ఈ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

# 10 శాతం కమీషన్ వివాదం!

- మొదటి పేజీ తరువాయి

నిరసన కార్యక్రమంలో, వైద్య ఆరోగ్య శాఖ రిటైర్డ్ ఉద్యోగిని, INTUC అనుబంధ ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి S.K. ప్రసన్నకుమారి మీడియా ముందు పలు వివరాలను బయటపెట్టారు. తనకు రావాల్సిన రూ. 40 లక్షల పదవీ విరమణ బకాయిలను క్లియర్ చేయడం కోసం 10 శాతం కమీషన్, అంటే రూ. 4 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారని సంచలన ఆరోపణలు చేశారు. ఒక్క వైద్య ఆరోగ్య శాఖలోనే సుమారు రూ. 120 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, సంబంధిత ఫైళ్లు ముందుకు కదలాలన్నా లేదా బిల్లులు మంజూరు కావాలన్నా 6 శాతం నుండి 10 శాతం వరకు కమీషన్లు అడుగుతున్నారని ఆమె ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కమీషన్ల కక్కుర్తి కనిపిస్తుందని, తమ సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడమే కాకుండా, పలు ప్రధాన తెలుగు పత్రికలలో, ఛానళ్లలో వార్తలు వచ్చాయని గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాకు రాసిన లేఖలో లాయర్ కరుపోతుల రేవంత్ పేర్కొన్నారు.

# జీవితంలో అడ్డదారుల వెంట పడొద్దు...

- మొదటి పేజీ తరువాయి

స్ఫూర్తి పొంది సరైన మార్గాన్ని కనుగొనవచ్చు" అని ఆయన యువతకు సలహా ఇచ్చారు. ముఖ్యంగా ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేసే ఇన్‌ఫ్లుయెన్సర్ల కంటెంట్ పట్ల నిరంతరం జాగ్రత్తగా ఉండాలని ఆయన హితవు పలికారు.కష్టాల్లోనూ విలువలను వదలని జీవితంరామ్‌నాథ్ కోవింద్ జీవితంలోని పేదరికం, పరిమిత వనరులు, కష్టాలను ప్రస్తావించిన ప్రధాని మోదీ, వాటిని ఆయన బలహీనతలుగా మార్చనివ్వలేదన్నారు. విద్య, కష్టపడి పనిచేయడం, నిజాయితీ, సేవాభావం వంటి విలువలతో ఆయన అత్యున్నత రాజ్యాంగ పదవికి చేరుకున్నారని ప్రధాని గుర్తు చేశారు. రామ్‌నాథ్ కోవింద్ చిన్నతనంలో ఆయన తల్లి అగ్నిప్రమాదంలో మరణించిన విషాద సంఘటనను కూడా మోదీ ప్రస్తావించారు. ఆ కష్ట సమయంలో పొరుగింటి మహిళ కుటుంబానికి అండగా నిలిచిన సంఘటన రామ్‌నాథ్ కోవింద్‌లో సామాజిక ఐక్యత, సామరస్యంపై లోతైన అవగాహన పెంచిందని వివరించారు. ఆయన తండ్రి కుటుంబాన్ని నిలబెట్టి పిల్లలకు విలువలను నేర్పిన తీరు రామ్‌నాథ్ కోవింద్ జీవితంపై ప్రభావం చూపిందని ప్రధాని మోదీ చెప్పారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే వంటి మహనీయుల పేదలు, అణగారిన వర్గాలకు కూడా దేశంలో అత్యున్నత స్థాయికి చేరుకునే అవకాశం ఉండాలని కలలు కన్నారని మోదీ అన్నారు. రామ్‌నాథ్ కోవింద్ వంటి వ్యక్తులు తమ కృషి, సామర్థ్యంతో ఆ కలను సాకారం చేసే భారత ప్రజాస్వామ్య ప్రయాణానికి తోడ్పడ్డారని పేర్కొన్నారు. భవిష్యత్తులో దేశానికి ఇలాంటి అంకితభావం కలిగిన లక్షలాది యువత అవసరమని ప్రధాని మోదీ సందేశం ఇచ్చారు.

**"ఒకే దేశం, ఒకే ఎన్నిక" కోసం కోవింద్ సేవలు**

రామ్‌నాథ్ కోవింద్ రాష్ట్రపతిగా పదవీ విరమణ చేసిన తరువాత కూడా విశ్రాంతి తీసుకోకుండా ప్రజా జీవితానికి సంబంధించిన అంశాలపై పనిచేస్తున్నారని మోదీ ప్రశంసించారు. ప్రత్యేకంగా "ఒకే దేశం, ఒకే ఎన్నిక" అంశంపై కోవింద్ చేస్తున్న కృషిని ప్రస్తావించారు. ఈ అంశానికి పరిష్కారం లభిస్తే భారత ప్రజాస్వామ్యంలో కొత్త అధ్యాయం ప్రారంభమయ్యే అవకాశం ఉందని ప్రధాని మోదీ అన్నారు. రామ్‌నాథ్ కోవింద్ సేవాభావం, అంకితభావం నుంచి దేశ ప్రజలు నేర్చుకోవాల్సిన విషయాలు చాలా ఉన్నాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు. రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథలో ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి, ప్రతికూల పరిస్థితుల్లోనూ నిజాయితీ, విలువలు, స్వచ్ఛ విషయంలో రాజీ పడకుండా ఎలా ఎదిగారనే అంశాలు ఉన్నాయని మోదీ చెప్పారు. తన జీవితంలోని కష్టాలు వ్యక్తిగతమైనవైనా, వాటి ఫలితంగా వచ్చిన విజయం మాత్రం భారత గణతంత్రం, ప్రజాస్వామ్య విజయం అని పుస్తక శీర్షికను విశ్లేషిస్తూ మోదీ పేర్కొన్నారు. ఈ పుస్తకం కోవింద్ జీవితంలోని జ్ఞాపకాలను మాత్రమే కాకుండా, భారత ప్రజాస్వామ్య ప్రయాణంలోని ముఖ్య ఘట్టాలను కూడా భవిష్యత్ తరాలకు భద్రపరుస్తుందని ఆయన అన్నారు.

# నియోపోలీస్ లో ఎకరా 120 కోట్లు...

- మొదటి పేజీ తరువాయి

కోకాపేట్‌లోని నియోపోలీస్, గోల్డెన్ మైల్ లేఅవుట్లలో ఉన్న విలువైన భూములతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఖాళీ ప్లాట్లను విక్రయించడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ సిద్ధం చేసింది. గతంలో డిసెంబర్ 2025లో నిర్వహించిన నియోపోలీస్ భూముల వేలంలో ఎకరానికి అత్యధికంగా రూ. 131 కోట్లు, రూ. 118 కోట్ల వరకు ధర పలికి హెచ్ఎండీఏకి సుమారు రూ. 1000 కోట్ల ఆదాయం సమకూరింది.అంతకుముందు వివిధ దశల్లో చేపట్టిన వేలం పాటల ద్వారా సుమారు రూ. 3,708 కోట్లు వచ్చాయి. గతంలో నమోదైన రికార్డు ధరలను ప్రాతిపదికగా తీసుకుంటూ.. ప్రస్తుతం నియోపోలీస్ లేఅవుట్‌లోని 4.59 ఎకరాల భూభాగానికి కనీస ధరగా ఎకరానికి రూ. 120 కోట్లుగా నిర్ణయించారు. అలాగే గోల్డెన్ మైల్ లేఅవుట్‌లోని 0.70 ఎకరాల భూమికి ఎకరానికి రూ. 70 కోట్ల ప్రారంభ ధరను నిర్ణయించారు. ఈ ప్రధాన రెండు లేఅవుట్లకు సెప్టెంబర్ 9న ఈ-వేలం జరగనుంది.ఈ వేలం ప్రక్రియ మొత్తం ఆగస్టు 24న ప్రారంభమై సెప్టెంబర్ 9 వరకు కొనసాగనుంది. కోకాపేట్ మాత్రమే కాకుండా నగర శివారులలో ఉన్న పలు రెసిడెన్షియల్ లేఅవుట్లలో కూడా భూములను హెచ్ఎండీఏ అమ్మకానికి ఉంచింది. కుకట్‌పల్లి సమీపంలోని హైదరాబాద్ నగర్, మోకిలా, బాచుపల్లి, కొత్తూర్ సమీపంలోని ఇన్ముల్‌నర్వ లేఅవుట్లతో పాటు బైరాగిగూడ, చందానగర్, సూరారం, కాప్రా, కిష్టారెడ్డిపేట్, సరూర్‌నగర్ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లను వేలంలో విక్రయించనున్నారు. ఈ వేలంలో భాగంగా మోకిలా లేఅవుట్‌లోని 300 నుంచి 500 చదరపు గజాల ప్లాట్లకు చదరపు గజానికి కనీస ధర రూ. 55 వేలు, బాచుపల్లి లేఅవుట్‌లోని ప్లాట్లకు రూ. 45 వేలుగా నిర్ణయించారు. అలాగే సూరారంలో ఉన్న 2,420 చదరపు గజాల ల్యాండ్ పార్సెల్‌కు గజానికి రూ. 75 వేలు, మరో 4,840 చదరపు గజాల ప్లాట్‌కు గజానికి రూ. 55, వేలు అప్‌సెట్ ధరగా ఖరారు చేశారు. క్లియర్ టైటిల్స్ ఉన్న ఈ ప్రభుత్వ భూముల విక్రయానికి బిల్డర్లు, రియల్ ఎస్టేట్ సంస్థలు, కొనుగోలుదారుల నుంచి భారీ స్పందన వస్తుందని అధికారులు భావిస్తున్నారు

వార్తాతరంగాలు

గురువారం 13 ఆగస్టు 2026

# అంతర్జాతీయ యువజన దినోత్సవం

**యువతీ యువకులందరికీ శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్:**అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి యువతీ యువకులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.యువత ఆలోచనలకు ప్రోత్సాహం, వారి ప్రతిభకు వేదిక, వారి ప్రయత్నాలకు అవసరమైన వనరులను అందిస్తే అసాధ్యాన్ని సుసాధ్యం చేయగలరు. పేదరికం, అసమానతలు, నిరుద్యోగం, వాతావరణ మార్పులు, సాంకేతిక పరిజ్ఞానంలోని అంతరాలు వంటి సవాళ్లను అధిగమించేందుకు యువతకు అవకాశాలు, వనరులు, నైపుణ్యాలు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. యువతకు సరైన విద్య, నైపుణ్యం, క్రీడలు, ఉపాధి, నాయకత్వ అవకాశాలు కల్పించినప్పుడే బంగారు భవిష్యత్తును నిర్మించగలం. ప్రజా ప్రభుత్వం యువతకు అండగా నిలుస్తోంది. ఏఐ కారణంగా వైట్ కాలర్ జాబ్స్ ప్రమాదంలో పడుతున్న పరిస్థితుల్లో బ్లూకాలర్ జాబ్స్ అందిపుచ్చుకునేలా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోంది. భవిష్యత్ సవాళ్లను అధిగమించే దిశగా ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన ఏటీసీలు, స్కిల్స్ యూనివర్సిటీ, స్పోర్ట్ యూనివర్సిటీ వంటివి మంచి ఫలితాలు అందిస్తున్నాయి. టామ్‌కామ్ ద్వారా సింగపూర్, జపాన్, జర్మనీ వంటి దేశాల్లో అవకాశాలను దక్కించుకునేలా అవసరమైన చర్యలు చేపట్టాం.యువత వ్యసనాలకు బారిన పడకుండా మాదకద్రవ్యాల నియంత్రణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. యువత స్పష్టమైన లక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగాలి. యువతే మన బలం -- యువతే మన భవిష్యత్తు. యువతకు శు భాభినందనలు" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# పెద్దపల్లి లో పీఎం సేతు క్లస్టర్ ఐటీఐ ఏర్పాటు చేయాలి....



**గోదావరిఖని:**పెద్దపల్లి నియోజకవర్గంలో పీఎం సేతు క్లస్టర్ ఐటీఐ ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి , పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. పెద్దపల్లి నియోజకవర్గంలో పీఎం సేతు క్లస్టర్ ఐటీఐ ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతంలోని విద్యార్థిని, విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య శిక్షణ పొందే అవకాశం కలుగుతుంది. దీని ద్వారా యువతకు మంచి భవిష్యత్తుకు బాటలు పడటంతో పాటు నిరుద్యోగ సమస్యను గణనీయంగా తగ్గించేందుకు అవకాశం ఉంటుంది. క్లస్టర్ ఐటీఐ ద్వారా వివిధ పారిశ్రామిక రంగాలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందించి, శిక్షణ పూర్తిచేసిన వారికి ఉద్యోగ అవకాశాలు మరియు ఉపాధి అవకాశాలు మరింతగా పెరిగే అవకాశం ఉంది. పెద్దపల్లి ప్రాంతంలో ఉన్న పరిశ్రమలకు కూడా నైపుణ్యం కలిగిన స్థానిక యువత అందుబాటులోకి వస్తారు. అందువల్ల పెద్దపల్లి నియోజకవర్గంలో పీఎం సేతు క్లస్టర్ ఐటీఐను ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, త్వరితగతిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, విద్యార్థులు, యువత ఆకాంక్షిస్తున్నారు. పెద్ద పెల్లి ప్రాంతానికి ఈ యొక్క పరిశ్రమములను ను తీసుకురావడానికి కృషి చేస్తున్నటువంటి తెలంగాణ రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మరియు పెద్ద పెల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ కి పెద్దపల్లి పార్లమెంటు ప్రజల తరఫున పి.మల్లికార్జున్ శ్రమ శక్తి అవార్డు గ్రహీత, అనుమాస శ్రీనివాస్ జీన్స్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు వారికీ ధన్యవాదాలు తెలుపుతున్నాము

# బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడు ఉదయ్ నాగరాజు సన్మానం

**పాల్గోన్న హరీష్ రావు**



**సిద్ధిపేట:**బ్రిటన్ పార్లమెంట్ హౌస్ ఆఫ్ లార్డ్స్ కు ఎన్నికైన సిద్దిపేట ముద్దుబిడ్డ ఉదయ్ నాగరాజు రి పౌర సన్మాన కార్యక్రమం సిద్దిపేటలోని విపంచి కళానిలయంలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరై ఉదయ్ నాగరాజు కి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఉదయ్ నాగరాజు తన పేరుకు తగ్గట్లే సార్థకత తీసుకొచ్చారు, తెలంగాణలో ఉదయించి బ్రిటన్లో వెలుగొందుతున్నారు.మన రెండు తెలుగు రాష్ట్రాల నుండి బ్రిటన్ పార్లమెంటుకు ఎన్నికైన మొట్టమొదటి వ్యక్తి ఉదయ్ నాగరాజని కొనియాడారు. ఎంతో కృషి పట్టుదల ఉంటే తప్ప అంత ఉన్నతమైన పదవి రాలేదు. ఉదయ్ ది నాది రెండున్నర దశాబ్దాల పరిచయం. ఆయన పెళ్ళికి కూడా హాజరయ్యాను. తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా లండన్ నుండి ఉద్యమానికి మద్దతిచ్చారు. మనం ఎట్లా అయితే ఇక్కడ పోరాడామే ఆయన కూడా తన భాగస్వామ్యం అందించారని గుర్తు చేసుకున్నారు.ఉదయ్ నాగరాజు బ్రిటన్ లో మరింత ఉన్నతమైన పదవులు పొందాలని, అక్కడి ప్రజలకు మంచి సేవలు అందించాలని కోరుకుంటున్నాను. ఉదయ్ నాగరాజు ఎంత దూరం వెళ్ళినా మన ఆచారాలను, సంప్రదాయాలను పాటించడం సంతోషంగా ఉంది. ఉదయ్ నాగరాజు కి సన్మానం చేయడం అంటే సిద్దిపేట ప్రజలకు, తెలంగాణకే కాకుండా యావత్ భారతీయులకు గర్వకారణం. పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యం అనేది ఉదయ్ ని చూస్తే తెలుస్తోంది, యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలి. ఉదయ్ నుండి యువత నేర్చుకోవాలి. చిన్న పల్లెటూరులో పుట్టి బ్రిటన్ పార్లమెంటు కు ఎన్నికయ్యారు. ఆయన కృషి, పట్టుదల, సేవలు ఆయనకు ఇంత ఉన్నతమైన స్థానం అందించాయి. ప్రతి మనిషిలో కూడా సామర్థ్యం ఉంటుంది. వాటిని వెలికితీసి కష్టపడి విజయం సాధించాలని అన్నారు.

# చెన్నై బుల్లెట్ రైలు కారిడార్లో నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని చేర్చాలి

**కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ను కోరిన ఎంపి చామల**

**న్యూఢిల్లీ:**బుధవారం నాడు న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ను భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి కలిసారు. హైదరాబాద్-చెన్నై బుల్లెట్ రైలు కారిడార్లో నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని చేర్చే విషయాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేసారు.గ్రీన్ ఫీల్డ్ అలైన్మెంట్కు బదులుగా ఇప్పటికే ఉన్న ఎన్హెచ్-65 (చీఎ-65) కారిడార్ గుండా ఈ మార్గాన్ని నిర్మిస్తే, ఆ ప్రాంతంలోని పట్టణాలు, వాణిజ్య కేంద్రాలు మరియు ప్రజలకు మెరుగైన కనెక్టివిటీ లభిస్తుందని వివరించారు.ఈ విధంగా మార్గాన్ని మళ్లించడం ద్వారా భువనగిరి పార్లమెంటరీ నియోజకవర్గ ప్రజలకు ఈ ప్రాజెక్ట్ ద్వారా పూర్తి ప్రయోజనాలు చేకూరుతాయని కోరడం జరిగింది. ఈ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయనను అభ్యర్థించారు.ఈ సమావేశంలో ఎంపి చామల పాటు నాగర్కర్నూల్ ఎంపీ మల్లు రవి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు

# ఏపీలో ఉమ్మడి... తెలంగాణలో ఒంటరి

**హైదరాబాద్, ఆగస్టు 12:**తెలంగాణలో భారతీయ జనతా పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు ప్రకటించారు. ఈ ప్రకటన తీవ్ర రాజకీయ కలకలానికి దారితీసింది. ఆంధ్రాలో కూటమిగా కలసి పనిచేస్తున్నప్పటికీ, తెలంగాణలో పొత్తుల ఆశలతో ఉన్న జనసేన శ్రేణులకు ఈ వ్యాఖ్యలు గుండెల్లో రాయిపడ్డట్టే అయ్యాయి. దీనిపై తెలంగాణ జనసేన ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ తక్షణమే స్పందిస్తూ.. పొత్తుల అంశంపై నిర్ణయం తీసుకోవాల్సింది రామచందర్ రావు కాదని, ఢిల్లీలోని బీజేపీ హైకమాండ్ , జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఒకవేళ బీజేపీ రాబోయే రోజుల్లో ఒంటరిగానే వెళ్లాలని భావిస్తే, జనసేన కూడా తెలంగాణలో సొంతంగానే బరిలోకి దిగుతుందని ఆయన కుండబద్దలు కొట్టారు.గత అసెంబ్లీ ఎన్నికల అనుభవాలను పరిశీలిస్తే.. తెలంగాణలో బీజేపీ-జనసేన కలిసి పొత్తుతో పోటీ చేసినప్పటికీ ఆశించిన ఫలితాలు రాలేదు. పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించిన 8 స్థానాల్లో ఒక్కచోట కూడా బోణీ కొట్టలేకపోయింది. తాండూరు నుంచి పోటీ చేసిన శంకర్ గౌడ్‌తో సహా పోటీ చేసిన అభ్యర్థులందరూ డిపాజిట్లు కోల్పోయిన పరిస్థితి నెలకొంది. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి



ద్వారా సాధించిన రికార్డు స్థాయి విజయం, పవన్ కళ్యాణ్‌కు పెరిగిన ఇమేజ్‌ను ఆసరాగా చేసుకుని తెలంగాణలో బలపడాలని చూస్తున్న జనసేన ఆశలపై.. బీజేపీ రాష్ట్ర నేతల ఒంటరి పోరు వ్యాఖ్యలు పెద్ద దెబ్బగానే భావించవచ్చు. జనసేనను దూరం పెట్టి తెలంగాణలో ఒంటరిగా పోటీ చేయాలనే వ్యూహం బీజేపీకి ఏమేరకు మేలు చేస్తుందనేది పెద్ద ప్రశ్నార్థకమే. తెలంగాణలో బీఆర్ఎస్‌ను వెనక్కి నెట్టి, అధికార కాంగ్రెస్‌కు ఏకైక ప్రత్యామ్నాయంగా ఎదగాలని కమలనాథులు భావిస్తున్నారు. ఈ క్రమంలో పొత్తులు పెట్టుకుంటే పార్టీ స్వయం సమృద్ధి దెబ్బతింటుందని, ఇతర పార్టీల ఇమేజ్‌పై ఆధారపడే పరిస్థితి వస్తుందని బీజేపీ భావిస్తోంది. కానీ, గ్రేటర్ హైదరాబాద్ , ఆంధ్రా సరిహద్దు జిల్లాలైన ఖమ్మం, నల్గొండ, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు ఉన్న అశేష అభిమాన గణాన్ని, ఆంధ్రా సెటిలర్ల ఓటు బ్యాంకును పూర్తిగా విస్మరించడం బీజేపీకి అంత సులభం కాదు. కాంగ్రెస్ బలమైన పోటీ ఇస్తున్న ప్రస్తుత తరుణంలో ఓట్ల చీలిక బీజేపీకే నష్టం చేకూర్చే ప్రమాదం ఉంది.రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనే సూత్రం ఇక్కడ కూడా వర్తిస్తుంది. ఇప్పుడు స్థానిక నేతలు ఎంతగా ఒంటరి పోరు అని చెబుతున్నా.. అసలు ఎన్నికల సమయం దగ్గరపడేసరికి కేంద్ర బీజేపీ పెద్దలు పవన్ కళ్యాణ్‌తో మాట్లాడి పొత్తులపై తుది నిర్ణయం తీసుకునే అవకాశాలను కొట్టిపారేయలేం. ఒకవేళ పొత్తు కుదరకపోతే తెలంగాణలో జనసేన ఉనికి కాపాడుకోవడానికి ఒంటరిగా పోటీ చేయక తప్పదు. ఏది ఏమైనా, అధిష్ఠానాలు ఇంకా పెదవి విప్పకముందే లోకల్ లీడర్లు చేస్తున్న ఇలాంటి ప్రకటనలు గ్రేటర్ , తెలంగాణవ్యాప్తంగా ఉన్న జనసేన శ్రేణులను గందరగోళంలో పడేశాయి.

# గ్రేటర్ పరిధిలోనే 30 నుంచి 40 లక్షల ఓట్లు గల్లంతు

**హైదరాబాద్, ఆగస్టు 12:**తెలంగాణ ఓటర్ల జాబితాలో కోటి ఓట్లు గల్లంతయ్యే అవకాశం కనిపిస్తోంది. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలన ముగియడంతో, లక్షలాది మంది ఓటర్ల వివరాలు లభ్యం కాకపోవడం లేదా అన్‌కలెక్టబుల్ , నో మ్యాపింగ్ కేటగిరీల్లోకి చేరడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా డబుల్ ఓట్లు, నివాసాలు మారిన వారు, మరణించిన వారితో పాటు సమాచారం అందించని వారి పేర్లను ఏరివేసే క్రమంలో ఏకంగా కోటి వరకు ఓట్లకు ముప్పు వాటిల్లే అవకాశం కనిపిస్తోంది.ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధితో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి వంటి పట్టణ జిల్లాల్లో ఈ ప్రభావం అత్యధికంగా కనిపిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే దాదాపు 30 నుంచి 40 లక్షల ఓట్లు గల్లంతయ్యే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తుండగా, మిగిలిన గ్రామీణ, పట్టణ జిల్లాల్లో సైతం లక్షలాది మంది ఓటర్ల ఆచూకీ లభించలేదని అధికారులు నమోదు చేశారు. ఉద్యోగ, వ్యాపార రీత్యా ఇళ్లు మారడం, ఒకే కుటుంబ సభ్యులకు వేర్వేరు నియోజకవర్గాల్లో ఓట్లు ఉండటం, సరైన డోర్ నంబర్లు లేకపోవడం మరియు బీఎల్ఓ ల సర్వే సమయంలో అందుబాటులో లేకపోవడమే ఈ భారీ వ్యత్యాసానికి ప్రధాన కారణాలుగా తేలుతున్నాయి.మొత్తంగా 75 లక్షల ఎన్యూమరేషన్ ఫారాలు వెనక్కి రాలేదు. మరో 60 లక్షలకుపైగా ఓటర్ల వివరాల్లో తేడాలున్నాయి. వీరిలో ఇరవై లక్షల వరకూ తేలిపోయే ప్రమాదం ఉంది. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సేకరించిన సమాచారంలో లోపాలు ఉన్న వారిని ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తాత్కాలికంగా మినహాయించే దిశగా చర్యలు సాగుతున్నాయి. అయితే, నిజమైన ఓటర్లు కూడా ఈ రీ-వెరిఫికేషన్ ప్రక్రియలో భాగం కాకపోవడం వల్ల తమ ఓటు హక్కును కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. పోలింగ్ కేంద్రాల మార్పు, చిరునామా సరిగ్గా మ్యాచ్ కాకపోవడంతో శాశ్వతంగా నివాసం ఉంటున్న సామాన్యుల ఓట్లు కూడా అనర్హుల జాబితాలోకి చేరడం పట్ల యంత్రాంగంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ప్రస్తుతం ప్రచురిస్తున్న ముసాయిదా జాబితాల ఆధారంగా ఓటర్లు తమ పేర్లు ఉన్నాయో లేదో తక్షణమే తనిఖీ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఓటు గల్లంతైనట్లయితే ఎన్నికల



సంఘం కేటాయించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల వ్యవధిలో ఆన్‌లైన్ పోర్టల్, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ లేదా నేరుగా బీఎల్‌ఓల ద్వారా ఫారమ్-6, ఫారమ్-8 దాఖలు చేసి రీ-ఇన్‌స్టేట్ చేసుకోవచ్చని వెల్లడించారు. రాజకీయ పార్టీలు కూడా క్షేత్రస్థాయిలో ఏజెంట్లను రంగంలోకి దింపి అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడేలా చర్యలు వేగవంతం చేయాల్సిన అవసరం కనిపిస్తోంది.

# ఈ కేవైసీ కోసం ఆగస్టు 31లోపు డెడ్ లైన్...

**హైదరాబాద్, ఆగస్టు 12:**దేశవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ వినియోగదారులు ఆగస్టు 31లోగా ఈ కేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) ప్రక్రియను పూర్తి చేయాలని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సూచిస్తున్నాయి. ఈ గడువులోగా పూర్తి చేయని వినియోగదారులకు భవిష్యత్తులో గ్యాస్ సేవలకు సంబంధించిన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా సబ్సిడీ, వినియోగదారుల వివరాల ధృవీకరణ, డూప్లికేట్ కనెక్షన్ల నివారణ వంటి అంశాల కోసం ఈ ప్రక్రియను చేపడుతున్నారు. దేశవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ వినియోగదారులు ఆగస్టు 31లోగా ఈ కేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) ప్రక్రియను పూర్తి చేయాలని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సూచిస్తున్నాయి. ఈ గడువులోగా పూర్తి చేయని వినియోగదారులకు భవిష్యత్తులో గ్యాస్ సేవలకు సంబంధించిన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా సబ్సిడీ, వినియోగదారుల వివరాల ధృవీకరణ, డూప్లికేట్ కనెక్షన్ల నివారణ వంటి అంశాల కోసం ఈ ప్రక్రియను చేపడుతున్నారు. అయితే ఈ కేవైసీ కోసం ప్రత్యేకంగా కేంద్రాలకు వెళ్లకుండా ఇంట్లోనే మొబైల్ ద్వారా కూడా పూర్తి చేయొచ్చు. గ్యాస్ కనెక్షన్లు నిజమైన లబ్ధిదారుల పేర్లలోనే కొనసాగుతున్నాయా..? లేదా అనే విషయాన్ని నిర్ధారించడం కోసమే ఈ ఈ కేవైసీ. ఒకే వ్యక్తి పేరుతో ఒకటి కంటే ఎక్కువ కనెక్షన్లు ఉండటం.. తప్పుడు వివరాలతో కనెక్షన్లు తీసుకోవడం వంటి అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఈ ధ్రువీకరణను చేపడుతున్నాయి. దీంతో అర్హులైన వినియోగదారులకే ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు.ఈ కేవైసీ పూర్తి చేయడానికి గ్యాస్ ఏజెన్సీకి వెళ్లాలంటే కొందరికి ఇబ్బందులు ఉంటాయి. దీంతో ఆ అవసరం లేకుండా ఇంటి నుంచే స్మార్ట్‌ఫోన్ ద్వారా దీనిని పూర్తి చేసుకునే అవకాశం కల్పించారు. ఇందుకోసం మీరు ఏ కంపెనీ గ్యాస్ కనెక్షన్ ఉపయోగిస్తున్నారో దానికి అనుగుణంగా యాప్‌ను డౌన్‌లోడ్




చేసుకోవాలి. లేదా ఆ కంపెనీ వెబ్ సైట్ నుంచి కూడా ఈ ప్రక్రియను చేయొచ్చు.ముందుగా గ్యాస్ కంపెనీ యాప్ డౌన్ లోడ్ చేసుకున్న తరువాత రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌తో లాగిన్ అవ్వాలి. అనంతరం ప్రొఫైల్ లేదా మై అకౌంట్ విభాగంలోకి వెళ్లి 'ఈకేవైసీ లేదా రీ వెరిఫికేషన్ అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అక్కడ ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు కోసం ఆధార్ ఫేస్ ఆర్ డీ యాప్ ఓపెన్ అవుతుంది. ముఖంపై సరిపడా వెలుతురు ఉండేలా చూసుకుని కెమెరా ద్వారా ఫేస్ స్కాన్ పూర్తి చేయాలి. ధ్రువీకరణ విజయవంతమైతే ఈ కేవైసీ పూర్తయినట్లు స్క్రీన్‌పై సమాచారం కనిపించడంతో పాటు కన్ఫర్మేషన్ మెసేజ్ కూడా వస్తుంది ఫేస్ స్కాన్ చేసే సమయంలో ముఖం స్పష్టంగా కనిపించేలా ఉండాలి. కళ్లద్దాలు, మాస్క్, టోపీ వంటివి తొలగించడం మంచిది. ఇంటర్నెట్ కనెక్షన్ బాగా ఉండాలి. అలాగే ఆధార్‌లో నమోదైన వ్యక్తే స్కాన్ చేయాలి. లేదంటే ధృవీకరణ విఫలమయ్యే అవకాశం ఉంటుంది. చాలా మంది ఒకేసారి ఈ కేవైసీ చేయడానికి ప్రయత్నిస్తే సర్వర్‌పై ఒత్తిడి పెరిగి యాప్ నెమ్మదిగా పనిచేసే అవకాశం ఉంటుంది. అందుకే ఉదయం తొందరగా లేదా రాత్రి సమయంలో ఈ కేవైసీ ప్రయత్నిస్తే ప్రక్రియ త్వరగా పూర్తయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వినియోగదారులు చెబుతున్నారు.

# సెంట్రల్ యూనివర్సిటీలో ఈగల్ టీం దాడులు

**17 మంది విద్యార్థులకు గంజాయి పాజిటివ్**

**హైదరాబాద్:**హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (ఎజఖ) క్యాంపస్లో తెలంగాణ ఈగల్ టీమ్ మరియు సైబరాబాద్ పోలీసులు ఆకస్మిక దాడులు చేసారు. యూనివర్సిటీ పరిధిలో డ్రగ్స్ విక్రయాలు, వాడకం జరుగుతున్నాయనే పక్కా సమాచారంతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్లో ఈగల్ టీమ్ తనిఖీలు చేపట్టింది. 17 మందికి పాజిటివ్ అనుమానం ఉన్న విద్యార్థులకు డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా, 17 మంది విద్యార్థులకు గంజాయి పాజిటివ్ వచ్చినట్లు నిర్ధారణ అయింది. ప్రధాన నిందితుడి అరెస్ట్ విద్యార్థులకు అక్రమంగా మత్తుపదార్థాలు సరఫరా చేస్తున్న ఒక ప్రధాన డ్రగ్ పెడ్లర్ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన నిందితుడు అస్సాం రాష్ట్రం నుండి గంజాయిని తీసుకువచ్చి ఇక్కడి విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది క్యాంపస్లో ఒక్కో గ్రాము గంజాయిని సుమారు 500 రూపాయ లకు విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం యూనివర్సిటీ ప్రాంగణంలో ఈగల్ టీమ్ తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని పూర్తి వివరాలు, నిందితుల సమాచారం పోలీసుల అధికారిక ప్రకటన ద్వారా వెలువడాల్సి ఉంది.

## వరికి బీమా గడువు ఇక మూడు రోజులే!

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన గడువు ఈ నెల 15తో ముగియనుంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో వరి సాగు రైతులు పంటల బీమాలో నమోదు చేసుకోవటానికి ఇదే చివరి అవకాశం. గడువు లోగా బీమా ప్రీమియం చెల్లిస్తే.. ఈ-పంట నమోదు వివరాలను తర్వాతైనా చేయించుకోవచ్చని వ్యవసాయ శాఖ తెలిపింది. ముందస్తు పంటల బీమాకు ఈ-పంట నమోదు అవసరం లేదని స్పష్టం చేసింది. కేవలం పంట సాగుపై స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పించి, గడువులోగా బీమా ప్రీమియం చెల్లిస్తే చాలని పేర్కొంది. ఎల్.నినో పరిస్థితుల్లో ఆర్థిక భరోసా కోసం ప్రతి రైతు పంటల బీమాలో నమోదు కావాలని సూచించింది.

# అమ్మవారి హుండీలో 17 తులాల జర్మన్ సిల్వర్!

**హైదరాబాద్, ఆగస్టు 12:**లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు పూర్తయింది. బోనాల సందడి ముగిసిన తర్వాత చేపట్టిన లెక్కింపులో నగదుతో పాటు బంగారం, వెండి కానుకలు బయటపడ్డాయి. అయితే ఈసారి హుండీలో లభించిన 170 గ్రాముల జర్మన్ సిల్వర్ ప్రత్యేకంగా ఆకర్షించింది. ఆలయానికి 12 రోజుల వ్యవధిలో వివిధ రూపాల్లో మొత్తం రూ.9,90,726 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో హుండీల ద్వారా రూ.6,26,226 నగదు సమకూరింది. మిగిలిన ఆదాయం ఇతర కానుకలు, పూజా టికెట్లు, కొబ్బరికాయలు, శాంతి కళ్యాణం తదితరాల ద్వారా వచ్చినట్లు అధికారులు తెలిపారు.హుండీ లెక్కింపు సందర్భంగా నగదుతో పాటు 0.06 గ్రాముల బంగారం, 0.28 గ్రాముల వెండి, 170 గ్రాముల జర్మన్ సిల్వర్ లభించినట్లు అధికారులు వెల్లడించారు. సాధారణంగా భక్తులు నగదు, బంగారం, వెండి రూపంలో మొక్కులు చెల్లిస్తుంటారు. ఈసారి జర్మన్ సిల్వర్ కూడా హుండీలో లభించడం ఆసక్తికరంగా మారింది. అయితే ఈ జర్మన్ సిల్వర్ సాధారణ వెండి ధరతో పోలిస్తే చాలా తక్కువగా ఉంటుంది. తులం రూ.300 నుంచి రూ.400 మధ్య ఉంటుంది. అంటే 17 తులాలు 300 చొప్పున అనుకుంటే రూ.5100 మాత్రమే.హుండీల లెక్కింపు సమయంలో మరో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. సీజ్ చేసిన నాలుగు హుండీలను అధికారులు తెరిచి కానుకలను లెక్కించారు. అయితే మరో హుండీ లాక్ ఎంత ప్రయత్నించినా తెరుచుకోలేదు. దీంతో చివరకు వెల్డింగ్ మిషన్ సహాయంతో లాక్‌ను కట్ చేసి హుండీని తెరిచి లెక్కింపు పూర్తి చేశారు. లాల్‌దర్వాజా బోనాల సందర్భంగా అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. తాజాగా హుండీల లెక్కింపు పూర్తి కావడంతో 12 రోజుల ఆలయ ఆదాయ వివరాలను అధికారులు వెల్లడించారు.

# రాయికల్‌లో ఓపెన్ స్పేస్ వినియోగంపై గ్రామస్థుల అభ్యంతరం

**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 12 (స్కై న్యూస్)** రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలం రాయికల్ గ్రామపంచాయతీలో లేఅవుట్‌లో చట్టప్రకారం కేటాయించిన 10 శాతం ఓపెన్ స్పేస్‌ను పోలీస్ కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి వినియోగించేందుకు తీర్మానం చేయడంపై గ్రామస్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎంపీడీవో శ్రీకాంత్‌తో పాటు తహసిల్దార్, సంబంధిత అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. గ్రామస్థుల వివరాల ప్రకారం ఆగస్టు 7న జరిగిన ప్రత్యేక సమావేశంలో ప్రకృతి వైట్‌ఫీల్డ్ అవెన్యూస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన టీఎల్‌పీ నంబర్ 201/2020, సర్వే నంబర్లు 34, 35, 40లోని ఒక ఎకరం 36 గుంటల లేఅవుట్‌లో ఉన్న 10 శాతం ఓపెన్ స్పేస్‌ను పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌కు వినియోగించేలా తీర్మానం చేసినట్లు తెలిపారు. లేఅవుట్‌లోని ఓపెన్ స్పేస్‌ను పార్కులు, పచ్చదనం, ప్రజా ప్రయోజనాల కోసం మాత్రమే వినియోగించాల్సి ఉంటుందని గ్రామస్థులు పేర్కొన్నారు. ఆ స్థలాన్ని వాణిజ్య నిర్మాణాలకు కేటాయించడం, లీజుకు ఇవ్వడం లేదా వినియోగాన్ని మార్చడం నిబంధనలకు విరుద్ధమని ఆరోపించారు. ఇప్పటికే పలువురు వార్డు సభ్యులు తమ అభ్యంతరాలను 'నోట్ ఆఫ్ డిసెంట్' రూపంలో నమోదు





చేసినట్లు తెలిపారు. తీర్మానం రద్దు చేయాలని డిమాండ్ ఆగస్టు 7న ఆమోదించిన తీర్మానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. వార్డు సభ్యులు నమోదు చేసిన అభ్యంతరాలను అధికారిక రికార్డుల్లో చేర్చి ఉన్నతాధికారులకు నివేదించాలని కోరారు. కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం జరిగితే నిర్వహణ, విద్యుత్, ఏసీ తదితర ఖర్చుల కారణంగా అద్దెలు అధికంగా ఉండి పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండకపోవచ్చని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విభాగాలు ఇలాంటి నిర్మాణాలను తమ సొంత భూముల్లోనే చేపట్టాలని సూచించారు. లేఅవుట్‌లోని ఓపెన్ స్పేస్ ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించబడినందున దాని వినియోగాన్ని మార్చకుండా పార్కులు, పచ్చదనం కోసం పరిరక్షించాలని గ్రామస్థులు కోరారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని మాజీ సింగిల్ విండో చైర్మన్ మధుసూదన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రామచంద్రయ్య, రాఘవేంద్ర, విష్ణువర్ధన్ గౌడ్, అనిల్ కుమార్, సంపత్, కిరణ్ తదితరులు హెచ్చరించారు.

# స్వాతంత్ర స్ఫూర్తికే ఘర్ ఘర్ తిరంగా

**వేడుకలలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలి**

**బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పంజుగుల నాగేందర్ గౌడ్**

**నాగర్ కర్నూల్ ఆగస్టు 12 (స్కై న్యూస్)** దేశ స్వాతంత్ర స్ఫూర్తిని ప్రతి ఒక్కరికి కలిగించేందుకే ప్రధాని నరేంద్ర మోడీ హర్ ఘర్ తిరంగా కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగిందని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పంజూగుల నాగేందర్ గౌడ్ అన్నారు బుధవారం కార్యక్రమంలో భాగంగా బిజెపి జిల్లా కార్యాలయం పై త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్రోద్యమంలో ఎందరో తమ ప్రాణాలను త్యాగం చేసి ప్రజలకు స్వేచ్ఛ వాయువును కల్పించారని వివరించారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజాస్వామ్య స్ఫూర్తికి



అనుకూలంగా ఎన్నో చట్టాలను తీసుకువచ్చి దేశ రక్షణ తోపాటు స్వాతంత్ర ఫలాలు అందరికీ అందేందుకు నిర్విరామంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. హర్ ఘర్ తిరంగా ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు పద్మా యాదవ్ ఓబీసీ మోర్చా అధ్యక్షులు జెట్టి వెంకటేష్ దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు భూషయ్య ఎస్టీ మోర్చా అధ్యక్షులు రవీందర్ బీజేవైఎం జిల్లా అధ్యక్షులు నరేష్ చారి సోషల్ మీడియా అఖిల్ రెడ్డి పట్టణ అధ్యక్షులు చెవ్వ ప్రమోద్ కుమార్ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి చంద్రకళ రూరల్ అధ్యక్షుడు నోమేష్ రెడ్డి తాడూరు మండల అధ్యక్షులు సుదర్శన్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ జిల్లా ఉపాధ్యక్షులు పోల్ దాస్ రాము నాయకుడు శ్రీనివాస్ రాజేష్ రెడ్డి శ్రీకాంత్ సంతోష్ సాయి వెంకటేష్, విజయేందర్ రెడ్డి రవి బాలస్వామి సత్యనారాయణ సూరి తదితరులు పాల్గొన్నారు

## ఓపెన్ స్పేస్‌పై ప్రజాభిప్రాయమే కీలకం

**రాయికల్ సర్పంచ్ జ్యోతి రాయికల్ శ్రీనివాస్**



**రంగారెడ్డి జిల్లా ఆగస్టు 12 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా రాయికల్, ఆగస్టు 12: రాయికల్ గ్రామపంచాయతీలో 10 శాతం ఓపెన్ స్పేస్‌ను పోలీస్ కన్వెన్షన్ సెంటర్ కోసం కేటాయించేందుకు తీర్మానం చేసిన విషయం వాస్తవమేనని సర్పంచ్ జ్యోతి రాయికల్ శ్రీనివాస్ తెలిపారు. అయితే స్థలాన్ని ఇప్పటివరకు ఎవరికీ అప్పగించలేదని, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రామసభలో మెజార్టీ ప్రజల అభిప్రాయం మేరకే తీర్మానం చేశామని, కన్వెన్షన్ సెంటర్‌తో పంచాయతీకి ఆదాయం, గ్రామాభివృద్ధికి నిధులు సమకూరే అవకాశం ఉందని తెలిపారు. అలాగే ప్రజలకు తక్కువ ఖర్చుతో శుభకార్యాలు నిర్వహించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ అంశంపై కొందరు బీఆర్ఎస్ నాయకులు అనవసరంగా అపోహలు సృష్టిస్తున్నారని సర్పంచ్ ఆరోపించారు. గ్రామ ప్రయోజనాలు, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తుది నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

## జాగ్రత్తలతో హెచ్ఐవి ని నివారించవచ్చు...

**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**



**నాగర్ కర్నూల్ ఆగస్టు 12( స్కై న్యూస్)** హెచ్ఐవి వ్యాధిపై విసృతంగా ప్రజలలో అవగాహన పెంపొందించి తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రతి ఒక్కరికి వివరించాలని దీని ద్వారానే ఎయిడ్స్ రహిత సమాజాన్ని స్థాపించవచ్చని జిల్లా కలెక్టర్ హేమంతా కేశవ్ పాటిల్ సూచించారు బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధిపై ప్రజలలో ఉన్న అపోహలను తొలగించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. వ్యాధిపై భయపడవలసిన అవసరం లేదని సరైన అవగాహనతో పూర్తిగా నిర్మూలించవచ్చని వాస్తవాలను ప్రజలకు వివరించాలని ఆదేశించారు. వ్యాధిగ్రస్తుల పట్ల ఎలాంటి వివక్ష అవమానం నిర్లక్ష్యం చేయొద్దని వారిని వెలివేస్తే చర్యలు తప్పవన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ ఇమ్మ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవి నాయక్ తో పాటు వైద్య సిబ్బంది వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

# విద్యారంగంలో సమానత్వమే ఏఐఎస్ఎఫ్ ఎజెండా...

**నాగర్ కర్నూల్ ఆగస్టు 12( స్కై న్యూస్)** ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికి సమానత్వంతో విద్యను అందించేందుకు విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఏఐఎస్ఎఫ్ ఏర్పడిందని సంఘం జిల్లా కార్యదర్శి బలముల ప్రేమ్ కుమార్ అన్నారు బుధవారం 90వ వార్షికోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్రోద్యమ కాలంలో ఏర్పడిన ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘమే కాకుండా విద్యార్థుల హక్కుల కోసం సామాజిక న్యాయం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎన్నో పోరాటాలు నిర్వహించామని తెలిపారు. చదువు పోరాటం త్యాగం సేవ సంఘీభావం విజయం అనే నినాదంతో ఏర్పడిన సంఘం దేశంలో విద్యార్థులను చైతన్యం చేస్తూ ప్రభుత్వ వైఫల్యాలను వెంటపడుతూ ఎన్నో పోరాటాలు నిర్వహించి విద్యారంగ పరిరక్షణ హక్కులను సాధించడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం పాలకుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ విద్యా రంగం అనేక సవాళ్లను



ఎదుర్కొంటుందని విద్యార్థులకు జన్మించవలసిన బకాయిలను కూడా ప్రభుత్వాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘించిన సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు ప్రభుత్వ విద్యను పరిరక్షించేందుకు పోరాటాలకు సన్నద్ధమవుతున్నట్లు వివరించారు

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సమీక్షలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 12 (స్కై న్యూస్ ):** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులను ఆదేశించారు. ఫరూఖ్‌నగర్ పరిషత్ కార్యాలయంలో మొదటి దశలో మంజూరైన 3,500 ఇళ్ల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. మంజూరైన ఇళ్లలో 1,866 వివిధ దశల్లో నిర్మాణంలో ఉండగా, 948 ఇళ్లు పూర్తయ్యాయని, 646 ఇళ్ల నిర్మాణం ఇంకా ప్రారంభం కాలేదని అధికారులు తెలిపారు. నిర్మాణం ప్రారంభం కాని ఇళ్లపై గ్రామాల వారీగా సమీక్షించిన ఎమ్మెల్యే, త్వరగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు నిబంధనలపై ముందస్తు అవగాహన కల్పించి, నిర్మాణ సమయంలో అవసరమైన సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా



హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.సి. నాయక్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్,అన్ని మండలాల ఏఈలు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలరాజు గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేఖర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి,రాయికల్ శ్రీనివాస్,రమేష్, సుదర్శన్ గౌడ్, శ్రీధర్,కుమార స్వామి గౌడ్,మున్సిపల్ కమిషనర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు బూట్లు పంపిణీ

**నారాయణపేట ఆగస్టు 12: (స్కైన్యూస్ )** నారాయణపేట మండలం ఎక్లాస్పూర్ , పేరపళ్ళ పాఠ శాలల్లో బుధవారం విద్యా ర్థులకు బూట్లు పంపిణీ చేశారు. కార్యక్ర మానికి అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ బి ఇంద్ర మ్మ, గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ గౌడ్, పేరపళ్ళ సర్పంచ్ ఉప సర్పంచ్,పాఠశాల ప్రధానో పా ధ్యాయులు ఉపాధ్యా య బృందం పాల్గొన్నారు.



## కుంగిపోయిన గంగన్నగూడెం-చెరుకుపల్లి నూతన బ్రిడ్జి

**వంతెనను పరిశీలించిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రామకృష్ణ**

**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 12 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా కొందుర్గ్ మండలంలోని గంగన్నగూడెం-- చెరుకుపల్లి నూతన వంతెన ప్రారంభించిన కొద్దికాలానికే ఇరువైపులా కుంగిపోయిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ తనయుడు రామకృష్ణ ఆరోపించారు. మాజీ సర్పంచ్ ప్రేమ్ కుమార్‌తో కలిసి వంతెనను పరిశీలించిన ఆయన, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడమే కారణమని విమర్శించారు. వంతెనకు వెంటనే నాణ్యమైన మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వంతెన సామర్థ్యాన్ని అధికారులు పరిశీలించి, భారీ వాహనాల రాకపోకలపై నియంత్రణలు విధించాలని కోరారు. ప్రజల సమస్య పరిష్కారానికి అవసరమైతే పోరాటం చేస్తామని రామకృష్ణ హెచ్చరించారు.



## బి ఎం ఎస్ ద్వారానే కార్మికుల హక్కుల సాధ్యం...

**17న ధర్నాను విజయవంతం చేయాలి**

**రాష్ట్ర సంఘటన కార్యదర్శి రామ్మోహన్ జీ**

**నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 12( స్కై న్యూస్)** బి ఎం ఎస్ కార్మిక సంఘం బలోపేతం ద్వారానే కార్మికుల హక్కులు సాధ్యమవుతాయని రాష్ట్ర సంఘటన కార్యదర్శి రామ్మోహన్ జీ అన్నారు బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయనకు స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు సందర్భంగా నిర్వహించిన సమావేశంలో అనేక కార్మికుల సమస్యలను చర్చించి వాటి పరిష్కారానికి చేపట్టబోయే ఉద్యమాలను రూపొందించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకు వచ్చిన లేబర్ ఆక్ట్ ద్వారా కార్మికుల ప్రయోజనాలను కాపాడడం జరుగుతుందని తెలిపారు. బి ఎం ఎస్ పోరాటాలతో ఈపీఎఫ్ నుండి జిపిఎఫ్ అమలు చేయడం జరుగుతుందని విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆ దిశగా పోరాటాలకు సన్నద్ధమవుతున్నట్లు వివరించారు. కనీస వేతనం 15 వేల నుండి 30 వేలకు పెంచడం జరిగిందని ఈపీఎఫ్ పెన్షన్ వెయ్యి రూపాయల నుండి 15 వేలకు పెంచడం జరిగిందని వివరించారు. బి ఎం ఎస్ ఆధ్వర్యంలో ఈనెల 17న కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించాలని నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఆ దిశగా నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని పెద్ద ఎత్తున కార్యకర్తలను సమీకరించాలని సూచించారు ఈ కార్యక్రమంలో నాయకులు మలిశెట్టి బాలరాజు తదితరులు పాల్గొన్నారు



## చేనేత రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీతలను సన్మానించిన ఎమ్మెల్యే

**జోగులాంబ గద్వాల, ఆగస్టు 12(స్కై న్యూస్):** గద్వాల జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నందు ఆగస్టు 7వ తేదీ నాడు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయిలో చేనేత అవార్డుకి ఎంపికైన గద్వాల పట్టణం కేంద్రానికి చెందిన చేనేత కళాకారులు డాకే రాజ్ కుమార్ మరియు దామర్ల శారద గార్లను గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి శాలువా కప్పి ఘనంగా సన్మానించిన జరిగినది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రామలింగేశ్వర్ కాంప్లే, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ కౌన్సిలర్ మురళి, చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడం రామకృష్ణ నాయకులు పార్టీ నాయకులు కురుమన్న, నాగేంద్ర యాదవ్, అక్కల కుమార్ శాంతారాం వెంకటేష్ హరి వీరన్న నాగరాజ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు



## రక్తదానంతో ఆదర్శంగా నిలవాలి

**15న మైల్ స్టోన్ యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం**

**నాగర్ కర్నూల్ ఆగస్టు 12 (స్కై న్యూస్)** దేశ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 15న జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ లో మైల్ స్టోన్ యూత్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు యువత స్వచ్ఛంద సంస్థలు సబ్బండ వర్గాలు రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేసి అందరికీ ఆదర్శంగా నిలవాలని కోరారు. ప్రమాదంలో కానీ అనుకోని విపత్కర పరిస్థితులలో రక్తం లభ్యం కాకపోవడంతో జరుగుతున్న మరణాలను దృష్టిలో ఉంచుకొని గత ఎనిమిది సంవత్సరాలుగా యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాలనీవాసులు ప్రజలు మరిన్ని వివరాలకు చారవాణి నెంబర్ 9603336712 మరియు 7799217934 నెంబర్లను సంప్రదించాలని వారు కోరారు

## భక్తులతో మారుమోగిన శ్రీ తిమ్మప్ప స్వామి క్షేత్రం

**జోగులాంబ గద్వాల, ఆగస్టు 12 (స్కై న్యూస్):** జోగులాంబ గద్వాల జిల్లా ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా బుధవారం భక్తులు పోటెత్తారు. ఉదయం దేవాలయంలో పంచామృత అభిషేకం, అర్చనలు నిర్వహించారు. దేవాలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీ కృష్ణ మాన్య పట్వారి ప్రహ్లాద రావు, ఈవో సత్యచంద్రారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అందుబాటులో ఉండి దేవాలయ సిబ్బంది సేవలు అందించారు. ఈ సందర్భంగా భక్తులకు కాకతీయ టెక్నో స్కూల్, శివ శివాని స్కూల్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. సప్త భజన ఐదవ రోజు సందర్భంగా పలు గ్రామాల భజన మండలి సభ్యులు హరినామ సంకీర్తనలు ఆలపించారు.



వార్తాతరంగాలు
గురువారం 13 ఆగస్టు 2026

# ముగిసిన భగవద్గీత పారాయణం



**నారాయణపేట ఆగస్టు 12: (స్కైన్యూస్)** నారాయణపేట శాంతినగ ర్ బ్రాహ్మణ వాడి శివాల యంలో గత మూడు నెలలుగా భగవద్గీత ప్రవచన పారాయణం నిర్వహించారు.బుధవారం ఈ కార్యక్ర మం ముగింపు ఈ సభ నిర్వహించారు.ఈ సభకు మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ మంజుల జి ఆర్ రెడ్డి , భాజపా జిల్లా అధ్య క్షులు కొండ సత్య యాదవ్, కౌన్సిలర్లు శ్వేతా కృష్ణా రెడ్డి ,కాకర్ల నారాయణమ్మ భీమయ్య ,సత్య రఘు పాల్ , శ్వేతా వెంకటేష్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్త భగవద్గీత ప్రవచనకర్త రవీంద్రనాథ్ ని శాలువా పూలదండలతో ఘనంగా సన్మానించారు. ఆధ్యాత్మిక ప్రవచకులు టీటీడీ ధర్మ ప్రచారకులు శ్రీ శ్రీశైలం పలువురు వక్తలు భగవద్గీత వల్ల మనశ్శాంతి జీవితంలో ఎదురయ్యే అనేక సవాళ్లకు సమస్యలకు భగవద్గీత పరిష్కారం చూపుతోందని కొనియాడారు ఈ కార్యక్ర మంలో ఆలయ కమిటీ కార్యదర్శులు తంగా శివా రెడ్డి,తంగా విశ్వనాథరెడ్డి నరసింహ చిల్లాల్ శివ చిల్లాల్ ,బాలాజీ గౌడ్, బాల్రాజ్ గౌడ్ ,బాలాజీ చిల్లాల్ గోనూర్ రఘు,ఏ అనురాధ,రమాదేవి, సునీత,తంగా వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# లంబాడీలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

**లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మూడవాత్ రాంబల్ నాయక్**



**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 12 (స్కై న్యూస్):** లంబాడీలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మూడవాత్ రాంబల్ నాయక్ హెచ్చరించారు. గిరిజన తెగల మధ్య విభేదాలు సృష్టించి రాజకీయ ప్రయోజనం పొందే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే డిమాండ్‌ను తెరపైకి తీసుకురావడం ద్వారా గిరిజనుల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. అన్ని గిరిజన తెగలకు జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. గిరిజన తెగల మధ్య ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలను ప్రజలు గమనించాలని, లంబాడీల హక్కుల కోసం తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని రాంబల్ నాయక్ స్పష్టం చేశారు.

# ఫిరంగి నాలాను రక్షించి.. అక్రమాలను తొలగించాలి

**హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతిపత్రం అందజేసిన మాజీ ఎమ్మెల్యే, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు**



**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 12 (స్కై న్యూస్):** ఫిరంగి నాలాపై ఉన్న అక్రమ నిర్మాణాలు, కబ్జాలను తొలగించి సహజ ప్రవాహాన్ని కాపాడాలని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు కోరారు. ఈ మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఫిరంగి నాలా గతంలో సాగు, తాగునీటికి, వరద నీటి ప్రవాహానికి కీలకంగా ఉండేదని తెలిపారు. ప్రస్తుతం నాలా ఆక్రమణలకు గురై సహజ ప్రవాహం దెబ్బతినడంతో చిన్న వర్షాలకే రోడ్లు, ఇళ్లలోకి నీరు చేరుతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. ఫిరంగి నాలా పరిధిలోని అక్రమ నిర్మాణాలు, కబ్జాలను తొలగించి, కాలువను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని బక్కని నర్సింహులు హైడ్రా కమిషనర్‌ను కోరారు.

# వ్యసన విముక్తి ప్రతిజ్ఞ పోస్టర్ ఆవిష్కరణ



**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 12 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ పట్టణంలోని బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రంలో వ్యసనాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పించేందుకు బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో చేపడుతున్న '10 కోట్ల వ్యసన విముక్తి ప్రతిజ్ఞల మహా ఉద్యమం' పోస్టర్‌ను మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 'నశా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా వ్యసనాల నిర్మూలనకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. మద్యం, మాదకద్రవ్యాలు, పొగాకు వంటి వ్యసనాలు వ్యక్తులు, కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని, వ్యసన రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ బీకే శోభా, లక్ష్మీ, గ్రంథాలయ కమిటీ చైర్మన్ మదన్‌మోహన్ రెడ్డి, సత్యనారాయణ, యువసత్తా యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్, రవీందర్ రెడ్డి, దామోదర్ రెడ్డి, శివ నాగయ్య, చంద్ర మోహన్, రమేష్ అగర్వాల్, రామకృష్ణ రెడ్డి, యాదవ చారి తదితరులు పాల్గొన్నారు.

# వన దుర్గామాతను దర్శించుకున్న మంత్రి వివేక్ వెంకట స్వామీ



**పాపన్నపేట ,ఆగస్టు12 (వార్తతరంగాలు ):** తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన శ్రీ ఏడుపాయల వనదుర్గామాతను బుధవారం రోజు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామీ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణ కుంభం తో ఘన స్వాగతం పలికారు.అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పాపన్నపేట మండల కేంద్రంలో ఘనంగా హార్గర్ తిరంగా ర్యాలీ

**మండల పార్టీ అధ్యక్షులు వడ్ల సంతోష్ చారి**

**పాపన్నపేట,ఆగస్టు12(వార్త తరంగాలు)::**భారత స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని యావత్ భారతవని సంబరాలు చేసుకుంటున్న వేళ ప్రియతమ ప్రధాని, ప్రపంచం గర్వించదగ్గ నాయకుడు నరేంద్ర మోడీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ పాపన్నపేట మండల పార్టీ అధ్యక్షులు వడ్ల సంతోష్ చారి తెలిపారు.ఇందులో భాగంగా మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాసు రాధా మల్లేష్ గౌడ్ ఆదేశాల మేరకు బుధవారం రోజు పాపన్నపేట మండల కేంద్రంలో జాతీయ వాదులు,బిజెపి నాయకులు,ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు మువ్వన్నెల జెండాలు చేత బూని పాపన్నపేట మండల కేంద్రం పురవీధుల్లో కవాతు ర్యాలీ నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమాన్ని



ఉద్దేశించి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ ఈరోజు మనం అనుభవిస్తున్న స్వాతంత్రం ఎంతోమంది భరతమాత బిడ్డల త్యాగాల ఫలితమేనని అందుకుగాను ప్రతి భారతీయుడు,యువత దేశభక్తిని పెంపొందించుకొని రాబోయే కాలంలో తమ వంతుగా దేశ కీర్తిని ఔన్నత్యాన్ని ఖండాంతరాలు దాటించే విధంగా ప్రతి ఒక్కరూ కృషిచేసి తమ తమ రంగాలలో రాణిస్తూ దేశభక్తిని కలిగి ఉన్నతమైన భారతీయ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు బైండ్ల సత్యనారాయణ ముదిరాజ్,జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు బీకొండ రాములు నేత, రాష్ట్ర ఓబీసీ కార్య వర్గ సభ్యులు గడ్డం కాశీనాథ్,బీజేపీ జిల్లా నాయకులు సుభాష్ చందర్ గౌడ్,ఏంఎల్ఎన్. రెడ్డి,నాగభూషణం, మల్లేశం,బొక్కల భాగేష్, వడ్లభాగేష్,జిన్నగోపాల్, రాజు,చంద్రయ్య,సుంకరి కిష్టయ్య,నర్సింలు,వెంకట్, శ్రావణ్,గౌస్,జగదీష్ సంతోష్ గౌడ్,కనుకంటి విట్టల్,ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింలు,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్,అధ్యాపకులు గ్రామస్తులు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

# పేటలో ఎయిడ్స్‌పై అవగా హన ర్యాలీ

**నారాయణపేట ఆగస్టు 12: (స్కైన్యూస్)**నారాయణపేట పట్టణంలో బుధవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. విద్యాసాగర్ సూచనలతో హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాప్తి, నివారణ, నియంత్రణతో పాటు హెచ్ ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్షను నివారించేం దుకు నారాయణపేట జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చారుఇందులో భాగంగా గ్రామాల్లో ఇంటింటి సంద ర్శనలు, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలతో పాటు ప్రజల్లో హెచ్ఐవీ/ఎయి డ్స్‌పై అవగాహన కల్పిం చేందుకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. జయచంద్ర మోహన్ జెండా ఊపి ర్యాలీని ప్రారం భించారు, ఈ ర్యాలీ ఆర్డీఓ కార్యాలయం నుండి పాత బస్టాండ్ సావర్కర్ చౌరస్తా వరకు కొనసాగింది, డా కే జయచంద్ర మోహన్ మాట్లాడుతూ ప్రజలకు హెచ్ఐవీ వ్యాప్తి, నివారణ చర్యలు, సురక్షిత జీవన విధానంపై అవగాహన కల్పించారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్ష చూపకుండా, వారిని సామాజికంగా ఆదరించి, ఆరోగ్య సేవలు అందేలా సహకరించాలని ప్రజలకు సూచించారు.ఈ సంద ర్భంగా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సత్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, హెచ్ఐవీపై సరైన అవగాహన కలిగి ఉండటం, అపోహలను తొలగించడం, సకాలంలో పరీక్షలు చేయించుకోవడం, నివారణ చర్యలు పాటించ డం ద్వారా హెచ్ఐవీ వ్యాప్తిని నియంత్రిం చవచ్చని తెలిపారు. హెచ్ఐవీ పాజిటివ్ వ్యక్తుల పట్ల వివక్ష చూపకుండా వారికి మద్దతుగా నిలవా లని ప్రజలను కోరారు.ఈ యొక్క కార్యక్రమంలో డా. ఆర్. సత్య ప్రకాష్ రెడ్డి, డా. లక్ష్మీకాంత్, డా. కె. తిరుపతి, శ్రీ బి. శ్రీధర్ రెడ్డి, కోఆర్డినేటర్, శ్రీ సి. అశోక్, కోఆర్డినేటర్,



కౌన్సిలర్ సుధాకర్, బృందం సభ్యు డు కార్తిక్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ బహిరంగ సభను విజయవంతం చేయాలి...

**నాగర్ కర్నూల్ ఆగస్టు 12( స్కైన్యూస్)** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఎన్నికల హామీలను అమలు చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 న ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఐ కంట్రోల్ కమిషన్ సభ్యులు ఆనంద్ జి కోరారు బుధవారం సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్ర మునిసిపాలిటీ పరిధిలోని దేశి ఇటిక్యాల మండల పరిధిలోని పెద్ద ముద్దులు, చందు పట్ల గన్యాగుల నర్సాయిపల్లి గ్రామాలలో నిర్వహించారు సందర్భంగా నిర్వహించిన సభలలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాల వైఫల్యాలపై ప్రజలను చైతన్యం



చేసేందుకు పాదయాత్ర ప్రచార రథాలను నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ప్రజా సమస్యలను అధ్యయనం చేసి పరిష్కార పోరాటాలకు సిపిఐ సన్నద్ధమవుతున్నట్లు వివరించారు నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు మారేడు శివశంకర్ జిల్లా కార్యవర్గ సభ్యులు నరసింహ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వంకేశ్వరం శ్రీనివాసులు నాయకులు రామస్వామి ఆంజనేయులు మల్లయ్య ఖాజా మైనుద్దీన్ రామేశ్వరమ్మ దేవమ్మ లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు

# మెడికోవిద్యార్థినిడాక్టర్,కనికప్రియాంక,చిత్రపటానికినివాళులర్పించిన, పి వై ఎల్ జిల్లా అధ్యక్షులు. బీరెల్లి దానయ్య, మెడికో విద్యార్థులు

**మృతికి కారణమైన 1, జస్వంత్ 2, అంద్రు జోసఫ్ ఎడ్వర్డ్ నీ కఠిన శిక్షించాలి**

**జోగులాంబ గద్వాల జిల్లా ఆగస్టు 11 (స్కై న్యూస్):** గద్వాల కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల హాస్టల్‌లో మెడికో విద్యార్థిని డాక్టర్ కనికే ప్రియాంకకు మెడికల్ విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించి ఆమెకు శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా శంకర ప్రభాకర్ (టీ పి ఫ్), (పి వై ఎల్)బీరెల్లిదానయ్య మాట్లాడుతూ, డాక్టర్ కనికే ప్రియాంక మృతి తీవ్ర విషాదాన్ని కలిగించిందని అన్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న ఒక మెడికల్ విద్యార్థిని ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఆమె మృతికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.డాక్టర్ ప్రియాంక మృతికి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా కారణమైన వారిని గుర్తించి, ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. నేరం రుజువైన వారికి చట్టపరమైన అత్యంత కఠిన శిక్షలు విధించాలని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.విద్యార్థుల భద్రత, ముఖ్యంగా మెడికల్ కళాశాలలు మరియు హాస్టళ్లలో విద్యార్థినుల రక్షణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా హాస్టళ్లలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని కోరారు.డాక్టర్ కనికే ప్రియాంక కుటుంబానికి న్యాయం జరిగే వరకు విద్యార్థులు ఐక్యంగా పోరాడుతారని తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు కూడా మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో.. జమ్మిచేడు కార్తీక్, నాగన్న, మెడికో విద్యార్థులు, మణికంఠ రాజశేఖర్ గుజ్జురాల్, విజయ్, భరత్, సాయికుమార్, తదితరుల మెడుకో విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు.



# ఎడవెల్లి గ్రామంలో విద్యార్థులకు షూస్ పంపిణీ





**ఉట్కూరు ఆగస్టు 12 ( స్కై న్యూస్ )** నారాయణపేట జిల్లా ఉట్కూరు మండల నియోజకవర్గంలోని ఎడవెల్లి గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులకు షూస్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎస్. ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయురాలు కల్పన మేడం, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు షూస్‌ను అందజేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి, వారి భవిష్యత్తుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో విద్యార్థులకు అందిస్తున్న కానుకలు అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎడవెల్లి సర్పంచ్ ఆంజనేయులు. ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 12 (స్కై న్యూస్)** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని వీఐఐటీ జేఈఈ అకాడమీ జూనియర్ కాలేజీలో ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఎం. పవన్ చౌహాన్ ముఖ్యఅతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పవన్ చౌహాన్ మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం, విద్యా పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాశ్ నాయక్ మాట్లాడుతూ షాద్‌నగర్



నియోజకవర్గంలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం విద్యార్థులకు అరటిపండ్లు పంపిణీ చేశారు.

# గౌతమ్ పూర్ లో గ్రామస్తులు లేని గ్రామసభ

**గ్రామ సభ అంటే గాలికేనా? ప్రజలకు సమాచారం ఇచ్చారా..?**

**గౌతమ్ పూర్ పంచాయతీలో వెలవెలబోయిన సభ..**

**వేల జనాభా ఉన్న గ్రామంలో 10 మంది కూడా హాజరు కాని వైనం.. 12 మంది వార్డు సభ్యుల్లో ముగ్గురే రాక**

**గ్రామపంచాయతీ సిబ్బంది ఉపాధి హామీ 100 రోజుల పని వాళ్ళతో సభ**

**నామమాత్రంగా గ్రామ సభ దేనికోసం..?**

**సభ నిర్వహణపై పంచాయతీ కార్యదర్శి తీరుపై గ్రామస్థుల ఆగ్రహం**

**గ్రామ పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం పై జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్**



**చుంచుపల్లి ఆగస్టు 12 (స్కై న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం గౌతంపూర్ గ్రామపంచాయతీలో గ్రామ సభ గ్రామస్తులు లేని గ్రామ సభగా మిగిలిపోయింది.గ్రామ సమస్యలను ప్రజల ముందుకు తెచ్చి, వాటిపై చర్చించి పరిష్కార మార్గాలను అన్వేషించాల్సిన గ్రామ సభ గౌతమ్ పూర్ గ్రామ పంచాయతీలో మాత్రం మొక్కుబడి కార్యక్రమంగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామంలో నిర్వహించిన గ్రామ సభకు ప్రజలు కనీసం 10 మంది కూడా హాజరుకాకపోవడం పంచాయతీ పాలన తీరుపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. వేలాది మంది జనాభా ఉన్న గౌతమ్ పూర్ లో కనీసం 10 మంది ప్రజలు కూడా సభకు హాజరు కాకపోవడం గమనార్హం. అసలు గ్రామ సభ జరుగుతున్న విషయమే తమకు తెలియదని పలువురు గ్రామస్థులు చెప్పడం పరిస్థితికి అద్దం పడుతోంది. గ్రామ సభ నిర్వహించే ముందు ప్రజలకు సమాచారం అందించడం, సభ సమయం, వేదిక, ఉద్దేశం గురించి తెలియజేయడం పంచాయతీ యంత్రాంగం బాధ్యత. గ్రామంలోని సమస్యలను ప్రజల నుంచి తెలుసుకుని వాటిని సభలో చర్చకు తీసుకురావాల్సి ఉంటుంది. కానీ గౌతంపూర్‌లో జరిగిన సభకు సంబంధించి ముందస్తు ప్రచారం..ప్రజలకు సమాచారం అందించే చర్యలు కనిపించలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామ సభ ఉన్నదని ప్రజలకు సమాచారం అందించడంలో విఫలమైన అధికారులు.. కనీసం గ్రామ పంచాయతీ పాలకవర్గానికైనా సమాచారం అందించారా..? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పాలకవర్గంలోని 12 మంది వార్డు సభ్యుల్లో 10 మంది సభకు గైర్హాజరు కావడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోందని గ్రామస్థులు అంటున్నారు. ప్రజల భాగస్వామ్యంతో జరగాల్సిన గ్రామ సభ.. ప్రజలకే తెలియకుండా నిర్వహిస్తే దాని ఉద్దేశమేంటని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రజల సంగతి పక్కన పెడితే.. ప్రజలు ఎన్నుకున్న వార్డు సభ్యుల్లోనూ గ్రామ సభపై ఆసక్తి కనిపించకపోవడం మరింత చర్చకు దారితీస్తోంది. గౌతమ్ పూర్ పంచాయతీలో మొత్తం 12 మంది వార్డు సభ్యులు ఉండగా గ్రామ సభకు కేవలం ఇద్దరు మాత్రమే హాజరైనట్లు తెలుస్తోంది. మిగిలిన 10 మంది సభ్యులు సభకు ఎందుకు దూరంగా ఉన్నారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. తమ తమ వార్డుల్లోని తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు, మౌలిక వసతులు తదితర సమస్యలను గ్రామ సభ దృష్టికి తీసుకురావాల్సిన ప్రజాప్రతినిధులే సభకు గైర్హాజరు కావడంపై గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సభ అనేది కేవలం హాజరు నమోదు చేసి కొన్ని తీర్మానాలు రాసి రికార్డుల్లో చూపించేందుకు నిర్వహించే కార్యక్రమం కాదని గ్రామస్థులు అంటున్నారు. ప్రజల సమస్యలు, అవసరాలు, గ్రామాభివృద్ధికి సంబంధించిన అంశాలపై బహిరంగంగా చర్చించి నిర్ణయాలు తీసుకునే వేదికగా గ్రామ సభకు ఎంతో ప్రాధాన్యం ఉందని పేర్కొంటున్నారు. అలాంటి సభను పంచాయతీ యంత్రాంగం నిర్లక్ష్యంగా నిర్వహిస్తే గ్రామంలోని వాస్తవ సమస్యలు అధికారుల దృష్టికి ఎలా వెళ్తాయని ప్రశ్నిస్తున్నారు. సభ నిర్వహణ బాధ్యతలో కీలక పాత్ర పోషించాల్సిన పంచాయతీ కార్యదర్శి ప్రజలకు గ్రామ సభ సమాచారం చేరేలా ఎలాంటి చర్యలు తీసుకున్నారు..? సభకు ప్రజలను రప్పించేందుకు ఏ మేరకు ప్రచారం చేశారు..? గ్రామంలోని ప్రజాప్రతినిధులకు సరైన సమాచారం అందించారా? అనే ప్రశ్నలు ఇప్పుడు ముందుకొస్తున్నాయి. అలాగే గ్రామ ప్రజలతో సమన్వయం చేసుకుని సభను విజయవంతం చేయాల్సిన సర్పంచ్ బాధ్యత ఏమిటన్నదీ చర్చనీయాంశంగా మారింది. ప్రజల సమస్యలను తెలుసుకునే వేదికనే పట్టించుకోకపోతే పంచాయతీ పాలన ఏ దిశగా సాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం నామమాత్రంగా గ్రామ సభ నిర్వహించి.. అధికారులు, ప్రభుత్వానికి నివేదికలు పంపితే సరిపోతుందా..? లేక ప్రజల భాగస్వామ్యం ఉండేలా సభను నిర్వహించాల్సిన బాధ్యత పంచాయతీ యంత్రాంగానికి లేదా..? అని గ్రామస్థులు నిలదీస్తున్నారు.గ్రామ సభకు ప్రజలు హాజరుకాకపోవడానికి అసలు కారణాలను అధికారులు తెలుసుకోవాలని, సభకు ముందుగా ప్రజలకు సమాచారం అందించడంలో ఎవరి నిర్లక్ష్యం ఉందో తేల్చాలని కోరుతున్నారు. గౌతంపూర్‌లో జరిగిన గ్రామ సభ తీరుపై ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ జరిపి, ప్రజలు హాజరు ఎందుకు ఇంత తక్కువగా ఉందో పరిశీలించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామ సభ నిర్వహణలో నిర్లక్ష్యం వహించినట్లు తేలితే సంబంధిత పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇకపై గ్రామ సభలను కేవలం రికార్డుల కోసం కాకుండా ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించేలా అధికారులు పర్యవేక్షణ పెంచాలని, ప్రతి వార్డులోని సమస్యలు సభలో చర్చకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల కోసం ఏర్పాటు చేసిన గ్రామ సభకు ప్రజలే దూరంగా ఉండే పరిస్థితి రావడం గ్రామ పాలనలో ప్రజల భాగస్వామ్యం ఎంత మేరకు ఉందన్న ప్రశ్నను ముందుకు తెస్తోంది. ప్రజలకు సమాచారం ఇవ్వలేదా ? పాలకవర్గానికైనా సమాచారం అందలేదా ? లేక తెలిసీ ప్రజాప్రతినిధులు సభకు దూరంగా ఉన్నారా ? అన్నది తేలాల్సి ఉంది. గౌతం పూర్ గ్రామ సభ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## రంగారెడ్డి జిల్లాలో సాధారణం కంటే 14 శాతం అధిక వర్షపాతం



**రంగారెడ్డి జిల్లా ఆగస్టు 12 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లాలో ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఇప్పటివరకు సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. ఆగస్టు 12న విడుదలైన సమగ్ర వర్షపాత నివేదిక ప్రకారం జిల్లాలో సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు 9,297.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం 8,155.2 మిల్లీమీటర్లు కాగా, సాధారణం కంటే 14 శాతం అధికంగా వర్షపాతం నమోదైనట్లు నివేదిక వెల్లడించింది. జిల్లాలో ఇప్పటివరకు 27 మండలాల్లో 9 మండలాలు అధిక వర్షపాతం, 12 మండలాలు సాధారణ వర్షపాతం, 6 మండలాలు లోటు వర్షపాతం పరిధిలో ఉన్నాయి. అత్యధిక వర్షపాతం నమోదు అయిన మండలాల్లో షాబాద్‌లో 578.7 మిల్లీమీటర్లు, శంకర్‌పల్లిలో 478.8, కొందుర్గులో 474.5, నందిగామలో 470.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆగస్టు నెలలో ఇప్పటివరకు జిల్లాలో 1,601 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నెలవారీ సాధారణ వర్షపాతం 1,615.9 మిల్లీమీటర్లతో పోలిస్తే దాదాపు సాధారణ స్థాయిలోనే వర్షాలు కురిశాయి. ఆగస్టులో కొందుర్గు మండలంలో అత్యధికంగా 143.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇక ఆగస్టు 12న జిల్లాలోని 27 మండలాల్లోనూ వర్షపాతం నమోదు కాలేదు. దీంతో ఆ రోజు వర్షపాతం లేని మండలాల సంఖ్య 27గా నమోదైంది. జిల్లా వర్షపాత పరిస్థితి మొత్తంగా సాధారణ స్థాయిలో కొనసాగుతున్నప్పటికీ, మండలాల వారీగా అధిక, సాధారణ, లోటు వర్షపాతం పరిస్థితుల్లో తేడాలు కనిపిస్తున్నాయి.

## కరాటేతో విద్యార్థుల్లో శారీరక దారుఢ్యం, ఆత్మ విశ్వాసం పెరుగుతుంది

**ఎస్పీ డాక్టర్ జి. వినీత్**



**నారాయణపేట ఆగస్టు 12:( స్కైన్యూస్)** విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, మార్షల్ ఆర్ట్స్‌లో కూడా రాణించా లని, కరాటే సాధనతో శారీ రక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఘూ అన్నారు.ఆగస్టు 9న హైద రాబాద్ చంపాపేట్‌లో జపాన్ షోటోకాన్ కరాటే ఆధ్వర్యంలో నిర్వహించిన మొదటి జాతీయ స్థాయి కరాటే పోటీల్లో నారాయ ణపేట జిల్లాకు చెందిన విద్యార్థులు పాల్గొని అత్యు త్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా విద్యార్థులు 4 బంగా రు పతకాలు, 3 వెండి పత కాలు, 1 కాంస్య పతకం సాధించి నారాయణపేట జిల్లాకు గర్వకారణంగా నిలిచారు.జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధిం చిన విద్యార్థులను, కరాటే మాస్టర్లను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అభినందిం చి, ప్రశంస పత్రాలు, మెడ ల్స్ అందించి సన్మానించా రు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయస్సు నుంచే క్రీడ లు, కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందడం ద్వారా శారీరకంగా, మానసి కంగా దృఢంగా తయార వుతారని తెలిపారు. క్రీడా ప్రతిభను ప్రోత్సహిం చేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు.జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తు లో మరిన్ని జాతీయ, అంత ర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించారు.ఈ కార్యక్ర మంలో అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, డీఎ స్పీ మహేష్, టోర్నమెంట్ ఇంచార్జ్ మహమ్మద్ సలీం, జిల్లా ప్రెసిడెంట్ అశోక్, అని ల్ కుమార్, మండలాల ఇన్చార్జిలు తాయప్ప, తేయ్యాబ తది తరులు పాల్గొన్నారు.

# నేడు మంత్రివర్యులు ఆత్మకూరుకు రాక...

**మంజూరైన కల్యాణ లక్ష్మి - షాది ముబారక్ చెక్కులు అందజేత**


**ఆగస్టు 12(స్కైన్యూస్ )** ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో రాష్ట్ర మం త్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి మరియు షాది ముబారక్ పథకం ద్వారా మంజూరైన చెక్కులుపంపిణీ కార్యక్రమానికి మంత్రి రాక నేడు మంజూరైన చెక్కులు మంత్రిగారి చేతుల మీదగా చెక్కులు అందజేత గురువారం13/08/2026 ఉదయం 10 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించబడుతుంది ఈ కార్యక్రమంలో మొత్తం 78 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ పథకం చెక్కులను పంపిణీ చేయడం జరుగుతుంది పేద మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ ఆడపిల్లల వివాహానికి అండగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకంకార్యక్రమాల్లో కళ్యాణ లక్ష్మి



షాదీ ముబారక్ పథకం ఎంతో కీలకమైనది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో బదుగు బలహీన ఆడపిల్ల కుటుంబాలకు ఎంతో భరోసానిచ్చే పథకం కళ్యాణ లక్ష్మి మరియు షాది ముబారక్ పేదింటి ఆడపిల్లలకు కాంగ్రెస్ ప్రభుత్వం తరపున భరోసా కల్పిస్తూ మంత్రి గారి చేతుల మీదుగా కళ్యాణ లక్ష్మి చెక్కులు అందజేయడంలో కీలక పాత్ర పోషించనున్నారు మంత్రివర్యులు ఆదేశాలకు ప్రజలకు సంక్షేమం పథకాల ప్రయోజనాలను నేరుగా అందించే దిశగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది కావున సంబంధిత గ్రామాల ప్రజా ప్రతినిధులు అధికారులు తమ గ్రామాలలోని కళ్యాణ లక్ష్మి మరియు షాది ముబారక్ లబ్ధిదారులకు సమాచారం తెలియవలసిందిగా కోరడమైనది ఆత్మకూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎన్ నాగేశ్వర్ టీచర్ మరియు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు శ్రీనివాసులు తెలిపారు

# పోక్సో నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష

**షాద్‌నగర్ ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎస్. స్వాతిరెడ్డి తీర్పు**




**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 12 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా కేశంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి షాద్‌నగర్‌లోని ప్రత్యేక పోక్సో న్యాయస్థానం 10 ఏళ్ల జైలు శిక్ష విధించింది. బుధవారం ప్రత్యేక సెషన్స్ జడ్జి, 16వ అదనపు జిల్లా జడ్జి, పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎస్. స్వాతిరెడ్డి తీర్పు వెలువరించారు. పోలీసుల వివరాల ప్రకారం కేశంపేట పోలీస్ స్టేషన్‌లో 2019లో క్రైమ్ నంబర్ 161/2019గా కేసు నమోదైంది. ఐపీసీ 366ఏ, 376 సెక్షన్లతో పాటు పోక్సో చట్టంలోని 3, 4 సెక్షన్లు, బాల్య వివాహాల నిరోధక చట్టంలోని సెక్షన్ 9 కింద కేసు నమోదు చేశారు. ఎస్సీ నంబర్ 263/2020గా విచారణ కొనసాగింది. ఈ కేసులో ఇప్లపల్లి గ్రామానికి చెందిన కొండాని నరేష్ (28)ను నిందితుడిగా గుర్తించారు. విచారణ అనంతరం నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. కేసు దర్యాప్తును తొలుత కేశంపేట ఎస్ఐ కె. వెంకటేశ్వర్లు, అనంతరం షాద్‌నగర్ రూరల్ సీఐ ఎం.జి.ఎస్. రామకృష్ణ నిర్వహించారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీలు రామకృష్ణ, శేఖరాచారి, సబియా సుల్తానా వాదనలు వినిపించారు. కేసు బ్రీఫింగ్ అధికారిగా కేశంపేట ఎస్‌హెచ్‌ఓ బి. నరహరి, లైజనింగ్ అధికారులుగా డబ్ల్యూపీసీ ఎన్. జ్యోతి, ఏఎస్ఐ పి. సక్రియా వ్యవహరించారు. కేసు విచారణలో ప్రాసిక్యూషన్‌కు సహకరించిన పోలీసు సిబ్బందిని అధికారులు అభినందించారు.

# దేశ ఐక్యత కోసం కాంగ్రెస్ సద్భావన యాత్ర

**డిసీసీ అధ్యక్షులు కె. ప్రశాంత్ రెడ్డి**





**నారాయణపేట ఆగస్టు 12( స్కైన్యూస్)** మత సామరస్యం,సామాజిక ఐక్యతే రాజీవ్ గాంధీ సద్భావన జ్యోతి యాత్ర లక్ష్యమని నారాయణపేట డిసీసీ అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి అన్నారు.దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రాజీవ్ గాంధీ సద్భావన జ్యోతి బస్సు యాత్ర కర్ణాటక రాష్ట్రం రాయచూర్ నుంచి కృష్ణా బ్రిడ్జి మీదుగా తెలంగాణలోకి ప్రవేశించిన సందర్భంగా బుధవారం ఉదయం పది గంటలకు నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కే. ప్రశాంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం మాగనూరు,మక్తల్, ఉట్కూర్ మీదుగా నారాయణపేట జిల్లా కేంద్రంనికి చేరుకుంది. అంబెద్కర్ మరియు చిట్టెం.నర్సిరెడ్డి విగ్రహాలకు పూల మాలలతో నివాళులు అర్పించిన అనంతరం అక్కడి నుంచి జులాపూర్ బార్డర్ వరకు యాత్ర కొనసాగింది.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు కే. ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూరాజీవ్ గాంధీ దేశంలో మత సామరస్యం, జాతీయ సమైక్యత, సామాజిక న్యాయం, సౌభ్రాతృత్వం కోసం కృషి చేసిన మహా నాయకుడున్నారు.వారి శయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ సద్భావన జ్యోతి బస్సు యాత్ర ప్రధాన లక్ష్యంమని,మతం, కులం,ప్రాంతం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలను తిప్పికొట్టి,ప్రతి ఒక్కరూ సోదరభావంతో కలిసి జీవించాలనే సందేశాన్ని ఈ యాత్ర ద్వారా ప్రజలకు తెలియచేస్తున్నామన్నారు.దేశ అభివృద్ధికి శాంతి, సామరస్యం,ఐక్యత ఎంతో అవసరం.కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల హక్కులు,రాజ్యాంగ విలువలు, లౌకికవాదం, సామాజిక సమానత్వం కోసం నిలబడుతుందన్నారు.. నేటి యువత రాజీవ్ గాంధీ గారి ఆధునిక భారతదేశ స్వప్నాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాజీవ్ సద్భావన జ్యోతి యాత్ర కన్వీనర్ దోరై వేలు స్వామి,యాత్ర ప్రధాన కార్యదర్శి సుజేంద్ర శెట్టి,మార్కెట్ చైర్మన్ శివారెడ్డి,కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. సలీం,అధికార ప్రతినిధి సంతోష్, మండల,పట్టణ అధ్యక్షులు కోట్ల. రవీందర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్,అనంద్,కౌన్సిలర్ రవితేజ, ఆర్టివో బోర్డ్ డైరెక్టర్ పోషల్ రాజేష్,యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కోట్ల. మధుసూదన్ రెడ్డి,సీనియర్ నాయకులు ఎండి గౌస్,మనోహర్ గౌడ్,జొన్నల జయంత్ రెడ్డి,బోయ.శరణప్ప,యండి.ఖాజా,బాల్ రెడ్డి,మహిమూద్ ఖురేషి,పల్ల అనిల్,మాజీద్, రవికుమార్ గౌడ్, శ్రీకాంత్,తదితరులు పాల్గొన్నారు.

# గోవింద నామస్మరణతో మారుమోగిన కురుమూర్తి కొండలు

**చిన్న చింతకుంట ఆగస్టు 12 (స్కై న్యూస్);** చిన్న చింతకుంట మండల పరిధిలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో సప్తగిరు ల మధ్య కాంచన గుహలో స్వయంభుగా వెలసిన శ్రీ కురుమూర్తి స్వామి ని బుధవారం ఆషాడ అమావాస్య ని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లాల నుంచి భక్తులు తండలుగా కదిలి వచ్చి స్వామి పుష్కరిణిలో పవిత్ర స్నానాలు చేసి తడి గుడ్డలతో క్యూ లైన్ లో నిలిచి శ్రీ కురుమూర్తి వాస, ఆపదమొక్కులవాడ, వడ్డీకాసుల వాడ గోవిందా గోవింద అంటూ వివిధ ఆలయాల లో మొక్కులు చెల్లించుకొని, స్వామి వెలిసిన కాంచన గుహలో ప్రత్యేక



మొక్కులు చెల్లించుకున్నారు అనంతరం కొండ దిగువ భాగంలో స్వామికి దూప దీప నైవేద్యములు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ పాలక మండలి చైర్మన్ బత్తుల బాలరాజ్ ఆలయ కార్య నిర్వహణ అధికారి మధునేశ్వర్ రెడ్డి పాలక మండలి సభ్యులు ఆలయ సిబ్బంది ఎప్పటికప్పుడు భక్తులకి ఇబ్బందులు కలకుండా పరిరక్షణ నిర్వహిస్తున్నారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు దేవాలయం నుంచి అన్న దానం చేశారు.

వార్తాతరంగాలు

గురువారం 13 ఆగస్టు 2026

# ఆశా కార్యకర్తపై దాడి ఘటనపై కఠిన చర్యలు

## బాధితురాలికి అండగా నిలిచిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ

**పాల్వంచ, ఆగస్టు 12 ( స్కై న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలోని కోయినవారిపురం గ్రామంలో విధులు నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తపై జరిగిన దాడి ఘటనపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. ఈ ఘటనకు సంబంధించి బాధిత ఆశా కార్యకర్త ఆశా యూనియన్ నాయకులు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. తుకారామ్ రాథోడ్ ని సమిశ్రుత జిల్లా అధికారుల సముదాయం బిల్డింగ్, నవభారత్, పాల్వంచలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం, 07 ఆగస్ట్ 2026న కోయినవారిపురం గ్రామంలో ఒక కుటుంబంలో జరిగిన ఘటనకు సంబంధించి అక్కడికి వెళ్లిన ఆశా కార్యకర్తపై కొంతమంది వ్యక్తులు దాడి చేసి, దురుసుగా ప్రవర్తించినట్లు వివరించారు. ఈ ఘటనలో ఆమెకు గాయాలు కావడంతో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తలపై ఇలాంటి దాడులు జరగడం పట్ల ఆశా యూనియన్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డా. తుకారామ్ రాథోడ్ బాధిత ఆశా కార్యకర్తను పరామర్శించి, ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు అడిగి



తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆరోగ్యం కుదుటపడే వరకు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని, త్వరగా కోలుకోవడానికి అవసరమైన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అలాగే, ఆశా కార్యకర్తల భద్రతకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో జిల్లాలో పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని, సంబంధిత శాఖ అధికారులతో తాను స్వయంగా మాట్లాడి ఘటనపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా చూస్తామని హామీ ఇచ్చారు. అవసరమైన సందర్భంలో బాధ్యులపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయించేలా సంబంధిత అధికారులతో మాట్లాడుతామని తెలిపారు. ఆశా కార్యకర్తలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మాతా–శిశు ఆరోగ్యం, గర్భిణీల సేవలు, టీకాలు, కుటుంబ సంక్షేమం, వ్యాధి నిరోధక చర్యలు తదితర అనేక కీలక ఆరోగ్య సేవలను అందిస్తూ ఆరోగ్య శాఖకు ముఖ్యమైన క్షేత్రస్థాయి సిబ్బందిగా సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. విధి నిర్వహణలో వారికి ఎటువంటి ఇబ్బంది లేదా భద్రతాపరమైన సమస్య ఎదురైనా వెంటనే సంబంధిత వైద్యాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఆశా కార్యకర్తలు ప్రజల ఆరోగ్య సేవల కోసం అంకితభావంతో పనిచేస్తున్నందున, వారికి గౌరవం భద్రత కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన తెలిపారు. భవిష్యత్తులో ఆశా కార్యకర్తల విధులకు ఆటంకం కలిగించే వారిని లేదా వారిపై దాడులకు పాల్పడే ఘటనలను తీవ్రంగా పరిగణించి, సంబంధిత శాఖల సమన్వయంతో అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆశా యూనియన్ నాయకులు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. తుకారామ్ రాథోడ్ కి కృతజ్ఞతలు తెలిపారు. బాధిత ఆశా కార్యకర్తకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# డిజిటల్ నేరాలపై అవగాహనతోనే సైబర్ రక్షణ

## సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన షాద్‌నగర్ పోలీసులు

**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 12 (స్కై న్యూస్ ):** డిజిటల్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవడం ద్వారా సైబర్ మోసాలను అరికట్టవచ్చని షాద్‌నగర్ పోలీసులు తెలిపారు. షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్న చిల్కమర్రి గ్రామంలోని ఎంఎస్ఎన్ సంస్థ ప్రాంగణంలో ఉద్యోగులు, వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం రెండో వారపు సైబర్ నేరాల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డిజిటల్ భద్రత, ఆర్థిక మోసాల నివారణ లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సైబర్ నిపుణులు, పోలీస్ అధికారులు ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న వివిధ రకాల సైబర్ మోసాలపై వివరంగా అవగాహన కల్పించారు. ముఖ్యంగా నకిలీ స్టాక్ మార్కెట్, ట్రేడింగ్ యాప్‌లు, అధిక లాభాలు వస్తాయంటూ ఆకర్షించే మోసపూరిత పథకాలు, అనుమతి లేని డిజిటల్ లోన్ యాప్‌లు, వ్యక్తిగత మరియు బ్యాంకింగ్ వివరాలను తస్కరించే ఫిషింగ్ లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డిజిటల్ ఖాతాల భద్రతపై సూచనలు బ్యాంకింగ్, వ్యక్తిగత ఖాతాల భద్రత కోసం బలమైన పాస్‌వర్డ్‌లను వినియోగించాలని, రెండు దశల ధృవీకరణను తప్పనిసరిగా



అమలు చేసుకోవాలని పోలీసులు సూచించారు. బహిరంగ వై–ఫై ద్వారా బ్యాంకింగ్ లావాదేవీలు నిర్వహించవద్దని, అనుమానాస్పద ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్ సందేశాలు, తెలియని లింకులను తెరవవద్దని హెచ్చరించారు. మోసానికి గురైతే వెంటనే స్పందించాలి సైబర్ మోసానికి గురైనప్పుడు ఆలస్యం చేయకుండా వెంటనే స్పందించడం అత్యంత కీలకమని పోలీసులు తెలిపారు. బాధితులు వెంటనే 1930 జాతీయ సైబర్ నేరాల హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే అధికారిక సైబర్ నేరాల వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని తెలిపారు. త్వరగా ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని వివరించారు. ఉద్యోగుల సందేహాలకు సమాధానాలు అనంతరం నిర్వహించిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఉద్యోగులు అడిగిన యూపీఐ భద్రత, ఇంటి నుంచి పనిచేసే ఉద్యోగాల పేరుతో వచ్చే నకిలీ ఆఫర్లు, గుర్తింపు చోరీ తదితర అంశాలపై అధికారులు సమాధానాలు ఇచ్చారు. డిజిటల్ లావాదేవీల సమయంలో అప్రమత్తంగా ఉండాల్సిన విధానాలను వివరించారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని, అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు వెల్లడించకుండా జాగ్రత్తలు పాటించాలని షాద్‌నగర్ పోలీసులు సూచించారు. డిజిటల్ భద్రతపై నిరంతర అవగాహనతోనే సైబర్ నేరాలను సమర్థంగా ఎదుర్కోగలమని పేర్కొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలి

**క్షేత్రస్థాయి పర్యవేక్షణను నిరంతరం కొనసాగించాలి**

**అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి**

**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 12 (స్కై న్యూస్):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును మరింత పెంచడంతో పాటు విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో రాష్ట్ర టాస్ డైరెక్టర్ లింగయ్య ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలాల వారీగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, హాజరు, పాఠశాలల పనితీరు, విద్యా ప్రమాణాలు, క్షేత్రస్థాయి పర్యవేక్షణ తదితర అంశాలను సమీక్షించారు. ప్రతి అర్హత కలిగిన విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చేరేలా తల్లిదండ్రులకు పాఠశాలల్లో అందుతున్న విద్య, మౌలిక వసతులు, ప్రభుత్వ సదుపాయాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని డాక్టర్ కిరణ్మయి పేర్కొన్నారు. పాఠ్యాంశాల బోధనతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక



విలువలు, బాధ్యతాయుత పౌరసత్వ భావన పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచడం, హాజరు మెరుగుపరచడం, విద్యా ప్రమాణాలను పెంపొందించడం ప్రతి ఉపాధ్యాయుడి బాధ్యతగా భావించాలని తెలిపారు. పాఠశాలల పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రాష్ట్ర టాస్ డైరెక్టర్ లింగయ్య మాట్లాడుతూ మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు



క్రమం తప్పకుండా పాఠశాలలను సందర్శించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి అవసరమైన మార్గదర్శకాలు అందించాలని, క్షేత్రస్థాయి పర్యవేక్షణ నిరంతరం కొనసాగితేనే విద్యాశాఖ కార్యక్రమాల్లో ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు, మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

# అపోలో ఫార్మసీలో కొలువుల జాతర

**100కుపైగా ఉద్యోగ ఖాళీలు.**

**14న కొత్తగూడెంలో ఉద్యోగ మేళా**

**19 నుంచి 30 ఏళ్ల నిరుద్యోగ యువతీ యువకులకు అవకాశం**

**రూ.12,500 నుంచి రూ.25 వేల వరకు వేతనం**

**కొత్తగూడెం ఆగస్టు 12 (స్కై న్యూస్ ):** నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో అపోలో ఫార్మసీలో ఉద్యోగాల భర్తీకి ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన అపోలో ఫార్మసీ సంస్థలో 100కుపైగా ఖాళీలను భర్తీ చేసేందుకు ఈ ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 14న ఉదయం 10 గంటలకు కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ సమీపంలో గల చుంచుపల్లి మండలంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. 19 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువతీ యువకులు ఈ మేళాకు హాజరై ఉద్యోగ



అవకాశాలను పొందవచ్చని సూచించారు. ట్రైనీ ఫార్మసిస్ట్, రిటైల్ ట్రైనీ అసోసియేట్, ఫార్మసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్, ప్రొడక్ట్ అడ్వైజర్ తదితర పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. డీ.ఫార్మసీ, బీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీతోపాటు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు ఆయా పోస్టులకు అర్హులని పేర్కొన్నారు. తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ ధ్రువపత్రం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12,500 నుంచి రూ.25,000 వరకు వేతనం అందనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వెల్లడించారు. అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హతల ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు ప్రతులను వెంట తీసుకురావాలని సూచించారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి కొండపల్లి శ్రీరామ్ కోరారు.

# పవిత్ర శ్రావణ మాస ప్రత్యేక పూజలు

**ఆత్మకూర్ ఆగస్టు 12( స్కై న్యూస్)** ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో పవిత్ర శ్రావణ మాస ప్రత్యేక పూజలు 13/8/2026 గురువారం నుండి11/9/2026 శుక్రవారం వరకు ప్రత్యేక పూజలు జరుపబడును శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ఆత్మకూర్ లో పవిత్ర శ్రావణమాసం సందర్భంగా స్థానిక వెంకటేశ్వర స్వామి దేవాలయం నందు నిత్య పూజలు జరిపించుటకు ఆలయ కమిటీ నిర్ణయించింది శ్రావణమాసం అయిపోయే వరకు మీ గోత్రం నామాలతో 30 రోజుల అభిషేకం నిత్యం పూజలు జరిపించదలచిన భక్తులు 316/ రూపాయలు చెల్లించి వెంకటేశ్వర స్వామి గుడిలో పూజలు చేసుకోవాల్సిందిగా ఆలయ కమిటీ పెద్దలు నిర్ణయించారు పవిత్ర శ్రావణంమాసం మనకు ఎంతో పవిత్రమైనది ప్రతి ఒక్కరూ వెంకటేశ్వర స్వామి గుడిలో ప్రత్యేక పూజలు చేయడం జరుగుతుంది ఇది ఆనవాయితీగా ప్రతి సంవత్సరం ప్రత్యేక పూజలు చేయడం జరుగుతుంది అలాగే ప్రతి శనివారం సాయంత్రం ఐదు గంటలకు నుండి 6 గంటల వరకు విష్ణు సహస్రనామం పారాయణం జరపబడును భక్తుల అధిక సంఖ్యలో పాల్గొం నీ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా జరిపించాల్సిందిగా దేవాలయ కమిటీ నిర్ణయించింది.



# పార్టీలు యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి....

**నాగర్ కర్నూల్ ఆగస్టు 12( స్కై న్యూస్)** రాజకీయ పార్టీలు యువతలో రాజకీయ అవగాహన పెంపొందించి నాయకత్వ లక్షణాలను పెంపొందించినప్పుడే ప్రజాస్వామ్య పరిరక్షణ జరుగుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే గీతాంజలి అన్నారు కళాశాలలో బుధవారం అంతర్జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకొని యువతపై రాజకీయ పార్టీల ప్రభావం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ అధ్యక్షత వహిస్తూ ప్రసంగించారు సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత రాజకీయ విషయాలను విమర్శనాత్మకంగా పరిశీలించి ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతి అందించారు ఈ కార్యక్రమంలో ఆధ్యాపకులు డాక్టర్ ధర్మ డాక్టర్ కృష్ణ సుధాకర్ మహమ్మద్ సయ్యద్ డాక్టర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు



# చేవెళ్ల దాబా ఘటనపై సీపీ సీరియస్

**బాధితులతో మాట్లాడిన ఫ్యూచర్ సిటీ కమిషనర్, సీపీ తరుణ్ జోషి**




**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 12 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని దాబాలో జరిగిన దాడి ఘటనపై ఫ్యూచర్ సిటీ కమిషనర్, సీపీ తరుణ్ జోషి తీవ్రంగా స్పందించారు. బాధితులు, రజక సంఘం నాయకులు సీపీని కలిసి ఘటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను అందజేసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసిన సెక్షన్లు, నిందితుల వివరాలపై సీపీ ఆరా తీసినట్లు బాధితులు తెలిపారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన పోలీసులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే సస్పెండ్ చేస్తామని సీపీ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం బాధితులు చేవెళ్ల డీసీపీని కలిసి ఘటన వివరాలను వెల్లడించారు. నిందితులను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని, ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని డీసీపీ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం రెపరెపలాడాలి

**డా. బూర నర్సయ్య గౌడ్**

**రంగారెడ్డి జిల్లా ఆగస్ట్ 12;** రంగారెడ్డి జిల్లా ।బ్రహీంపట్నం నియోజకవర్గం ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రంలో ఒక పాఠశాల విద్యార్థి విద్యార్థినులతో గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి పిలుపు మేరకు నిర్వహించిన "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర




ఉపాధ్యక్షులు డా. బూర నర్సయ్య గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని తిరంగా ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ, జాతీయ జెండా ప్రతి భారతీయుడి గౌరవానికి, దేశభక్తికి ప్రతీక అని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఇంటా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తి భావాన్ని చాటాలని పిలుపునిచ్చారు. దేశ సమైక్యత, సార్వభౌమత్వం, అఖండతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని అన్నారు. యువతలో దేశభక్తి, జాతీయ భావాలను మరింతగా పెంపొందించేందుకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి నారాయణ యాదవ్ , బిజెపి రాష్ట్ర నాయకులు నాయని సత్యనారాయణ , ఆదిభట్ల మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ పొట్టి శ్రీరాములు ,ఇబ్రహీంపట్నంమున్సిపాలిటీ,అధ్యక్షులు ముత్యాల మహేందర్ రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ కౌన్సిల్ సభ్యులు ఆడెపు.రాఘవేంద్ర స్వామి , ఇబ్రహీంపట్నం మండల మాజీ అధ్యక్షులు దండే శ్రీశైలం , యువ మోర్చా జిల్లా నాయకులు సిద్ధం శివకుమార్ , బిజెపి సీనియర్ నాయకులు గణేష్ , ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ యువమోర్చా అధ్యక్షులు కంబాలపల్లి శశిధర్ రెడ్డి , మున్సిపాలిటీ ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షులు దాసు, ఎస్సీ మోర్చా జిల్లా నాయకులు కొండ్రు శ్రీనివాస్, మున్సిపాలిటీ కిసాన్ మోర్చా అధ్యక్షులు బస్వాపురం గోవర్ధన్, మున్సిపాలిటీ యువమోర్చా నాయకులు మదుపోజు.భరత్ చారి బిజెపి నాయకులు గొట్టం శ్రీశైలం ,బీజేపీ నాయకులు సురేష్ , కృష్ణ మరియు కార్యకర్తలు, ప్రజలు, యువత, మహిళలు, స్కూల్ విద్యార్థులు,పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ జెండాలతో ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# తాలిపేరు ప్రాజెక్టును సందర్శించిన జిల్లా కలెక్టర్ అంకిత్

## నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికాబద్ధంగా వినియోగించాలి

## ఏకలవ్య మోడల్ పాఠశాలలో విద్యా ప్రమాణాలు, వసతులపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

## విద్యార్థుల విద్య, ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక దృష్టి సారించాలి

**చర్ల ఆగస్టు 12 ( స్కై న్యూస్):**చర్లలోని తాలిపేరు ప్రాజెక్టును, ఏకలవ్య మోడల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ముందుగా తాలిపేరు ప్రాజెక్టును సందర్శించిన కలెక్టర్, ప్రాజెక్టులోని ప్రస్తుత నీటిమట్టం, నీటి ప్రవాహం, నీటి విడుదల, ప్రాజెక్టు నిర్వహణ, సిబ్బంది తదితర అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 73.80 మీటర్ల నీటిమట్టం ఉందని, ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 74 మీటర్లు అని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రధానంగా ఛత్తీస్‌గఢ్ ప్రాంతం నుంచి ప్రాజెక్టుకు నీటి ప్రవాహం వస్తుందని, గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది నీటి ప్రవాహం తక్కువగా ఉందని తెలిపారు. ప్రస్తుతం నీటి ప్రవాహం స్థిరంగా లేకుండా పెరుగుతూ, తగ్గుతూ కొనసాగుతోందని, బుధవారం సుమారు 2,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని, రానున్న రోజుల్లో ఇది మరింత తగ్గే అవకాశం ఉందని అధికారులు వివరించారు.ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు విడుదల చేస్తున్న నీటి వివరాలను కూడా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, కుడి కాలువ ద్వారా 30 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని అధికారులు తెలిపారు. తాలిపేరు ప్రాజెక్టు ద్వారా సుమారు 24 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నట్లు వివరించారు. ప్రాజెక్టులో పనిచేస్తున్న సిబ్బంది సంఖ్య, వారి విధులు, ప్రాజెక్టు నిర్వహణకు అవసరమైన సిబ్బంది, గేట్లు, ఇతర యంత్రాంగం నిర్వహణకు సంబంధించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు నిర్వహణకు అవసరమైన ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, గేట్ ఆపరేటర్లు, పంప్ ఆపరేటర్లను శాశ్వత ప్రాతిపదికన కేటాయించాలని అధికారులు కలెక్టర్‌ను కోరారు.అనంతరం ప్రాజెక్టు కంట్రోల్ రూమ్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కంట్రోల్ రూమ్ ద్వారా ప్రాజెక్టులోని గేట్ల నిర్వహణ, నీటి ప్రవాహం, నీటిమట్టం తదితర అంశాలను ఏ విధంగా పర్యవేక్షిస్తున్నారనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు గేట్లను నిర్వహించే విధానం, నీటి ప్రవాహంలో మార్పులను గుర్తించే విధానం, ప్రాజెక్టు పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం డ్యామ్ పరిసర ప్రాంతాలను పరిశీలించి, ప్రాజెక్టు భద్రత, నిర్వహణకు సంబంధించిన అంశాలను పరిశీలించారు.అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ చర్లలోని ఏకలవ్య మోడల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, వసతులు, భోజనం, వైద్య సేవలు, పరిశుభ్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తరగతి గదులను సందర్శించి ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధిస్తున్న విధానాన్ని పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం, ఆ రోజు తరగతులకు హాజరైన విద్యార్థుల సంఖ్యను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నలు అడిగి వారి అవగాహన, అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థుల నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలను పరిశీలించి, కొంతమంది విద్యార్థులతో పుస్తకాలు చదివించి వారి చదివే సామర్థ్యాన్ని స్వయంగా తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలు, వసతుల విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారుపాఠశాలలోని కిచెన్‌ను కూడా కలెక్టర్ పరిశీలించారు. వంటగదిలో పరిశుభ్రత, వంట చేసే విధానం, ఉపయోగిస్తున్న కూరగాయలు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భోజనం నాణ్యత, రుచి, పరిమాణం ఎలా ఉందనే విషయాలను విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వంటగది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.పాఠశాల ఆవరణలోని హెల్త్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అక్కడ అందుబాటులో ఉన్న మందులు, మందుల నిల్వ, విద్యార్థులకు అందిస్తున్న వైద్య



సేవలు, నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలు, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన వివరాలను ఏఎన్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందుతున్నాయా, ఆరోగ్య సమస్యలు ఉన్న విద్యార్థులను ఏ విధంగా గుర్తించి చికిత్స అందిస్తున్నారనే అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల హాజరు రిజిస్టర్‌తో పాటు పాఠశాలలో నిర్వహిస్తున్న వివిధ రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించి వివరాలను సరిచూశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్‌లో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున అందుబాటులో ఉన్న నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకునేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రాజెక్టులో నీటిమట్టం, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లోను నిరంతరం పర్యవేక్షించాలని, నీటి ప్రవాహంలో మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాజెక్టు గేట్లు, కంట్రోల్ రూమ్, ఇతర యంత్రాంగం నిరంతరం పనిచేసేలా అవసరమైన నిర్వహణ చర్యలు చేపట్టాలని, ప్రాజెక్టు నిర్వహణకు అవసరమైన సిబ్బంది, సాంకేతిక సహకారం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యార్థుల విద్యా ప్రమాణాలు, ఆరోగ్యం,



పోషకాహారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి విద్యార్థి అభ్యసన సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని, విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా విషయాన్ని అర్థం చేసుకుని నేర్చుకునేలా బోధనా పద్ధతులను మెరుగుపరచాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పరిశుభ్రమైన, పోషక విలువలతో కూడిన భోజనం అందించాలని, వారి ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, వంటగది, హెల్త్ సెంటర్ తదితర ప్రాంతాల్లో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని సూచించారు. విద్యార్థులు తమ సమస్యలను స్వేచ్ఛగా తెలియజేసేలా ఉపాధ్యాయులు వారితో స్నేహపూర్వకంగా మెలగాలని, పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.ఈ పర్యటనలో కలెక్టర్ వెంట చర్ల తాసిల్దార్, ఇరిగేషన్ అధికారులు, విద్యాశాఖ అధికారులు, ఎంపీడీవో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు ప్రణాళికతో సిద్ధం కావాలి

**రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ**

**మహబూబ్ నగర్, ఆగస్టు 12(స్కైన్యూస్ ):**ఖరీఫ్ సీజన్ 2026--27లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం మహబూబ్‌నగర్‌లోని కలెక్టరేట్‌లో తన ఛాంబర్‌లో ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించి జిల్లా స్థాయి ప్రొక్యూర్‌మెంట్ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, గత మూడు సీజన్లలో వరి ధాన్యం కొనుగోలుకు నిర్దేశించిన లక్ష్యాలు, సాధించిన పురోగతిని సమీక్షించడంతో పాటు, ప్రస్తుత పంట సాగు పరిస్థితి, క్రాప్ బుకింగ్ వివరాలను పరిగణనలోకి తీసుకుని ఖరీఫ్ సీజన్‌లో ఆశించిన దిగుబడిపై వ్యవసాయ శాఖ అందించిన అంచనాల ఆధారంగా ధాన్యం కొనుగోళ్లకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని తెలిపారు అందుకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, మిల్లింగ్ సామర్థ్యం, రవాణా, ఇతర మౌలిక సదుపాయాలపై సంబంధిత శాఖలు ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ



శాతం కొలిచే పరికరాలు, టార్పాలిన్లు, ధాన్యం శుభ్రపరిచే పరికరాలు తదితర అవసరమైన సామగ్రిని తగినంతగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అవసరమైన పరికరాలను సంబంధిత సంస్థల ద్వారా ముందుగానే సమకూర్చుకోవాలని సూచించారు.అలాగే మిల్లుల వారీగా ధాన్యం పంపిణీ, మిల్లింగ్ ప్రక్రియ, గత సీజన్‌కు సంబంధించిన లక్ష్యాల పురోగతిపై కూడా అదనపు కలెక్టర్ సమీక్షించారు. మిల్లర్లకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసి, ప్రభుత్వానికి అవసరమైన బియ్యం సరఫరా ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా మూడు నెలలకు అవసరమైన బియ్యం సరఫరా, పంపిణీపై జిల్లా పౌర సరఫరాల అధికారి, సంబంధిత సిబ్బందితో అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.జిల్లాలోని చౌకధర దుకాణాలకు అవసరమైన బియ్యం సరఫరాలో ఇప్పటికే గణనీయమైన పురోగతి సాధించినట్లు అధికారులు వివరించారు. మిగిలిన బియ్యం నిల్వలను కూడా త్వరితగతిన చౌకధర దుకాణాలకు తరలించి, పంపిణీ ప్రక్రియను పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.చౌకధర దుకాణాల వద్ద బియ్యం పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఎక్కడైనా సమస్యలు లేదా ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి పరిష్కరించాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి కృష్ణ, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ రవి నాయక్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ,వ్యవసాయ శాఖ,మార్కెటింగ్ శాఖ,పౌర సరఫరాల డి. టి .లు,తదితరులు పాల్గొన్నారు.

## భూత్పూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో పారిశుధ్య పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్

**మహబూబ్ నగర్, ఆగస్టు 12(స్కైన్యూస్ ):**భూత్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్‌ఎస్)లో పారిశుధ్య చర్యలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ బుధవారం పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించిన ఆయన, విద్యార్థులు, ఉపాధ్యాయులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం



కల్పించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని పాఠశాల అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో ఎక్కడా చెత్త, వ్యర్థ పదార్థాలు పేరుకుపోకుండా చూడాలని, పిచ్చిమొక్కలు, పొదలు, కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. ముఖ్యంగా పాములు దాగేందుకు అవకాశం ఉన్న పొదలు, చెత్తాచెదారం, ఇతర ప్రదేశాలను పూర్తిగా శుభ్రం చేయాలని ఆదేశించారు. విద్యార్థులు, సిబ్బంది భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ పాము కాట్ల నివారణకు అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. పాఠశాల పరిసరాల్లో పారిశుధ్య ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు

## హెచ్ ఐ వి /ఎయిడ్స్ పై అవగాహనలో బాగంగా బైక్ ర్యాలీ




మహబూబ్‌నగర్ జిల్లాలో హెచ్.ఐ.వి/ఎయిడ్స్ పై ప్రచార అవగాహన కార్యమం లో బాగంగా ప్రచార పోస్టర్ మరియు క్యూర్ కోడ్‌లను ఆవిష్కరించి, అనంతరం ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమమును డి ఎం ఎచ్ ఓ డా. శ్రీనివాసులు , సూపరింటెండెంట్ డా. రంగ అజ్మీరా లు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు.ప్రజల్లో ఎచ్ ఐ వి /ఎయిడ్స్ నివారణ, సురక్షితమైన ఆరోగ్య ప్రవర్తన, ముందస్తు పరీక్షలు, చికిత్స మరియు అవగాహన పెంపొందించడమే ఈ



ప్రచార కార్యక్రమం ప్రధాన లక్ష్యమని డా. శ్రీనివాసులు తెలిపారు. ప్రజలందరూ ఈ అవగాహన కార్యక్రమంలో భాగస్వాములై, ఆరోగ్య సమాచారాన్ని ప్రతి ఒక్కరికీ చేరవేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమములో ఎయిడ్స్ ప్రోగ్రాం అధికారి డా. రాజు, డా. శంకర్, డా. పులి విద్య, హెల్త్ ఎడ్యుకేటర్ హన్మంతు, సుభాష్ చంద్ర, కార్యాలయానికి చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో అమావాస్య అన్న ప్రసాద వితరణ

**నాగర్ కర్నూల్ ఆగస్టు 12 (స్కై న్యూస్)** అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో ప్రతి అమావాస్య రోజున నిర్వహించే అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని బుధవారం పట్టణంలోని సంజయ్ నగర్ కాలనీ చౌరస్తాలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి రాష్ట్ర కోశాధికారి పుట్ట నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పూజను నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని స్థానిక కౌన్సిలర్ జక్కసింధు రాజు, కౌన్సిలర్లు రాజేశ్వరి, అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి బాధ్యులు మురళి గురుస్వామి, అనిల్ గురుస్వామి, ఆంజనేయులు గురుస్వామి, నరేష్ గురు స్వామి, లక్ష్మణ్ గురు స్వామి, న్యాయవాది భవాని బాయి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కోశాధికారి పుట్ట నరేందర్ రెడ్డి మాట్లాడుతూ అఖిలభారత





అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాలలో అనేక పట్టణాలలో ప్రతి అమావాస్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమం తో పాటు ప్రతి బుధవారం, శనివారం ఇంటింటికి భజన కార్యక్రమాలను నిర్విరామంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రమైన నాగర్ కర్నూల్ లో కూడా గత కొన్ని నెలల నుండి అమావాస్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అయ్యప్ప భక్తులు, స్వచ్ఛంద సంస్థలు సామాజిక కార్యకర్తలు సహకరించి విజయవంతం చేయాలని కోరారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు క్రీడా పోటీలు ప్రారంభం

**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 12 (స్కై న్యూస్ ):** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఫరూఖ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన 12వ వార్డు కౌన్సిలర్ కళ్యాణకర్ దిలీప్ కుమార్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని, క్రమశిక్షణతో పోటీల్లో పాల్గొని క్రీడాస్ఫూర్తిని చాటాలని సూచించారు. వివిధ క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా



పాల్గొన్నారు. ఆగస్టు 15న జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు పాఠశాల వర్గాలు తెలిపాయి.

# బిజినెస్

## ఏఐ డేటా సెంటర్లతో అధిక వేతన ఉద్యోగాలు: ఎన్విడియా సీఈఓ



**ఇంటర్నెట్ డెస్క్:** కృత్రిమ మేధ రాకతో ఓవైపు టెక్ కంపెనీల్లో వరుస లేఆఫ్‌లు కలవరపెడుతున్నాయి. మరోవైపు గ్రాడ్యుయేట్లు ఉద్యోగాలు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. అయితే, ఏఐ కారణంగా పెద్దఎత్తున డేటా సెంటర్లు ఏర్పాటవుతున్నాయి. వీటివల్ల ఉపాధి అవకాశాలు పెద్దగా ఉండబోవన్న ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. టెక్ రంగానికి అతీతంగా ఏఐ అధిక వేతన ఉద్యోగాలను సృష్టిస్తుందని అభిప్రాయపడ్డారు. డేటా సెంటర్ల నిర్మాణంతో ఇది సాధ్యం కానుందని చెప్పారు. కానీ వైట్ కాలర్ రంగంలో మాత్రం ఆ అవకాశం ఉండకపోవచ్చన్నారు. "ఏఐ రాకతో టెక్ రంగంలో కాకుండా ఇతర రంగాల్లో భారీగా ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ డేటా సెంటర్లపై టెక్ కంపెనీలు భారీగా ఖర్చు చేస్తున్నాయి. దశాబ్దం చివరి నాటికి దాదాపు 7 ట్రిలియన్ డాలర్లకు పెట్టుబడులు చేరే అవకాశం ఉంది. ప్రస్తుతం ఏఐ డేటా సెంటర్ల నిర్మాణానికి అవసరమైన, నైపుణ్యం కల్గిన ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు..తదితర శ్రామికుల కొరత ఉంది. రాబోయే రోజుల్లో ఏఐ డేటా సెంటర్లు భారీగా రానున్నాయి. వాటి నిర్మాణం, నిర్వహణకు ప్లంబర్లు, సూపర్ వైజర్లకు భారీ డిమాండ్ ఏర్పడనుంది. నైపుణ్యం ఉన్న వర్కర్లు ఏడాదికి లక్ష డాలర్లు (సుమారు రూ.84 లక్షలకు పైగా) సంపాదించొచ్చు" అని తెలిపారు. ఏఐ యుగంలో మంచి ఆదాయం పొందడానికి కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ చేయాల్సిన అవసరంలేదన్నారు. నైపుణ్యాధారిత పనులు వచ్చిన వారికి కూడా సురక్షిత భవిష్యత్తు ఉంటుందన్నారు.

## దిగుమతి సుంకం పెంపు..
## బంగారం, వెండితో 10వేల కోట్లు

**ఢిల్లీ:** దేశంలో బంగారం, వెండి కొనుగోళ్లను నియంత్రించేందుకు దిగుమతి సుంకాలు సవరించడం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. మే 13 నుంచి ఆగస్టు 2 మధ్య బంగారం, వెండి, ప్లాటినమ్‌పై కస్టమ్స్ డ్యూటీ రూపంలో రూ.10,463 కోట్లు వసూలైనట్లు కేంద్రం పార్లమెంట్‌కు వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, హర్మూజ్ మూసివేత నేపథ్యంలో క్రూడాయిల్ ధరలు భారీగా పెరిగాయి. ఆహారం, ఎరువుల ధరలకూ రెక్కలొచ్చాయి. దీంతో విదేశీ మారకం నిల్వలు కాపాడుకునేందుకు ప్రభుత్వం కొన్ని చర్యలు చేపట్టింది. అందులో కస్టమ్స్ సుంకాల సవరణ ఒకటి. ఆయా లోహాలపై దిగుమతి సుంకం పెంచడం ద్వారా కొనుగోళ్లు తగ్గించాలన్నది ప్రభుత్వ వ్యూహం. ఇందులో భాగంగా బంగారం, వెండిపై 6 శాతంగా ఉన్న కస్టమ్స్ సుంకాన్ని మే 13న 15 శాతానికి సవరించింది. ప్లాటినంపైనా 6.4 శాతం నుంచి 15.4 శాతానికి చేర్చింది. ఈ క్రమంలో మే 13 నుంచి ఆగస్టు 2 మధ్య బంగారంపై రూ.10,040 కోట్లు సుంకాల రూపంలో వసూలైంది.

# రికార్డు స్థాయిలో భారత్‌లోకి రష్యన్ చమురు

ఢిల్లీ: భారత్‌లోకి రష్యా చమురు వరద పారుతోంది. పశ్చిమ దేశాల ఆంక్షలు కొనసాగుతున్నా డిస్కౌంట్ ధరకే లభిస్తున్న రష్యన్ క్రూడ్ పెద్దఎత్తున దిగుమతి అవుతోంది. ఈ ఏడాది వరుసగా రెండో నెలా జులైలో రికార్డు స్థాయిలో రష్యన్ చమురు దిగుమతి అయ్యింది. ఈ మేరకు సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ సంబంధిత డేటాను విడుదల చేసింది. దీని ప్రకారం.. జులైలో 5.5 బిలియన్ యూరోల విలువైన రష్యా క్రూడ్‌ను భారత్ దిగుమతి చేసుకుంది. జూన్‌తో పోలిస్తే పరిమాణ పరంగా 2.1 శాతం అధికం. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి రష్యన్ క్రూడ్‌పై భారత్ ఆధారపడడం గణనీయంగా పెరిగింది. 2021లో రష్యా నుంచి భారత్‌లోకి దిగుమతయ్యే చమురు రోజుకు లక్ష బ్యారెళ్ల కంటే తక్కువే. అంటే భారత్‌లోకి దిగుమతయ్యే మొత్తం ముడి చమురులో దీని వాటా 2.5 శాతం కంటే తక్కువే అన్నమాట. అలాంటిది ఉక్రెయిన్‌తో వార్ అనంతరం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 2022 నాటికి ఈ సంఖ్య రోజుకు 7.40 లక్షల బ్యారెళ్లకు, 2023 నాటికి సుమారు 18 లక్షల బ్యారెళ్ల మిలియన్ బ్యారెళ్లకు చేరుకుంది. దీంతో అప్పట్లో భారత్ దిగుమతుల్లో రష్యా వాటా 39 శాతానికి చేరింది. ఈ ఏడాది జులైలోనూ భారతీయ రిఫైనరీలు రికార్డు స్థాయిలో క్రూడ్‌ను దిగుమతి చేసుకున్నాయి. సగటున రోజుకు 28 లక్షల బ్యారెళ్ల రష్యన్ క్రూడ్ దిగుమతి అయ్యింది. భారత్ మొత్తం దిగుమతుల్లో రష్యా చమురు వాటా 55.5 శాతానికి చేరింది. ఉక్రెయిన్




యుద్ధం తర్వాత రష్యా క్రూడ్ ఎగుమతుల్లో చైనా తర్వాత భారత్ రెండో అతిపెద్ద కొనుగోలుదారుగా అవతరించింది. జులై నెలలో జామ్‌నగర్, పారాదీప్ వంటి పెద్ద టెర్మినల్స్ కాకుండా.. హెచ్‌ఎంఎల్ ముంద్రా, వాడినార్ ఎస్‌ఎంపీఎల్ టెర్మినల్, ముంబయి టెర్మినల్స్‌లో దిగుమతులు పెరిగాయి. రష్యన్ క్రూడ్‌ను శుద్ధి చేస్తున్న భారతీయ రిఫైనరీలు.. ఆంక్షలు విధించిన దేశాలకు ఎగుమతి చేస్తున్నాయి. జులైలో ఈయూ, ఆస్ట్రేలియా, అమెరికా దేశాలకు చమురు ఉత్పత్తుల రవాణా కొనసాగిందని సీఆర్ఈఏ పేర్కొంది.

# ఇథనాల్ తయారీకి చెరకు వాడకంపై కేంద్రం కోత?

దేశీయంగా రికార్డు స్థాయికి చేరిన చక్కెర ధరలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. రాబోయే అక్టోబరు నుంచి ప్రారంభమయ్యే నూతన మార్కెటింగ్ సీజన్‌లో ఇథనాల్ తయారీ కోసం చెరకు వినియోగాన్ని పరిమితం చేయాలని యోచిస్తోంది. దేశీయ వినియోగానికి ప్రథమ ప్రాధాన్యమిస్తూ మార్కెట్‌లో చక్కెర లభ్యతను పెంచడం, తద్వారా భగ్గుమంటున్న నిత్యావసర ధరలను అదుపు చేయడమే ఈ ప్రతిపాదన వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం.
దేశంలో చక్కెర ఉత్పత్తికి కీలకంగా ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో ఈసారి వర్షపాతం కొరవడటంతో రాబోయే పంట దిగుబడిపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు సరఫరా తగ్గిపోవడం, సమీపిస్తున్న పండుగల సీజన్ దృష్ట్యా వినియోగం పెరగడంతో గత నెల రోజుల్లోనే చక్కెర ధరలు ఏకంగా 10 శాతం మేర పెరిగి గరిష్ఠ స్థాయికి చేరాయి. పరిస్థితులు చేయిదాటిపోకుండా ఉండటానికి, విదేశాల నుంచి అత్యవసర దిగుమతులు చేసుకునే పరిస్థితి రాకుండా నివారించేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలకు ఉపక్రమించింది. గడిచిన ఏడాది కాలంలో చక్కెర మిల్లులు



సుమారు 30 లక్షల మెట్రిక్ టన్నుల చక్కెరను (మొత్తం ఉత్పత్తిలో దాదాపు 10 శాతం) ఇథనాల్ తయారీకి మళ్లించాయి. అయితే నూతన నిబంధనల ప్రకారం, నేరుగా 'చెరకు రసం' అలాగే అధిక చక్కెర తీవ్రత ఉండే 'బీ-హెవీ' మొలాసెస్ నుంచి ఇథనాల్ ఉత్పత్తిని నిలిపివేయాలని మిల్లులను ఆదేశించే అవకాశం ఉంది. దీనికి బదులుగా చక్కెర సేకరించగా మిగిలిన వ్యర్థ పదార్థమైన 'సీ-హెవీ' మొలాసెస్ నుంచి మాత్రమే ఇథనాల్ ఉత్పత్తికి అనుమతించనున్నారు. అయితే, పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపాలనే ఈ-20 జాతీయ లక్ష్యానికి విఘాతం కలగకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ప్రణాళికను సిద్ధం చేస్తోంది. చెరకు ద్వారా తగ్గే ఇథనాల్ కోటాను భర్తీ చేయడానికి దేశంలో ప్రస్తుతం పుష్కలంగా లభ్యమవుతున్న మొక్కజొన్న, బియ్యం నిల్వలను ఇథనాల్ తయారీకి విస్తృతంగా వినియోగించుకోవాలని భావిస్తోంది. ఈ సమతుల్య విధానం అమలులోకి వస్తే దేశీయంగా చక్కెర సరఫరా స్థిరపడి సామాన్య వినియోగదారులకు ధరల భారం నుంచి ఉపశమనం లభిస్తుందని ఆర్థిక రంగానికి చెందిన నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## చరిత్ర సృష్టించిన మిచెల్ మార్ష్..
# టీ20ల్లో అరుదైన రికార్డు

ఆస్ట్రేలియా విధ్వంసకర బ్యాటర్ మిచెల్ మార్ష్ పొట్టి క్రికెట్‌లో అరుదైన రికార్డు సాధించాడు. ఒకే ఏడాదిలో 1500 టీ20 పరుగులు పూర్తి చేసిన తొలి ఆసీస్ బ్యాటర్‌గా చరిత్రకెక్కాడు. హండ్రెడ్ 2026లో సన్‌రైజర్స్ లీడ్స్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న అతడు.. తాజాగా వెల్ష్ ఫైర్‌తో జరిగిన మ్యాచ్‌లో (34 బంతుల్లో 50) ఈ ఘనత సాధించాడు. మిచ్ మార్ష్‌కు ముందు ఈ రికార్డు టిమ్ డేవిడ్ పేరిట ఉండేది. 2022లో అతడు 1461 పరుగులు చేశాడు. 2024లో ట్రావిస్ హెడ్ 1442 పరుగులతో టిమ్‌కు దగ్గరగా వచ్చాడు. ఈ ఏడాది ఇప్పటివరకు 35 మ్యాచ్‌లు ఆడిన మార్ష్.. 44.17 సగటున, 160కి దగ్గరగా స్ట్రైక్‌రేట్‌తో, రెండు సెంచరీలు, 11 అర్ధ సెంచరీల సాయంతో 1502 పరుగులు చేసి టిమ్ డేవిడ్ రికార్డును బద్దలు కొట్టాడు. మార్ష్ అంతర్జాతీయ క్రికెట్‌లో ఆస్ట్రేలియా తరఫున, బిగ్ బాష్ లీగ్‌లో పెర్త్ స్కార్చర్స్, ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్, ది హండ్రెడ్‌లో సన్‌రైజర్స్ లీడ్స్ తరఫున ఆడుతూ ఈ పరుగులు సాధించాడు.



**కోహ్లి, ఏబీడీ సరసన చోటు**

ఈ ఏడాది టీ20ల్లో 1500 పరుగులు సాధించడంతో మార్ష్ విరాట్ కోహ్లి, ఏబీ డివిలియర్స్ సరసన చేరాడు. విరాట్ 2016లో 1614 పరుగులు చేయగా.. ఏబీడీ 2019లో 1580 పరుగులు చేశాడు. ఓవరాల్‌గా ఓ క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక టీ20 పరుగుల ప్రపంచ రికార్డు మాత్రం వెస్టిండీస్ స్టార్ నికోలస్ పూరన్ పేరిట ఉంది. 2024లో పూరన్ ఏకంగా 2331 పరుగులు చేశాడు.

**హండ్రెడ్‌లోనూ చరిత్రకు చేరువలో..!**

హండ్రెడ్‌లోనూ మార్ష్ మరో రికార్డుకు చేరువలో ఉన్నాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఆడిన ఏడు ఇన్నింగ్స్‌ల్లో 374 పరుగులు చేసిన అతడు.. ఓ హండ్రెడ్ సీజన్‌లో అత్యధిక పరుగుల రికార్డుకు 51 పరుగుల దూరంలో ఉన్నాడు. ఈ రికార్డు ప్రస్తుతం జేమ్స్ విన్స్ పేరిట ఉంది. విన్స్ 2024లో సదర్న్ బ్రేవ్ తరఫున 424 పరుగులు చేశాడు. గత కొన్నేళ్లలో మార్ష్ తన బ్యాటింగ్ తీరును చాలా మార్చుకున్నాడు. ఒకప్పుడు ప్రధానంగా ఆల్‌రౌండర్‌గా కనిపించిన అతడు ఇప్పుడు టాపార్డర్‌లో విధ్వంసక బ్యాటర్‌గా మారాడు. మొత్తం టీ20 కెరీర్‌లో మార్ష్ ఇప్పటివరకు 7033 పరుగులు చేశాడు. అతడి సగటు 34.64 కాగా.. స్ట్రైక్‌రేట్ 141.48.

## సీఎస్‌కే హెడ్‌కోచ్‌గా బ్రెండన్ మెక్‌కల్లమ్!

ఐపీఎల్-2027 సీజన్‌కు ముందు చెన్నై సూపర్ సూపర్ కింగ్స్ తమ కొత్త హెడ్‌కోచ్ కోసం వేట ప్రారంభించింది. హెమాంగ్ బదానీ, రవిచంద్రన్ అశ్విన్, రాహుల్ ద్రవిడ్ వంటి భారత మాజీ ఆటగాళ్ల పేర్లు ప్రచారంలోకి వచ్చినప్పటికీ.. సీఎస్‌కే మాత్రం విదేశీ హెడ్ కోచ్ కోసం వెతుకుతున్నట్లు తెలుస్తోంది. స్టీఫెన్ ఫ్లెమింగ్ స్థానంలో మరో న్యూజిలాండ్ లెజెండ్ బ్రెండన్ మెక్‌కల్లమ్‌ను తమ జట్టు ప్రధాన కోచ్‌గా ఎంపిక చేయాలని సీఎస్‌కే భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. కాగా మెక్‌కల్లమ్ ఇటీవల ఇంగ్లండ్ టెస్టు జట్టు హెడ్‌కోచ్ బాధ్యతల నుంచి తప్పుకొన్న సంగతి తెలిసిందే. అయితే అతడు ఇంగ్లీష్ జట్టు వైట్‌బాల్ కోచ్‌గా మాత్రం కొనసాగుతున్నాడు. త్వరలోనే ఈ పదవి నుంచి కూడా అతడు వైదొలిగే అవకాశమున్నట్లు పలు రిపోర్ట్‌లు పేర్కొంటున్నాయి. ఇకపై అతడు ఫ్రాంచైజీ క్రికెట్‌పై దృష్టిసారించే అవకాశముందన్న ప్రచారం జరుగుతోంది. కాగా మెక్‌కల్లమ్‌కు సీఎస్‌కేతో మంచి అనుబంధం ఉంది. అతడు ఫ్లెమింగ్ నాయకత్వంలో సీఎస్‌కే తరఫున ఆడాడు. ఈ నేపథ్యంలోనే అతడిని తమ కోచ్‌గా నియమించాలని నియమించాలని భావిస్తున్నట్లు క్రికెట్ వర్గాలు వెల్లడించాయి. కానీ దీనిపై సీఎస్‌కే నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. మరోవైపు ముంబై ఇండియన్స్ కెప్టెన్, స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యాను ట్రేడ్ చేసుకోవడానికి కేకేఆర్, లక్నో సూపర్ జెయింట్స్‌తో పాటు సీఎస్‌కే కూడా ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. అయితే ప్రస్తుతం ఫ్రాంచైజీ పూర్తి



దృష్టి హెడ్ కోచ్ ఎంపికపైనే ఉందంట. కోచ్ ఎంపిక ఖారారైన తర్వాతే పాండ్యాపై ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది.


# స్పోర్ట్స్

## వైభవ్ కాదు.. అతడి సెలక్షన్ ఒక అద్భుతం!




పంజాబ్ యువ పేసర్ గుర్నూర్ బ్రార్ టీమిండియా తరఫున అద్భుతంగా రాణిస్తున్న సంగతి తెలిసిందే. జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్‌లకు బ్యాకప్ బౌలర్‌ను వెతుకుతున్న సమయంలో సెలక్టర్ల దృష్టిలో పడ్డాడు గుర్నూర్. 6 అడుగుల 5 అంగుళాల పొడవున్న ఈ రైట్ ఆర్మ్ పేసర్.. గంటకు 142 కిలోమీటర్లకు పైగా వేగంతో బౌలింగ్ చేస్తూ బ్యాటర్లను ముప్పుతిప్పలు పెడుతున్నాడు. వన్డేల్లో తనను నిరూపించుకున్న గుర్నూర్.. ఇప్పుడు రెడ్ బాల్ క్రికెట్‌లో సత్తాచాటేందుకు సిద్ధమయ్యాడు. ఆగస్టు 15 నుంచి గాలె వేదికగా శ్రీలంకతో జరిగే తొలి టెస్టులో గుర్నూర్ అరంగేట్రం చేసే అవకాశముంది. ఈ నేపథ్యంలో గుర్నూర్ బ్రార్‌పై టీమిండియా మాజీ పేసర్ జహీర్ ఖాన్ ప్రశంసల వర్షం కురిపించాడు. గుర్నూర్‌కు మంచి బౌలింగ్ స్కిల్స్ ఉన్నాయని, సుదీర్ఘ కాలం పాటు అంతర్జాతీయ క్రికెట్‌లో కొనసాగుతాడని జహీర్ కొనియాడాడు. "అధిక వేగంతో బౌలింగ్ చేయగల యువ ఫాస్ట్ బౌలర్లు భారత జట్టులోకి వస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. గుర్నూర్ బ్రార్ వంటి యంగ్ పేసర్‌ను త్వరితగతిన జట్టులోకి తీసుకోవడం చాలా మంచి నిర్ణయం. అతడికి అద్భుతమైన టాలెంట్ ఉంది. బంతిని ఇరువైపులా స్వింగ్ చేయగలడు. కేవలం ఒక్క వేగమే కాదు సరైన లైన్ అండ్ లెంగ్త్‌తో కూడా బౌలింగ్ చేయగలడు. అతడు సుదీర్ఘ కాలం పాటు అంతర్జాతీయ క్రికెట్‌లో కొనసాగుతాడని నేను నమ్ముతున్నానని ఓ ఇంటర్వ్యూలో జహీర్ పేర్కొన్నాడు. కాగా 26 ఏళ్ల గుర్నూర్ బ్రార్ గత కొంతకాలంగా మూడు ఫార్మాట్లలోనూ నిలకడగా రాణిస్తున్నాడు. రంజీ ట్రోఫీ 2024-25 సీజన్‌లో పంజాబ్ తరఫున గుర్నూర్ అద్భుత ప్రదర్శన చేశాడు. కేవలం 7 మ్యాచ్‌లలోనే 26 వికెట్లు పడగొట్టి సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. ఆ తర్వాత పంజాబ్ టీ20 లీగ్‌లో కూడా టాప్ వికెట్ టేకర్‌గా(22) అతడు నిలిచాడు. ఐపీఎల్‌లో మాత్రం అతడు ఇప్పటివరకు కేవలం ఒకే ఒక మ్యాచ్ ఆడాడు. అయినప్పటికి అతడి టాలెంట్‌ను పరిగణలోకి తీసుకుని జాతీయ జట్టులో సెలక్టర్లు చోటిచ్చారు. అఫ్గానిస్తాన్‌తో వన్డే సిరీస్‌లో అరంగేట్రం చేసిన గుర్నూర్ తన సూపర్ బౌలింగ్‌తో అందరిని ఆకట్టుకున్నాడు. ఇప్పటివరకు ఆడిన 6 వన్డేల్లో అతడు 11 వికెట్లు పడగొట్టాడు. దీంతో ఇప్పుడు టెస్ట్ జట్టులో కూడా అతడు చోటు కొట్టేశాడు.!

# పాన్ ఇండియా మార్కెట్‌లోకి కిరణ్ అబ్బవరం



తెలుగు యంగ్ హీరోల్లో కిరణ్ అబ్బవరం ఒకడు. షార్ట్ ఫిల్మ్స్‌తో కెరీర్ ప్రారంభించి, రాజావారు రాణిగారు' మూవీతో హీరో అయ్యాడు. తర్వాత పలు సినిమాలు చేశాడు గానీ చాలావరకు ఫ్లాపులే. ఎట్టకేలకు 'క' అనే థ్రిల్లర్ సినిమాతో సక్సెస్ అందుకున్నాడు. దీని తర్వాత వచ్చిన 'దిల్‌రుబా' డిజాస్టర్ కాగా.. కె ర్యాంప్, చెన్నై లవ్ స్టోరీ చిత్రాలు సక్సెస్ అయ్యాయి. ప్రస్తుతం ఓ వెబ్ సిరీస్, దర్శకుడిగా ఓ మూవీ చేస్తున్న కిరణ్ అబ్బవరం.. ఇప్పుడు పాన్ ఇండియా వైడ్ తన అదృష్టం పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యాడు. 'ఇంద్రపుత్ర' పేరుతో మూవీని అనౌన్స్ చేశారు. సోమవారం ఈ టైటిల్ ప్రకటిస్తూ ఓ పోస్టర్ రిలీజ్ చేశారు. కాటమరాయుడు, గాండీవధారి అర్జున, కుడి ఎడమైతే, కాంతార ఛాప్టర్ 1 సినిమాలకు పనిచేసిన శ్రీకాంత్ పుప్పాల దీంతో దర్శకుడిగా మారుతున్నాడు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. కిరణ్ అబ్బవరం పాన్ ఇండియా ప్రయత్నం మెచ్చుకోదగిందే గానీ అదెంత వరకు వర్కౌట్ అవుతుందనేది భవిష్యత్తులో తెలుస్తుంది. ఎందుకంటే పోస్టర్ చూస్తుంటే డివోషనల్ స్టోరీలా అనిపిస్తుంది. కానీ ఈ జానర్ ఇప్పుడు పాతబడిపోయింది. అదే టైంలో కిరణ్ మార్కెట్ కూడా టాలీవుడ్ వరకే పరిమితం. ఈ నిర్మాత గతంలో తెలుగు హీరో సుధీర్ బాబుతో 'జటాధర' అని ఓ మూవీ చేస్తే అది ఘోరంగా ఫెయిలైంది. మరి ఈసారి ఏం చేస్తారనేది చూడాలి?

# ప్రభాస్ మూవీలో ఛాన్స్.. మీ టాలెంట్ బయటికి తీయండి!



ప్రభాస్- నాగ్ అశ్విన్ కాంబోలో వచ్చిన సైన్స్ ఫిక్షన్ మూవీ కల్కి 2898 ఏడీ. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ చిత్రాన్ని వైజయంతి మూవీస్ బ్యానర్‌లో భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఈ చిత్రంలో దీపికా పదుకొణె, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, కీలక పాత్రల్లో కనిపించారు. ప్రస్తుతం ఈ మూవీ సీక్వెల్ పనులతో బిజీగా ఉన్నారు నాగ్ అశ్విన్. తాజాగా ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి అదిరిపోయే న్యూస్ చెప్పారు మేకర్స్. ఈ చిత్రంలో మీరు కూడా భాగం అవ్వాలని అనుకుంటున్నారా? ప్రభాస్ మూవీలో ఛాన్స్ కొట్టేయాలనుందా? మరి ఇంకెందుకు ఆలస్యం మీ టాలెంట్ చూపించే వీడియోలను పంపండి. ఈ క్రేజీ ఛాన్స్ కొట్టేయండి అంటున్నారు మేకర్స్. తాజాగా ఈ సీక్వెల్ మూవీలో నటించాలనుకునే వారి కోసం క్యాస్టింగ్ కాల్ వచ్చేసింది. ఈ అరుదైన గోల్డెన్ ఛాన్స్‌ను మీ రెండు చేతులతో ఒడిసి పట్టుకోండి. నటనపై ఆసక్తి, ప్రతిభ ఉన్నవారికి ఎలాంటి షరతులు లేకుండా ఈ మూవీ ఛాన్స్ ఇస్తామని మేకర్స్ ప్రకటించారు. ఈ క్రేజీ ఛాన్స్ కోసం తమ వివరాలను, పోర్ట్‌ఫోలియోలను ఝశ్రీనెఱబఱఅఱజవతీంవఝుర్ఱఅస్త్రవఏస్త్రఝుఱశ్రీ.ఎశీఎ అనే మెయిల్ చేయాలని ప్రకటనలో పేర్కొన్నారు. మరి ఇంకెందుకు ఆలస్యం మీలోని టాలెంట్ బయటికి తీసి ప్రభాస్ మూవీలో నటించే ఛాన్స్ కొట్టేయండి.




# పాన్ ఇండియా మార్కెట్‌లోకి కిరణ్ అబ్బవరం

తెలుగు యంగ్ హీరోల్లో కిరణ్ అబ్బవరం ఒకడు. షార్ట్ ఫిల్మ్స్‌తో కెరీర్ ప్రారంభించి, రాజావారు రాణిగారు' మూవీతో హీరో అయ్యాడు. తర్వాత పలు సినిమాలు చేశాడు గానీ చాలావరకు ఫ్లాపులే. ఎట్టకేలకు 'క' అనే థ్రిల్లర్ సినిమాతో సక్సెస్ అందుకున్నాడు. దీని తర్వాత వచ్చిన 'దిల్‌రుబా' డిజాస్టర్ కాగా.. కె ర్యాంప్, చెన్నై లవ్ స్టోరీ చిత్రాలు సక్సెస్ అయ్యాయి. ప్రస్తుతం ఓ వెబ్ సిరీస్, దర్శకుడిగా ఓ మూవీ చేస్తున్న కిరణ్ అబ్బవరం.. ఇప్పుడు పాన్ ఇండియా వైడ్ తన అదృష్టం పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యాడు. 'ఇంద్రపుత్ర' పేరుతో మూవీని అనౌన్స్ చేశారు. సోమవారం ఈ టైటిల్ ప్రకటిస్తూ ఓ పోస్టర్ రిలీజ్ చేశారు. కాటమరాయుడు, గాండీవధారి అర్జున, కుడి ఎడమైతే, కాంతార ఛాప్టర్ 1 సినిమాలకు పనిచేసిన శ్రీకాంత్ పుప్పాల దీంతో దర్శకుడిగా మారుతున్నాడు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. కిరణ్ అబ్బవరం పాన్ ఇండియా ప్రయత్నం మెచ్చుకోదగిందే గానీ అదెంత వరకు వర్కౌట్ అవుతుందనేది భవిష్యత్తులో తెలుస్తుంది. ఎందుకంటే పోస్టర్ చూస్తుంటే డివోషనల్ స్టోరీలా అనిపిస్తుంది. కానీ ఈ జానర్ ఇప్పుడు పాతబడిపోయింది. అదే టైంలో కిరణ్ మార్కెట్ కూడా టాలీవుడ్ వరకే పరిమితం. ఈ నిర్మాత గతంలో తెలుగు హీరో సుధీర్ బాబుతో 'జటాధర' అని ఓ మూవీ చేస్తే అది ఘోరంగా ఫెయిలైంది. మరి ఈసారి ఏం చేస్తారనేది చూడాలి?




## బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్న 'ది ఒడిస్సీ'..

### క్రిస్టోఫర్ నోలన్ కెరీర్‌లోనే నంబర్ వన్

హాలీవుడ్ స్టార్ డైరెక్టర్ క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కించిన మోస్ట్ అవైటెడ్ మూవీ 'ది ఒడిస్సీ' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల నుంచి భారీ స్పందన అందుకుంటున్న ఈ సినిమా.. ఈ వీకెండ్‌లో ఏకంగా రెండు ప్రతిష్ఠాత్మక రికార్డులను తన ఖాతాలో వేసుకుంది. ముఖ్యంగా నోలన్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలవడం విశేషం. 'ది ఒడిస్సీ' ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా వి1.1 బిలియన్ గ్రాస్ వసూళ్లను అందుకుంది. దీంతో ఇప్పటివరకు క్రిస్టోఫర్ నోలన్ కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా ఉన్న 'ది డార్క్ నైట్ రైజెస్' రికార్డును ఈ సినిమా అధిగమించింది. ఇంకా ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. చైనా, జపాన్ వంటి కీలక అంతర్జాతీయ మార్కెట్లలో సినిమా పూర్తిస్థాయిలో విడుదల కాకముందే ఈ మైలురాయిని చేరుకుంది. ఈ రెండు మార్కెట్లలో విడుదలైన తర్వాత 'ది ఒడిస్సీ' కలెక్షన్లు మరింత పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.క్రిస్టోఫర్ నోలన్ సినిమాలకు ఐమ్యాక్స్‌తో ఉన్న అనుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. 'ది ఒడిస్సీ'తో ఆ బంధం మరో స్థాయికి చేరింది. ఈ సినిమా ఐమ్యాక్స్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా సరికొత్త చరిత్ర సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా ఐమ్యాక్స్ స్క్రీన్ల ద్వారా ఇప్పటివరకు వి289 మిలియన్లు వసూలు చేసింది. దీంతో జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన విజువల్ వండర్ 'అవతార్' జీవితకాలఐమ్యాక్స్ కలెక్షన్స్ అయిన వి271 మిలియన్లను అధిగమించింది. ఇది నోలన్‌కు మాత్రమే కాకుండా ఐమ్యాక్స్ చరిత్రలోనే ప్రత్యేకమైన విజయంగా మారింది. 'ది ఒడిస్సీ'కి ఇంతటి ప్రత్యేకత రావడానికి మరో ప్రధాన కారణం ఉంది. ఈ సినిమా పూర్తిగా ఐమ్యాక్స్ కెమెరాలతో చిత్రీకరించిన తొలి చిత్రంగా నిలిచింది. భారీ స్థాయి విజువల్స్, యాక్షన్ సన్నివేశాలు, ప్రకృతి దృశ్యాలను సాధ్యమైనంత అద్భుతంగా చూపించేందుకు నోలన్ ప్రత్యేకంగా ఐమ్యాక్స్ ఫార్మాట్‌ను ఉపయోగించారు.థియేటర్లలో ముఖ్యంగా ఐమ్యాక్స్ 70ఎంఎ స్క్రీన్లపై ఈ సినిమాను చూసేందుకు ప్రేక్షకులు భారీగా ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పటికీ పలు ప్రాంతాల్లో ఐమ్యాక్స్ 70ఎంఎ షోలు హౌస్‌ఫుల్ అవుతున్నట్లు సమాచారం.

# చంద్రుడిపై 'మూన్ బేస్'



అంతరిక్ష పరిశోధనల్లో భారత్–అమెరికా మధ్య సహకారం మరింత విస్తరించనుంది. చంద్రుడిపై మానవ పరిశోధనలను ముందుకు తీసుకెళ్లేందుకు అమెరికా చేపడుతున్న ప్రతిష్ఠాత్మక మూన్ బేస్ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా) ఆహ్వానించింది. చంద్రుడి దక్షిణ ధ్రువానికి సమీపంలో మానవులు నివసించేందుకు వీలుగా శాశ్వత స్థావరాన్ని ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. వరుసగా మానవ సహిత, మానవరహిత మిషన్లను నిర్వహించి ఈ స్థావరాన్ని అభివృద్ధి చేయాలని నాసా భావిస్తోంది.

### దక్షిణ ధ్రువంపైనే ఎందుకు?

చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతం ప్రపంచ అంతరిక్ష సంస్థలకు అత్యంత కీలకంగా మారింది. ఈ ప్రాంతంలో నీటి మంచు, ఇతర వనరులు ఉండే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు. భవిష్యత్తులో వ్యోమగాముల జీవనానికి, పరిశోధనలకు ఇవి ఉపయోగపడే అవకాశం ఉంది. దీంతో చంద్రుడి దక్షిణ ధ్రువంపై మరిన్ని పరిశోధనలు చేపట్టేందుకు అమెరికా సహా పలు దేశాలు ప్రయత్నిస్తున్నాయి. చంద్రుడిపై శాశ్వత స్థావరాన్ని ఏర్పాటు చేయడం ద్వారా వ్యోమగాములు అక్కడ నివసిస్తూ, పనిచేస్తూ, శాస్త్రీయ పరిశోధనలు చేసే అవకాశం కల్పించాలన్నది మూన్ బేస్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. అంతేకాకుండా భవిష్యత్తులో చంద్రుడిని దాటి సుదూర అంతరిక్ష ప్రాంతాలకు మానవులను పంపేందుకు అవసరమైన సాంకేతికతను అభివృద్ధి చేయడంలోనూ ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని నాసా చెబుతోంది.

### ఆర్టెమిస్ ఒప్పందాల ఆధారంగా!

భారత్, అమెరికా మధ్య ఇప్పటికే కొనసాగుతున్న అంతరిక్ష భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే క్రమంలో నాసా ఈ ఆహ్వానం ఇచ్చింది. ఆర్టెమిస్ అకార్డ్స్ కింద ఇరు దేశాల మధ్య ఉన్న భాగస్వామ్యాన్ని ఆధారంగా చేసుకుని ఇస్రోను మూన్ బేస్ కార్యక్రమంలో భాగం కావాలని నాసా కోరింది. చంద్రుడిపై మానవ పరిశోధనలు, శాస్త్రీయ సమాచార మార్పిడి, సాంకేతిక సహకారం వంటి అంశాల్లో భారత్–అమెరికా కలిసి పనిచేసేందుకు ఈ ప్రతిపాదన ఉపయోగపడనుంది. ఈ కార్యక్రమంలో ఇస్రో భాగస్వామ్యం అయితే చంద్రుడిపై భవిష్యత్తు పరిశోధనల్లో భారత్ పాత్ర మరింత పెరగనుంది.

### బెంగళూరులో సమావేశం

భారత్–అమెరికా సివిల్ స్పేస్ జాయింట్ వర్కింగ్ గ్రూప్ తొమ్మిదో సమావేశం ఆగస్టు 5, 6 తేదీల్లో బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి భారత్ ఆతిథ్యం ఇచ్చింది. ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న అంతరిక్ష సహకారాన్ని మరింత విస్తరించడం, కొత్త రంగాల్లో కలిసి పనిచేయడం వంటి అంశాలపై అధికారులు చర్చించారు. ఇప్పటికే కుదిరిన ఒప్పందాలను మరింత బలోపేతం చేసుకోవడంతో పాటు శాస్త్రీయ సమాచారాన్ని పరస్పరం పంచుకోవడం, భవిష్యత్తు పరిశోధనల్లో సహకారాన్ని పెంచుకోవడంపై ఇరు దేశాలు అంగీకరించాయి. సాధారణ అంతరిక్ష పరిశోధనలతో పాటు వాణిజ్య అంతరిక్ష రంగంలోనూ భాగస్వామ్యాన్ని విస్తరించుకోవాలని నిర్ణయించాయి.

### నిసార్ మిషన్ విజయంతో!

ఇటీవల విజయవంతమైన నాసా–ఇస్రో సంయుక్త నిసార్ మిషన్ కూడా సమావేశంలో చర్చకు వచ్చింది. భూమిని పరిశీలించేందుకు నాసా, ఇస్రో కలిసి ఈ మిషన్‌ను చేపట్టాయి. ఈ మిషన్ విజయంతో రెండు దేశాల అంతరిక్ష సంస్థల మధ్య సహకారానికి మరింత ఊతం లభించింది. నిసార్ మిషన్ తర్వాత కూడా అంతరిక్ష శాస్త్రం, సాంకేతిక రంగాల్లో మరిన్ని సంయుక్త కార్యక్రమాలను చేపట్టాలని ఇరు దేశాలు భావిస్తున్నాయి. భవిష్యత్తులో మానవ అంతరిక్ష ప్రయాణానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధిపైనా కలిసి పనిచేయాలని చర్చించాయి.

### ట్రస్ట్ కార్యక్రమం కింద!

అంతరిక్షంతో పాటు కీలక సాంకేతిక రంగాల్లో భారత్–అమెరికా సహకారాన్ని పెంచేందుకు ట్రస్ట్ కార్యక్రమం కింద కూడా చర్చలు కొనసాగుతున్నాయి. రక్షణ, కృత్రిమ మేధ, సెమీకండక్టర్లు, క్వాంటమ్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ, ఇంధనం, అంతరిక్షం వంటి రంగాల్లో సహకారాన్ని పెంచుకోవడం ఈ కార్యక్రమం లక్ష్యం. ఇందులో భాగంగా అంతరిక్ష రంగంలోనూ కొత్త అవకాశాలను అన్వేషించాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. శాస్త్రీయ పరిశోధనలతో పాటు వాణిజ్య అంతరిక్ష రంగంలో సహకారం పెంచుకునే అంశాలపైనా దృష్టి సారించాయి.

### శాస్త్రీయ సమాచార మార్పిడి

ఆర్టెమిస్ ఒప్పందాల కింద శాస్త్రీయ సమాచారాన్ని పరస్పరం పంచుకోవడంపై చర్చలను ముందుకు తీసుకెళ్లాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. అంతరిక్ష పరిశోధనల్లో లభించే సమాచారాన్ని శాస్త్రవేత్తలు పరస్పరం ఉపయోగించుకోవడం ద్వారా కొత్త పరిశోధనలకు అవకాశం ఏర్పడుతుందని భావిస్తున్నారు. అంతరిక్షాన్ని శాంతియుత ప్రయోజనాల కోసం వినియోగించడం, భవిష్యత్తులో అంతరిక్ష కార్యకలాపాలు దీర్ఘకాలికంగా, సురక్షితంగా కొనసాగేందుకు అవసరమైన చర్యలపైనా చర్చించారు. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని అంతరిక్ష కార్యకలాపాల దీర్ఘకాలిక స్థిరత్వానికి సంబంధించిన మార్గదర్శకాలను అమలు చేయడానికి ఇరు దేశాలు తమ నిబద్ధతను పునరుద్ఘాటించాయి.

# శబరిమల మహిళల ప్రవేశంపై అక్టోబర్‌లో సుప్రీం తీర్పు



దేశవ్యాప్తంగా ఎంతో ఉత్కంఠ రేపుతున్న శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశంపై రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఈ ఏడాది అక్టోబర్‌లో వెలువడుతుందని సుప్రీంకోర్టు మంగళవారం వెల్లడించింది. బోధ్? గయ ఆలయ నిర్వహణ కేసు విచారణ సందర్భంగా భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, శబరిమల విషయంపై మౌఖికంగా చెప్పారు. ఈ విషయాన్ని పిటిషనర్లలో ఒకరి తరపున వాదిస్తున్న న్యాయవాది అమోల్ బి కరాండే చెప్పుకొచ్చారు. తొమ్మిది మంది న్యాయమూర్తుల ధర్మాసనం రిజర్వ్ చేసిన శబరిమల తీర్పు తర్వాత బోధ్ గయ పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తామని సీజేఐ మౌఖికంగా చెప్పినట్లు పేర్కొన్నారు. ఈ కేసును అక్టోబర్ 6వ తేదీకి షెడ్యూల్ చేశారని ఈటీవీ భారత్‌కు తెలిపారు. ఈ ఏడాది మే 14న కేరళలోని శబరిమల ఆలయంతో సహా మతపరమైన ప్రదేశాల్లో మహిళలపై వివక్షకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టు తన తీర్పును రిజర్వ్ చేసింది. ఇందులో బహుళ మతాలు పాటించే మత స్వేచ్ఛ పరిధి, విస్తృతికి సంబంధించిన పిటిషన్లను విచారించింది. ఈ తొమ్మిది మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 16 రోజుల పాటు విచారించింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సీనియర్ న్యాయవాదులు సి.ఎస్. వైద్యనాథన్, అభిషేక్ సింఘ్వీ, ముకుల్ రోహత్గీ, ఇందిరా జైసింగ్, నీరజ్ కిషన్ కౌల్, గోపాల్ శంకరనారాయణన్ తదితరులు చేసిన వాదనలను పరిగణనలోకి తీసుకుంది. భారత రాజ్యాంగం అప్పగించిన న్యాయ సమీక్ష అనే విధిని తాము చిత్తశుద్ధితో నిర్వర్తిస్తామని తీర్పు రిజర్వ్ చేసే సమయంలో సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. సామాజిక సంస్కరణ, సంక్షేమం అంశాల్లో ఆ బాధ్యతను త్యజించేది లేదని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని విస్తృత రాజ్యాంగ ధర్మాసనం అభిప్రాయపడింది. రాజ్యాంగం ప్రకారం సామాజిక సంక్షేమం, సంస్కరణల బాధ్యత శాసన నిర్మాణ వ్యవస్థదే అయినప్పటికీ ఆ అంశాల్లో న్యాయవ్యవస్థకు కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో అధికారం ఉంటుందని ఈ కేసులో కోర్టు సహాయకుడి (అమికస్ క్యూరీ)గా ఉన్న సీనియర్ న్యాయవాది కె.పరమేశ్వరన్ పేర్కొన్నారు. అత్యుత్సాహవంతుడైన సంస్కరణవాదిగా న్యాయ వ్యవస్థ ఉండదని, అదే సమయంలో ప్రేక్షక పాత్రకూ పరిమితం కాబోదని తెలిపారు. ఈ వాదనతో ఏకీభవించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, రాజ్యాంగ విధిని న్యాయవ్యవస్థ విస్మరించజాలదని స్పష్టం చేశారు. అటు మతపరమైన ఆచారాల వ్యవహారాల్లో కోర్టుల న్యాయసమీక్ష తగదని కేంద్రం తరఫున వాదనలు వినిపించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు. శబరిమలలో 10–50 ఏళ్ల మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ 2018లో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. ఈ వయసు మహిళలకు ఆలయంలోకి ప్రవేశం నిరాకరణ అంటరానితనంగా, రాజ్యాంగ అధికరణం 17కు ఉల్లంఘనగా ఉందని తీర్పులో అత్యున్నత న్యాయస్థానం అభివర్ణించింది. అయితే, ఆ తర్వాత ఈ తీర్పుపై సుప్రీం కోర్టులో పలు రివ్యూ పిటిషన్లు దాఖలయ్యాయి. ఫలితంగా ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి బదిలీ చేస్తూ 2019 నవంబరులో నాటి సీజేఐ జస్టిస్ రంజన్ గొగొయ్ నిర్ణయించారు. ఈ క్రమంలో సుప్రీం కోర్టులో విస్తృత రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేపట్టి తీర్పును రిజర్వ్ చేసింది. ఈ ధర్మాసనంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్? సూర్యకాంత్‌తో పాటు జస్టిస్ బి.వి. నాగారత్న, జస్టిస్? ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్? అహ్సానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసిహ్, జస్టిస్? ప్రసన్న బి. వరలే, జస్టిస్? ఆర్. మహాదేవన్, జస్టిస్? జోయ్?మాల్య బాగ్చి ఉన్నారు.

## సరైన దుస్తులు ధరించండి

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యే అనిల్ ఝా వత్స్‌పై ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజల ముందు, ముఖ్యంగా మహిళల సమక్షంలో ఆయన బనియన్, నిక్కరు ధరించి కూర్చున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, ముఖ్యమంత్రి అసెంబ్లీ వేదికగా ఆయన ప్రవర్తనను తప్పుబట్టారు.

వాయువ్య ఢిల్లీలోని కిరారి నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ ఝా, తన కార్యాలయంలో బనియన్, నిక్కరుతో కుర్చీలో కూర్చుని ఉండటం ఆ వీడియోలో కనిపిస్తోంది. ఒడిలో కాషాయ కండువా వేసుకుని, లక్ష్మీ యోజన పథకానికి సంబంధించిన పత్రాలపై ఆయన సంతకాలు చేస్తున్నారు. ఆ సమయంలో మహిళలతో సహా పలువురు ప్రజలు ఆయన చుట్టూ క్యూలో వేచి ఉన్నారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.

సోమవారం అసెంబ్లీ వర్షాకాల సమావేశాల సందర్భంగా ఈ అంశాన్ని ప్రస్తావించిన ముఖ్యమంత్రి రేఖా గుప్తా, ఎమ్మెల్యే ప్రవర్తన సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. "మీ ప్రవర్తన అత్యంత విచారకరం. మహిళలు పత్రాలపై సంతకాలు చేయించుకోవడానికి వచ్చినప్పుడు కనీసం సభ్యతతో కూడిన వస్త్రధారణ ఉండాలి కదా" అని ఆమె మండిపడ్డారు. ప్రజాప్రతినిధిగా ఇలా వ్యవహరించడం ఆమోదయోగ్యం కాదని, ఆయన శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అయితే, ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేలు సభలో నిరసన వ్యక్తం చేశారు.

## 'కేరళ' ఇకపై 'కేరళం'..



కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మారుస్తూ ప్రతిపాదించిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. మంగళవారం విపక్ష సభ్యుల నినాదాలు, నిరసనల మధ్య ఎటువంటి చర్చ లేకుండానే ఈ బిల్లును సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఫలితంగా రాష్ట్రం పేరు మార్పు ప్రక్రియలో మరో కీలక ఘట్టం పూర్తయింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో లేకపోవడంతో, ఆయన తరఫున హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ 'కేరళ (పేరు మార్పు) బిల్లు, 2026'ను ప్రవేశపెట్టారు. ఢిల్లీలో నిరసనకారులపై పోలీసుల చర్యలతో పాటు ఇతర కీలక అంశాలపై అమిత్ షా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఆందోళన చేపట్టాయి. ఈ గందరగోళ పరిస్థితుల నడుమనే బిల్లుకు సభ ఆమోదం ముద్రవేసింది. మలయాళంలో తమ రాష్ట్రాన్ని 'కేరళం' అని పిలుస్తారని, అధికారికంగా కూడా అదే పేరును ఖరారు చేయాలని కేరళ శాసనసభ 2024 జూన్‌లో తీర్మానం చేసింది. ఈ ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన అనంతరం, రాష్ట్రపతి ఈ ముసాయిదా బిల్లును రాష్ట్ర అసెంబ్లీకి పంపారు. 2026 జులైలో అసెంబ్లీ దీనికి ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది.

## భారత్‌లో అరుణాచల్ అంతర్భాగం.. మార్చడం ఎవరితరం కాదు: కేంద్రం




అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమని విదేశాంగ శాఖ మరోసారి స్పష్టం చేసింది. అది ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగంగానే ఉంటుందని పేర్కొంది. ఈ వాస్తవాన్ని మార్చడం ఎవరితరం కాదని తేల్చిచెప్పింది. అరుణాచల్‌లో 27 ప్రాంతాలకు భారత పేర్లను అధికారికంగా గుర్తించడంపై చైనా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో భారత్ ఈ మేరకు స్పందించింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో విడదీయలేని, అంతర్భాగమని పేర్కొన్నారు. ఈ విషయంలో ఎలాంటి సందేహాలకు తావులేదన్నారు. భారత నిర్ణయాన్ని 'చెల్లదు' అంటూ చైనా చేసిన ప్రకటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. ఈ వాస్తవాన్ని ఎవరూ మార్చలేరని స్పష్టం చేశారు. భారత్–చైనా సంబంధాల్లో సరిహద్దు అంశాలు అత్యంత కీలకమైనవని జైస్వాల్ తెలిపారు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతత కొనసాగడం రెండు దేశాల విస్తృత సంబంధాలకు ఎంతో ముఖ్యమన్నారు. సరిహద్దు పరిస్థితులు ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపుతాయని స్పష్టం చేశారు. ఆగస్టు 6న జరిగిన భారత్–చైనా సరిహద్దు వ్యవహారాల సంప్రదింపులు, సమన్వయ యంత్రాంగం 36వ సమావేశంలో వాస్తవాధీన రేఖ వెంట పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతత కొనసాగించాల్సిన అవసరాన్ని భారత్ మరోసారి నొక్కి చెప్పిందన్నారు. పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఇప్పటికే ఉన్న దౌత్య, సైనిక మార్గాలను కొనసాగించాలని రెండు దేశాలు అంగీకరించినట్లు జైస్వాల్ తెలిపారు. డబ్ల్యూఎంసీసీ సమావేశాలు, స్థానిక కమాండర్ స్థాయి చర్చలు సహా ఇతర అంగీకరించిన మార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

## మా డిమాండ్లలో ఎలాంటి మార్పు లేదు

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రతిష్టంభన కొనసాగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. విపక్షాలు తమ డిమాండ్లను మార్చలేదని అన్నారు. విద్యార్థులపై పోలీసుల చర్య, రామ మందిర విరాళాల వ్యవహారం, ప్రభుత్వ క్షమాపణ వంటి మూడు అంశాలపై తమ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు. ఈ అంశాలపై ప్రభుత్వం పార్లమెంట్?లో స్పష్టమైన ప్రకటన చేసే వరకు వాటిని లేవనెత్తుతామని తెలిపారు. పార్లమెంట్ ప్రాంగణంలో మంగళవారం మీడియాతో మాట్లాడిన ఖర్గే ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.

"మేం మా లక్ష్యాన్ని మార్చుకోవడం లేదు. మొదటి నుంచే మా వైఖరి ఒకటే. మూడు నిర్దిష్ట అంశాలపై మేం సమాధానం కోరుతున్నాం. మొదటి అంశం విద్యార్థులపై జరిగిన లాఠీఛార్జి, కాల్పులకు సంబంధించినది. ఈ ఆదేశాలు ఎవరు ఇచ్చారు? అవి ఎలా జరిగిందో మేం తెలుసుకోవాలనుకుంటున్నాం. దీనిపై సభలో సమాధానం కావాలి. లాఠీఛార్జి వల్ల పలువురు విద్యార్థులు అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో పాలయ్యారు. 100 మందికిపైగా స్వల్పంగా గాయపడ్డారు. మరికొందరికి పెల్లెట్ గన్? గాయాలయ్యాయి. ఈ విషయంపై ప్రభుత్వం ప్రకటన చేయాలని కోరుతున్నాం. ఘటన జరిగి 18 రోజులు గడిచినా పూర్తి స్థాయి సమాధానం ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదు. వారు కేవలం ఓ చిన్న ప్రకటన చేసి అంశాన్ని ముగించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉంది. విద్యార్థులపై పోలీసుల చర్యతో పాటు రెండోది రామ మందిర విరాళాల చోరీ. ఇక మూడోది, క్షమాపణలు చెప్పాలి. ఈ మూడు డిమాండ్లు మొదటి నుంచే ఉన్నాయి. ఇప్పటికి కొనసాగుతున్నాయి. పరిష్కారం లభించే వరకు వాటిని విపక్షాలు లేవనెత్తుతాయి"

### ఝార్ఖండ్ అంశం వేరు

ఝార్ఖండ్‌లో జేపీఎస్?సీ–జేఎస్?ఎస్?సీ పరీక్షల అవకతవకలకు వ్యతిరేకంగా విద్యార్థులు చేస్తున్న ఆందోళనపై కాంగ్రెస్ వైఖరిని ప్రశ్నించడంపై కూడా ఖర్గే స్పందించారు. ఝార్ఖండ్ అంశం పూర్తిగా వేరే విషయమని చెప్పారు. వందలాది అంశాలుంటే వాటిన్నింటినీ ఒకేరోజు చర్చిస్తామా అని అన్నారు. ప్రతి సమస్యను ఒకేసారి సభలో ప్రస్తావించాలా అని ప్రశ్నించారు. ఒక్కో అంశాన్ని దాన్ని ప్రాధాన్యత సందర్భాన్ని బట్టి చర్చిస్తామని తెలిపారు. అంతకుముందు పార్లమెంట్? ప్రాంగణంలో ఝార్ఖండ్? విద్యార్థుల ఆందోళనపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ స్పందించారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఝార్ఖండ్‌లో నిరసన చేస్తున్న విద్యార్థులను కలిశారని తెలిపారు. అలాగే ఎన్?డీఏ ఎంపీలు చేసిన నిరసనపై స్పందిస్తూ, పార్లమెంట్? ప్రాంగణంలో ఇలా చేయడం మొదటిసారి చూస్తున్నానని వ్యాఖ్యానించారు. కనీసం వారిని ఇలా నిరసనకు దిగేలా చేశామని అన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్‌కు వచ్చి ప్రకటన చేయాలని ప్రియాంక గాంధీ డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆందోళన, పోలీసుల చర్యలపై ప్రభుత్వం సభలో సమాధానం ఇవ్వాలని కోరారు.

### 'మోదీ, షా సభకు రావడం లేదు'

ఇక సోమవారం ఖర్గే కలిసి రాహుల్? గాంధీ మీడియా సమావేశంలో కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. పార్లమెంట్?లో ప్రతిష్టంభనకు ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షానే కారణమని ఆరోపించారు. సాధారణ అంశాలపై అమిత్ షా అభిప్రాయం వినడం తమకు అవసరం లేదని రాహుల్ గాంధీ అన్నారు. నిరసన చేస్తున్న విద్యార్థులపై పెల్లెట్ గన్ కాల్పులకు ఆదేశాలు ఇచ్చారా? లేదా? అనే విషయాన్ని హోంమంత్రి సభలో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల నిరసనలు, పోలీసుల చర్యలపై చర్చకు అమిత్ షా సిద్ధంగా ఉన్నారని ప్రభుత్వం పేర్కొన్న నేపథ్యంలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు.

## ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం..



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రజలు చురుగ్గా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని కోరారు. 'హర్ ఘర్ తిరంగా.. ఘర్ ఘర్ తిరంగా.. హర్ మన్ తిరంగా' అంటూ దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను షేర్ చేసుకున్న ప్రధాని.. ఆగస్టు 15ను గర్వంగా జరుపుకోవాలని సూచించారు. 'వికసిత్ భారత్' నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. "ప్రతి ఇంటా హర్ ఘర్ తిరంగాను ఓ వేడుకగా మార్చుకుందాం" అని పేర్కొన్నారు. ఇటీవల 'ఎక్స్' వేదికగానూ మోదీ 'హర్ ఘర్ తిరంగా'లో ఉత్సాహంగా పాల్గొనాలని ప్రజలను కోరారు. త్రివర్ణ పతాకం దేశ గర్వానికి ప్రతీక అని తెలిపారు. దేశం కోసం అత్యుత్తమంగా పనిచేయాలనే స్ఫూర్తిని అది అందిస్తుందని పేర్కొన్నారు. ఈ ఏడాది 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని 'వందేమాతరం' 150వ వార్షికోత్సవానికి అంకితం చేస్తున్నట్లు ప్రధాని తెలిపారు. దేశభక్తి, త్రివర్ణం పతాకంపై గర్వం, మాతృభూమిపై ప్రేమను చాటేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా ప్రారంభమైన 'హర్ ఘర్ తిరంగా' ద్వారా జాతీయ పతాకంతో ప్రజలకు మరింత వ్యక్తిగత అనుబంధం ఏర్పడేలా ప్రోత్సహిస్తున్నారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137